

ఆంధ్రమహిళ

AM_NOV_1954 11





దీపావళి దీపాలు

"అమవస చీకట్ల నాకాశమునకంపి
మిరుమిట్లు కొల్పేటి మెఱుపు దీపాలు
మిద్దె మేడలమీద మింటి చుక్కలదాక
వేయిక్షంగుల వెల్గు వింతదీపాలు"

"ఆంధ్ర మహిళ"

సంపాదకురాలు :

ప్రచురణ :

సంయుక్త సంపాదకురాలు :

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: నవంబరు '54 :: సంచిక 7

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు.

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

రచనలు ప్రచురించనివానిని త్రిప్పి పంపగోరేవారు బుక్‌పోస్టుకు అవసరమైన స్టాంపు. అణా స్టాంపుకు తక్కువకాకుండా పంపాలి.

రచనలు కాగితానికి ఒకే వైపు సిరాతో వ్రాసి పంపాలి.

రచనలు మాకు చేరిన విషయాన్ని, ప్రచురణ విషయాన్ని తెలియపర్చలేము.

సమీక్షకు గ్రంథాలు పంపేవారు రెండు ప్రతులు పంపవలసినదని మనవి.

ఆంధ్ర మహిళ

సంపుటి 11 :: నవంబరు '54 :: సంచిక 7

మన సంస్కృతి సంరక్షణ

— — :o: ——

గర్తపురి సీమలో— కృష్ణానదీతీరమున పల్నాడు తాలూకాలో మాచర్లకు పదునారు మైళ్ళ దూరములో— నాగార్జున కొండ గలదు. అది నిజముగ నొక కొండకాదు. ఒక సుందరమైన లోయ. ఆ లోయలో పూర్వము అతి ప్రాచీనమైన విశ్వవిద్యాలయముండేడిదట. విదేశములనుండికూడ విద్యార్థులు వచ్చి అచ్చట విద్య పడయుచుండెడివారని చెప్పుదురు. అనేక బౌద్ధాలయములు, మండపములు, విహారములు, స్థూపములుండెడివట. అవి ఇప్పుడు జీర్ణమై శిథిలమై యున్నవి. కొంతవరకు ప్రభుత్వ పురావస్థు శాఖవారు ఆ శిథిలములనుండి త్రవ్విన శిల్పములను భద్రపరచినారు. ఇప్పుడు నందిగొండ ప్రాజక్టు నిర్మాణముతో నాగార్జున లోయ జలమయం కాగల ప్రమాదం ఏర్పడినది. కాబట్టి ఈ శిథిలములను సంపూర్ణముగా త్రవ్వి వాటిని జాగ్రత్త పరచుకొనవలసిన అవసరము ఏర్పడినది. మొన్ననే అచ్చట త్రవ్వుటకు ఆరంభించినారు. ఎట్టి అపూర్వ కళా శిఖరములు బయల్పడగలవో! అచ్చట త్రవ్వు ప్రతి రాయి ఎదోచెప్పుచున్నట్లుండును. ప్రతి శిలా ఏదో కళా శిల్పపు తునకే. వీటినన్నిటిని జాగ్రత్తపరచుట ప్రభుత్వ కర్తవ్యము. ప్రభుత్వమునకు వలయు సహకారము ఆంధ్ర ప్రజలిచ్చుట వారి ధర్మము.

మాచర్లలోగాని ఆ సమీపములో ఎచ్చటైనగాని ఒక పెద్ద భవనములో ఈ శిథిలములను జాగ్రత్తపరచి ఒక సుందరమైన ప్రదర్శన శాలగా ఏర్పాటుచేయుట అవసరము. శిథిలములను త్రవ్వుట ఒక వంతు. త్రవ్వినవాటిని చక్కగ నేర్పాటుచేయుట నొక వంతు. ఈ శిలాఖండములతో ఏర్పాటైన ప్రదర్శనశాల మన అపూర్వ సంస్కృతిని సంరక్షించినదగును. అంతేకాదు. ముందు తరములవారికి ఈ అపూర్వ సంపదను క్రమముగా నిచ్చినవారమగుదుము. ప్రభుత్వము, ప్రజలు, కళావేత్తలు, కళాభిమానులు అందరు సహకరించి ఎట్టి ప్రదర్శన శాలను నిర్మింతురో చూడవలసియున్నది. ఇది కేవలము సాధారణ వస్తుసముదాయపు ప్రదర్శనశాల గాకపోవుటచేతను, అపూర్వ కళా సంస్కృతులు నిబిడీకృతమైయున్న వస్థు సముదాయపు ప్రదర్శనశాలగావునను అందరూ ఎంతో ఆతురతతో ఈ ప్రదర్శనశాల నిర్మాణమును అపేక్షింతురు.

అతివృష్టి - అనావృష్టి

వెనకటికి మా వూళ్ళో ఒకావిడ ఉండేది. పోయిన వాళ్ళు పోగా మిగిలిన సవితి బిడ్డలను వేసుకొని ఉన్నా కొంపా గోడుతో కాలక్షేపం చేస్తుండేది. ఇల్లు అన్న పేరేగాని సూర్య - చంద్రులు, వరుణ - వాయుదేవుళ్ళు యథేచ్ఛగా విహరించేటట్లుండేది. వర్షం కారుతుంటే కిటికీలలో తలదాచుకొనేవారు పిల్లలు. చూచిన వారెవరైనా "ఇల్లు మరమ్మత్తు చేయించుకోరాదా ?" అంటే- ఇప్పుడెలాగ చెప్పండి వర్షాల్లోను ?" అనేది. వర్షాకాలం గడిచి ఎండలు కాస్తున్నప్పుడు ఏ 'వదిన' ఐనా ఉండబట్టలేక "ఇల్లు ఇప్పుడే నేయించుకోరాదటమ్మా" అంటే "ఇప్పుడెందుక్కు చెప్పు వదినా - వర్షాలు లేనిదానికి ?" అనేది - ఇక కొంప బాగుపడ్డం ఎప్పుడు ! పాపం గడవక అలా చెప్పేదో, సవితితల్లి ప్రేమో, దైవానికే ఎరుక.

పాశ్చాత్త్య ప్రభుత్యంకూడ స-రి-గ్గా అదే పద్ధతిలో పెట్టి పోయింది మన కొంపను. రెండు వందల ఏళ్ళు పెత్తనం సాగించింది ఈ కొంపలో. అనావృష్టి వల్ల అనేక కాటకాలొచ్చేయి, అతివృష్టి వల్ల అనేక వరదలువచ్చాయి; ఎప్పటి కప్పుడే కమిటీ నియామకాలు, రిపోర్టులు, కళ్ళుతుడిచే రిలీఫ్ మెజర్సు ! వానలు - వరదలు లేనప్పుడు సరేసరి - ఎవరికీ ఆగోల అక్కరలేదు ! అసలు వీటికేవైనా శాశ్విత నివారణోపాయాలు, పథకాలు వేయాలన్న ఉద్దేశం (వాట్టింగుగానున్న) లోపించిన సవితితల్లి ప్రేమలో, అంకినదంతా తమ దేశానికి తర్లించుకు పోవాలన్న పాశ్చాత్త్య ప్రభుత్వ విధానంలో, ఇంతకంటె వేరే సౌకర్యాలు లభిస్తాయని మనంమాత్రం ఎందుకనుకోవాలి ! దానికితోడు, మన హైందవుల వేదాంతం ఒకటి - "అంతా మనకర్మం - విధినియామకం" అన్న సంతృప్తి ! ఇక ఇలాంటి పరిస్థితులలో వీటికి నివారణోపాయాలు మార్గాంతరాలు ఏమిటి !

అందుకే ఫలితాలు అనుభవిస్తున్నాం. ఉన్న పరిస్థితులు అవగాహన చేసుకొనుట మంచిది —

అనావృష్టిక్షామాలు :— సంభవించిన సంవత్సరాలు : 1875-76, 1896—97, 1899—1900, 1907—08, 1909, 1921—22, 1924, 1931—32, 1934—35, 1937—38, 1941, 1942—43, 1945—46, 1951—52 అన్నిటికంటే మనచెవులతో మనం విన్నాం — బెంగాలు క్షామమూ లక్షలాది ప్రజల మరణాలూ; మనకళ్ళతో మనం చూచేం రాయలసీమలో 42—43 సం॥లో హృదయ విదారక క్షామపరిస్థితులు, అప్పటి యుద్ధాలవల్ల యీ బాధ మరీ దారుణం, దుర్భరంఐంది. 51—52 పరిస్థితులు కూడా మర్చిపోలేం. నెహ్రూప్రధాని శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్‌గార్ని పంపడం, అనేక రిలీఫ్‌సౌకర్యాలు (భూమి శిస్తులరిమిషన్, తక్కావీ అప్పులు, రోడ్లు — చెరువులు వంటి రిలీఫ్‌పనులు — ధర్మాలు వగైరాలు) కల్పించడం అంతా ఎరిగిందే. ప్రజనష్టం — ఇంత అంత అని చెప్పలేం.

ఎన్నో ఫేమిన్‌కమిషన్లు విచారణలు జరిపాయి. 1939 లో ఫేమిన్‌కోడ్ రివిజన్ జరిగింది. 1941 లో రాయలసీమ ఆర్థికాభివృద్ధి బోర్డును నియమించడం, దాన్ని 49 లో కరిగించడం కూడ జరిగింది. ఈ బోర్డువారు సాధించదలుచుకున్న పనులన్నీ నెరవేరలేదు.

అతివృష్టి బాధలు :— ఇవి సంభవించిన సంవత్సరాల వివరాలు సరిగ్గాలభించడంలేదు. గాని స్వరాజ్యంవచ్చాక గూడ అనేక వరదలవార్తలు విన్నాం-కన్నాం-స్వయంగా అనుభవించాం గూడ. ఒక్కసారి గతసంవత్సరం తూర్పుగోదావరిలోని వరదలు, ఈ పశ్చిమగోదావరిలోని దెబ్బలు జ్ఞప్తికి తెచ్చుకోండి. దేశంలో యు. పి. ఉత్తర బీహార్, పశ్చిమబెంగాల్, అస్సామ్ వరదలు కల్పించిన ప్రళయం, ప్రజానష్టం పంటలనష్టం- ఇళ్ళనాశనం భూమి కోత, రస్తాలు—రోడ్లపాడు ఇటీవల హైదరాబాదు రైళ్ళ ప్రమాదాలు ఇలా ఎంతని వర్ణించగలం వీటి బీభత్సం. గత ఐదేళ్ళ వివరాలు :— అస్సాంలో 4 గొప్పవరదలు, బీహారులో 2 గొప్పవీ 2 చిన్నవీ, పశ్చిమ బెంగాలు, ఉత్తర ప్రదేశాలు రెంటిలోను కూడ 3 బ్రహ్మాండమైన అతివృష్టి దెబ్బలు. వరదలో మునిగిన విస్తీర్ణం 19[illegible] లో 60 లక్షలఎకరాలు, 1953 లో 100 లక్షలు, ఈ సంవత్సరం ఎన్నడూ కనీ వినీ ఎరుగని ద్రిబునగర్ వరదల్లో మునిగిపోయినవి 120 లక్షలఎకరాలు ! వీటివల్ల ఆస్తి నష్టం 135 కోట్లరూ. అని చెప్పొచ్చుగాని ఇన్ని వేల ప్రజా పశువులూ చచ్చేరని ప్రజలు అనుభవించిన కష్టాలు ఇంతని చెప్పలేం. యదార్థబాధలు అనుభవించిన వారికే తెలుస్తాయి.

అతివృష్టి - అనావృష్టి

సమస్యాపరిష్కారం : — పాశ్చాత్య ప్రభుత్వం కల్పించి పోయిన సమస్యలతోబాటు, ఇలా 3, 4 ఏళ్ళ కొకసారి క్షామదేవత మనల్ని చూచిపోతూంది, ఏటేటా గంగాభవాని వచ్చి మనల్ని మనకొంపల్ని ముంచుతూ వుంది. వీటికి శాశ్వత నివారణోపాయాలు ఎలాగని ప్రజలు, ప్రభుత్వం దీర్ఘంగా ఆలోచించి చేయీ చేయీ కలిపి కృషిచేస్తే ఏదీ అసాధ్యంకాదు. పూర్వం కూడ ప్రజాక్షేమం కోరిన ప్రభువులూ, వారికి పూర్తి సహకారాన్నిచ్చి తోడ్పడ్డ ప్రజలూ అనేక ఆనకట్లు, ఏటిగట్లూ చెరువులూ వగైరాలు నిర్మించారు. ఆమెరికాలో "టెన్నిసీవేలీ అధారిటీ" గావించిన కృషి ప్రపంచ ప్రఖ్యాతి నందింది. నదుల్ని వరదల్ని సక్రమవిధానంలోకి తెచ్చి, అనేక సౌకర్యాలు కల్పించి, ఒకప్పుడు యమలోకంగా ఉండే ప్రాంతాల్ని స్వర్గతుల్యంగా మార్చేయ గలిగారు మానవులు. పోనీ వారికి యంత్రాలున్నాయి- చేశారను కుందాం. ఇటుచైనా చూడండి. కేవలం ప్రజలు లక్షలు వేలూ పనిచేసి బ్రహ్మాండమైన గట్లువేసి అనేకం సాధించారు. ఇలామనం కూడా ఎందుకు చేయలేం ?

ఇండియా ప్రభుత్వంవారు వరదబాధితులకు 175 కోట్ల రూ.లు ఖర్చు పెట్టవచ్చు. అది తాత్కాలిక ఉపశమనానికేగాని, మనపరిస్థితులు మారవు. నెహ్రూ ప్రధాని సారథ్యంతో యీనాటికి వరద నివారణోపాయమునకు ఒక కేంద్ర కమిటీని నియమించడం, అన్ని రాష్ట్రాలు వీరితో సహకరించి శాశ్వత మార్గాన్వేషణ గావిస్తారనడం చాల హర్షింపదగ్గ హంశం. ఇలాంటి పనులు కేవలం ప్రభుత్వమే గావించాలంటే అయ్యేవిగావు. ప్రత్యేవక్తి సహకార సానుభూతుల నిచ్చి తోడ్పడితే ఏదీ దుస్సాధ్యంగాదు— అనేక బ్రహ్మాండమైన ప్రాజెక్టులు నిర్మించవచ్చు. అపారమైన సేవ మనకు మనమే గావించుకోవచ్చు.

★

కె. సు.



కృతజ్ఞత

శ్రీమతి సి. బి. విశాలాక్షి.గారు. ఆంధ్ర మహిళా సభకు నూరురూపాయిలు విరాళమిచ్చి శాశ్వత సభ్యురాలిగా యెన్నుకోబడ్డారు. సభయన్న యీమెకున్న ఆదరాభి మానములకు మా కృతజ్ఞత.

దసరా మహోత్సవ సందర్భంలో శ్రీమతి న్యాపతి వెంకటరమణమ్మగారు, కుమారి అనసూయా దీనదయాళ్‌గారు కూడా చెరియొక వందరూపాయిలు విరాళమిచ్చి శాశ్వత సభ్యురాండ్రుగా యెన్నుకోబడ్డారు. చిన్ననాటినుండి మనసభలో సన్నిహిత సంబంధం కలిగియుండి సభాకార్యక్రమంలో ఉత్సాహంతో పాల్గొంటున్న వీరికి మా అభివందనములు.

ఆంధ్ర మహిళాసభ "మైక్‌ఫండు" కు శ్రీమతి టి. జి. హైమవతిగారు రెండువందల రూపాయిలు విరాళమిచ్చారు. సోదరి హైమవతి మనసభ శాశ్వత సభ్యురాలు మాత్రమేగాదు. మన సభ తలపెట్టిన ప్రతీ కార్యక్రమమునకు బాధ్యతవహించి వుత్సాహముతో పాల్గొనుచున్న ఆంధ్ర మహిళ. సెంట్రల్ సోషల్‌వెల్ఫేర్‌బోర్డువారి కార్యక్రమానుసారం సూళ్లూరుపేట తాలూకాలో నెలకొల్పబడిన మాతాశిశు సంరక్షణాలయముల నతిసమర్ధతతో నిర్వహిస్తూ మహిళాభ్యున్నతికి నిరంతరము సేవచేస్తున్న హైమవతిగారికి యీసందర్భమున మాకృతజ్ఞతాభివందనములు.

కార్యదర్శినులు.



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు.

1954 సెప్టెంబర్ నాలుగోవారం మొదలుకుని అక్టోబర్ మూడోవారం వరకు జాతీయ, అంతర్జాతీయ రాజకీయరంగాల్లో నడిచిన ప్రముఖ సంఘటనలు ఇవి— ఫ్రెంచి ఇండియాలో వాస్తవిక అధికారాలను ఇండియాకు ఫ్రాన్స్ అప్పగించటం, యూరప్ రక్షణపథకం భగ్నమై, దానిస్థానే బ్రుసెల్స్ ఒప్పందంలో జర్మనీకి స్థానం లభించటం, ఏడెన్ పరిసరప్రాంతాల్లో బ్రిటిష్ దుస్తంత్రాలమీద యెమెన్ ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేయటం, భారత ప్రధాని నెహ్రూ చైనాకు వెళ్ళటం, ఆయుధాల తగ్గింపు సమస్యపై అగ్రరాజ్యాలు తిరిగీ సంప్రదింపులు జరపనిశ్చయించటం, పాకిస్థాన్ ప్రభుత్వ వ్యవహారాల్లో కలవరం. ఆంధ్రలో భూమిశిస్తు సవరణ.

*　　*　　*

దాదాపు 300 సం॥ల నుంచీ ఫ్రెంచి పరిపాలనక్రింద ఉన్న భారత భూభాగాలు పుదుచ్చేరి, యానాం, కారైకల్, మాహేలను భారతదేశం ఆధీనంచేసే విషయమై అక్టోబర్ 21 వ తేదీన ఇండియా, ఫ్రాన్స్ ప్రభుత్వాలు ఒక ఒప్పందం చేసుకున్నవి. దీని ప్రకారం ఈ ప్రాంతాల్లో క్రియకు యావత్తు పరిపాలనాధికారాలూ నవంబర్ 1 వ తేదీన ఇండియాకు అప్పగించబడతవి. చట్టరీత్యా అధికారాల అప్పగింత లాంఛనం తరవాత కొంతకాలానికి జరుగుతుంది. ఈప్రాంతాలు కేంద్రప్రభుత్వ విదేశాంగశాఖ పరిపాలనకింద ఉండగలవు. స్థానిక రాజకీయ పక్షాల ప్రతినిధులు కేంద్ర పరిపాలకుని సలహాదార్లుగా ఉంటారు.

తెలివితక్కువ స్నేహితుడికన్నా, తెలివిగల శత్రువు మేలు అన్న సామెత ఒకటి ఉన్నది. బ్రిటన్, ఫ్రాన్స్‌లు నిజానికి ఇండియాను వదులుకోదలచనప్పటికీ, ఇక్కడ ఉండలేమని తెలుసుకున్నతరవాత మంచిగా బయటికి పోయి, ఇండియా స్నేహాన్ని నిలుపుకున్నవి. ఫ్రెంచి వాళ్ళు మొదట తమకు ఇక్కడ స్థానంలేదని తెలుసుకున్నది చంద్రనగర్‌లో. అందువల్ల చంద్రనగర్‌ను ఇంతకుముందుగానే ఇండియాకు అప్పగించారు. పుదుచ్చేరి మొదలైన చోట్ల నిలవగలమేమోనని చూశారు. లాభం లేదని తెలిసిన తరవాత వెళ్ళిపోతున్నారు.

అయితే మనకు పోర్చుగల్ తెలివితక్కువ శత్రువుగా ఉన్నది. తనకు స్థానం లేదని తెలిసికూడా మొండిగా పోట్లాడుతున్నది. కాని, ఆదేశానికికూడా పరిస్థితులకు తల ఒగ్గక తప్పని పరిస్థితి ఏర్పడకతప్పదు.

*　　*　　*

యూరప్ రక్షణ పథకం పేరుతో పశ్చిమ జర్మనీని తిరిగీ సాయుధబలంగా తయారుచేయటానికి అమెరికా చేసిన ప్రయత్నం కిందటి నెలలో భగ్నమయింది. అమెరికా, బ్రిటన్‌లు స్వయంగా యూరప్ రక్షణకు సేనలను పంపితేనేగాని, లేకపోతే జర్మనీ దెబ్బకు ముందుగా తామే బలి అవుతామని ఫ్రాన్స్ భయపడి, ఆపథకాన్ని ఆమోదించలేదు. అందువల్ల పశ్చిమరాజ్యాల ప్రతినిధులు దానిని వదులుకుని బ్రిటన్‌చేత ఫ్రాన్స్ కోరిన హామీ ఇప్పించారు. బ్రుసెల్స్ ఒప్పందంలో పశ్చిమ జర్మనీ, ఇటలీలకు స్థానం ఇప్పించారు. ఈ ఒప్పందం ప్రకారం యూరప్ రక్షణ కోసం ఈ శతాబ్దం చివరవరకూ కొన్ని సేనలను పంపటానికి బ్రిటన్ అంగీకరించింది. జర్మనీకి స్వపరిపాలన ఇవ్వటానికీ, జర్మనీకి కొన్ని సేనలు ఉండేందుకూ ఫ్రాన్స్ అంగీకరించింది.

అయితే సార్ ప్రాంతంమీద కూడా ఒప్పందం కుదిరితేనేకాని, ఒప్పందాన్ని పూర్తిగా అమలు జరిపేది లేదని ఫ్రాన్స్ బెదిరిస్తున్నది.

*　　*　　*

మధ్యప్రాచ్యంలో పశ్చిమ రాజ్యాల ప్రయత్నాలు సక్రమంగా సాగిపోతున్నవి. సూయజ్ స్థావరాలమీద బ్రిటిన్ ఈజిప్టుతో అక్టోబర్ 19 న ఒప్పందం కుదుర్చుకున్నది. 20 నెలల్లో బ్రిటిష్ సేనలు అక్కడనుంచి వెళ్ళిపోవటం జరుగుతుంది. అయితే టర్కీ మీదకానీ, అరబ్‌రాజ్యాల మీదకానీ దాడిజరిగితే, వాటి రక్షణకు 'బ్రిటిష్' సేనలు తిరిగీ అక్కడకు రావటానికి ఒప్పందం అవకాశం ఇస్తున్నది. అంటే ఏదో ఒక విధంగా మధ్య ప్రాచ్య ఒప్పందంలో ఒక అంశానికి ఈజిప్టు ఒప్పుకున్నదన్నమాట. అట్లాంటిక్ ఒప్పందంలో జేరి, పాకిస్థాన్‌తో సైనిక ఒప్పందం చేసుకున్న టర్కీతో చేయికలపటానికి ఇరాక్ సిద్ధపడుతున్నది. మధ్యప్రాచ్య ఒప్పందం ఒకటి అవసరమంటూ ఈ రెండు దేశాల ప్రధానులూ ఒక సంయుక్త ప్రకటనచేశారు. పర్షియా నూనెగనుల విషయంలో 8 విదేశీ కంపెనీలతో జహేదీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని పర్షియా పార్లమెంటు చాలా గొప్ప మెజారిటీతో ఆమోదించింది.

అయితే పశ్చిమరాజ్యాలు వీలయినచోటల్లా బెదిరింపులు సాగిస్తూనే ఉన్నారు. ఏడెన్‌లో తిష్టవేసుకుని ఉన్న బ్రిటన్, పక్కనే ఉన్నయెమెన్‌తో గిల్లి కజ్జాసాగిస్తున్నది. అందువల్ల యెమెన్ ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసింది. లాహూజ్ అనే అరబ్ సంస్థానాన్ని బ్రిటన్ కైంకర్యం చేసి ఎంతో కాలం కాలేదు. ఈ ప్రాంతాలన్నింట్లోనూ నూనె గనులు ఉండటం బ్రిటన్ వైఖరికి ప్రధానకారణం.

* * *

ఆయుధాల తగ్గింపు సమస్యమీద తిరిగీ సంప్రదింపులు జరపటానికి అగ్రరాజ్యాలు అక్టోబరు 22 న అంగీకరించినవి. దక్షిణాఫ్రికా భారతీయ సమస్యను పరిష్కరించే నిమిత్తం దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్థాన్ ప్రభుత్వాల మధ్య ఒక మధ్యవర్తిని నియమించాలని ఐక్యరాజ్యసమితికి దక్షిణ అమెరికా రాజ్యాలు సూచించినవి.

* * *

భారత ప్రధాని పండింట్ నెహ్రూ ఈ అక్టోబరు 15 న చైనా పర్యటనకు బయలుదేరారు. చైనాతో మిగిలిన రాజ్యాల సంబంధాలను అభివృద్ధిపరచి తద్వారా శాంతిని స్థిరపరచటమే తన ప్రయాణోద్దేశమని ఆయన ప్రకటించారు. చైనా నాయకులు, ప్రజలు ఆయనకు మహత్తర స్వాగతం ఇచ్చారు. వేరువేరు సిద్ధాంతాలను అనుసరించే దేశాలయినా ఒకరిహక్కులను మరొకరు గుర్తిస్తూ, ఒకరి వ్యవహారాల్లో మరొకరు జోక్యం కలిగించుకోకుండా ఉంటే శాంతంగా ఒకరిపక్కన ఒకరు జీవించవచ్చుననీ, ఈ సూత్రాల ప్రకారం శాంతి ప్రాంతాన్ని నెలకొల్పాలనీ నెహ్రూ సాగిస్తున్న ఉద్యమాన్ని పూర్తిగా బలపరచటానికి చైనా హామీఇచ్చింది. చైనాపట్ల ఇరుగుపొరుగు దేశాలకు గల భయ సందేహాలను తొలగించటానికి కూడా చైనా నాయకులతో కలిసి కృషిచేస్తున్నారు.

చైనా వెడుతూ నెహ్రూ వీట్మిన్ నాయకుడు డా॥ హోషిమినును కలుసుకున్నారు. ఆయన కూడా శాంతి యుత సహజీవన సూత్రాలను బలపరిచారు.

చైనాకు బయలుదేరే ముందు అక్టోబర్ 10 న నెహ్రూ సింహళ ప్రధానితో సింహళ భారతీయుల సమస్యను చర్చించి ఒక ఒప్పందాన్ని సాధించారు. క్రిందటిజనవరిలో జరిగిన ఒప్పదం సరిగా అమలు జరగటానికి వీలులేకుండా తాము కొన్ని చర్యలు జరిపినట్లు సింహళ ప్రధాని ఒప్పుకుని, వాటిని సవరిస్తామని మాట ఇచ్చారు. సింహళ పౌర హక్కులు లభించకుండాను, ఇండియా పౌరసత్వం లేకుండాను ఉన్నవాళ్ళ సంఖ్యను వీలయినంత వరకూ తగ్గించి (ఏదో ఒక పౌరహక్కు ఇవ్వటంద్వారా) రెండు సం॥ ల తరవాత మిగిలిన వాళ్ళ సంగతి మళ్ళాపరిశీలించటానికి ఉభయ ప్రధానులూ అంగీకరించారు.

* * *

అక్టోబర్ 19 వ తేదీన ఇండియా చైనాలు ఒక వ్యాపార ఒప్పందాన్ని చేసుకున్నవి. అందులో ఇండియా పొగాకు అమ్మకానికి అవకాశం వచ్చినందువల్ల పొగాకు పంటలో ప్రధానస్థానం వస్తున్న ఆంధ్ర రాష్ట్రానికి ఈ ఒప్పందం మరీ ముఖ్యం. ఆసియాదేశాల్లో భారతదేశపు పొగాకుకు మార్కెట్లను సంపాదించటంలో కొత్త రఘు రామయ్యగారి నాయకత్వాన ఇటీవల పర్యటించి వచ్చిన ఆంధ్ర వాణిజ్యబృదం చాలా కృషిచేసింది. ఇదికాక 14 వ తేదీన ఇండియా చైనాలు మరొక ఒప్పందం కుదుర్చుకున్నవి.

* * *

పాకిస్థాన్‌లో మళ్ళీ అశాంతి బయలుదేరింది. కేంద్ర ప్రభుత్వానికీ రాష్ట్రాలకూ విభేదాలు పెరిగిపోగా, ప్రాం

తీయ ఉపసమాఖ్య లంటూ ఏర్పాటు చేస్తామని ప్రధాని మహమ్మద్ ఆలీ నాటకాలు ఆడుతున్నాడు. సరిహద్దు రాష్ట్రప్రధానిగా ఉండి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చేరిన కయాంకాన్ తిరిగి తన రాష్ట్రానికే పోతానంటున్నాడు. ఇదివరకు పార్లమెంటుఎన్నికలకు కొన్నాళ్ళవరకూ అనర్హులుగా ప్రకటించబడ్డ, సింధు. పంజాబ్ నాయకులు అనర్హతను గవర్నర్ జనరల్ గులాంమహమ్మద్ తొలగించారు. కేంద్ర ప్రభుత్వ అధికారాలను తగ్గించాలని పాకీస్థాన్ నాయకులు అలజడి చేస్తున్నారు.

ఈ సంఘటనలన్నీ ప్రధానిమహమ్మద్ అలీ అమెరికా కెనడాల పర్యటనలో ఉండగా జరిగినవి, ఈ పరిస్థితులకు ఆయన అనుచరులు భయపడి గోలపెట్టగా, ఆయన పర్యటన మధ్యలో ఆపుకుని స్వదేశానికి బయలుదేరారు. మహమ్మద్ ఆలీని బలపరచే నిమిత్తం అమెరికా తను పాకీస్థాన్‌కిచ్చే ఆర్థిక సహాయాన్ని అయిదురెట్లు చేసింది. ఆయుధ సహాయం సగం ఎక్కువ చేసింది. కాని ఇవి ప్రస్తుత కలవరానికి కారణాలయిన ఆంతరంగిక సమస్యలనేమీ పరిష్కరించలేవు. మహమ్మదాలీ స్వదేశానికి తిరిగి వచ్చిన తక్షణమే గవర్నర్‌జనరల్ దేశంలో అవాంతర పరిస్థితులు యేర్పడ్డాయని ప్రకటించి మంత్రివర్గంలోని కొందరికి స్వస్తి చెప్పాడు. పాకీస్తాన్ శాంతి పరిస్థితులు తిరిగి యేర్పడుటకు కొంతకాలం పట్టవచ్చు.

* * *

ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రకాశంగారు రాష్ట్రావతరణ దినోత్సవంనాడు ఒక ప్రకటనచేస్తూ, పదిరూపాయలకు తక్కువ భూమిశిస్తు చెల్లించేవారు అది చెల్లించ నవసరం ఉండకుండా చేస్తామని అన్నారు. అయితే దీనిమూలంగా వచ్చే తరుగును భర్తీచేయటం కోసం నీటి తీరువను హెచ్చించాలనీ, నీటి పారుదలవల్ల బాగుబడ్డ భూముల మీద అభివృద్ధి పన్ను విధించటానికీ ప్రభుత్వం ఆలోచిస్తున్నదని రెవెన్యూమంత్రి కోటిరెడ్డిగారు అక్టోబరు 12 న వెల్లడించారు. మొదటి సూచనను ప్రతికూలించే వాళ్ళు ఉండరుకానీ, రెండవ ప్రతిపాదనవల్ల పన్నుభారం ఉన్న వాళ్ళమీదనే మరింత పెరుగుతుందని ఆందోళన జరుగుతున్నది. ఏది ఎట్లాఉన్నా, భూమిపన్నులవిధింపు అందరికీ న్యాయంగా ఉండాలంటే, దానిమీద వచ్చే ఆదాయాన్ని పట్టి విధించాలేకాని, ఇతరత్రా ప్రయత్నించటం సరయిన పద్ధతికాదు.

* * *

ఆంధ్ర దేశంలో ప్రాజక్టుల ఆందోళన జోరుగా సాగిపోతున్నది. నందికొండ ప్రాజక్టు ఆలస్యానికి ప్లానింగ్ కమీషన్ పెద్దలే కారకులని ఆంధ్ర, హైద్రాబాద్‌ల నాయకులు బయట పెట్టారు. ఈపరిస్థితుల్లో అది ఎట్లా సానుకూల మవుతుందో అర్థం కావటంలేదు. అయినప్పటికీ ఆప్రాజక్టువల్ల మునిగిపోయే నాగార్జునకొండ శిథిలాల్లో మిగిలినవాటిని తవ్వించటానికి అక్టోబర్ 17 న కేంద్ర ప్రభుత్వ పని ప్రారంభించింది కనుక, మొత్తానికి ఇది అమలు జరుగుతుందనే.అభిప్రాయం ఒకటి కలుగుతుంది.

అయితే అది ఎప్పుడు అన్నదే ప్రశ్నగా ఉన్నది. స్థానిక ప్రజలు దానికోసం ఒక ఉద్యమాన్నే సత్యాగ్రహం రూపంలో నడపాలని ఉద్దేశిస్తున్నట్లు వార్తలు వస్తున్నవి. ప్రాజెక్టుల్లో మొదటి స్థానం తుంగభద్ర ఎగువ కాలవకే నని ఆంధ్ర ప్రభుత్వంచేత కేంద్రానికి అదేపనిగా చెప్పిస్తున్న సంజీవరెడ్డిగారే, ఆపని త్వరగా కావాలంటే ఆసక్తి గలవాళ్ళంతా కేంద్రం మీద ఒత్తిడి తీసుకొని రావాలని చెప్పినప్పుడు, నందికొండను కోరే మామూలు జనం ఉద్యమం ప్రారంభించినా ఆశ్చర్యం ఉండదు.

అక్టోబర్ 29 న ప్రారంభమయే ఆంధ్ర శాసన సభలో ప్రభుత్వం ఎదుర్కొనే అనేకసమస్యల్లో ఇదికూడా ఒకటి.



ఆంధ్ర మహిళాసభ దసరా ఉత్సవాలు

అక్టోబరు 5,6,7 తేదీలలో ఆంధ్ర మహిళాసభ జరిపిన దసరా ఉత్సవాల వివరాలు :

దేవీపూజ :— దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి పర్వదినాలలో దేవీపూజ, బొమ్మల కొలువు పేరంటం జరిపారు.

చేతి పనుల ప్రదర్శన :— ఈ మూడు రోజులు సభాభవనములో మహిళాసభ పారిశ్రామిక శాఖవారు, విమెన్సుహోమ్. శ్రీ సదనం, మద్రాసు విమెన్ వెల్‌ఫేర్ డిపార్టుమెంటు, టి. నగర్ మహిళాసభ, ఆర్ఫ్యానేజ్ హోమ్ సంస్థలు కలిసి చక్కటి చేతిపనుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. శ్రీమతి నల్లముత్తు రామమూర్తి గారు ప్రారంభోత్సవం జరిపి, లలిత కళలను గురించి ఉపన్యసించారు. అనేకమంది స్త్రీలు యీ ప్రదర్శనను సందర్శించారు.




శ్రీమతి నల్లముత్తు రామమూర్తి

ఆటల పోటీలు :- మహిళాసభ విద్యార్థినులు సమిష్టిగా మోతీ, హీరాదళములు రెండు కలిసి—

పొటెటో రేస్
ఫ్లాగ్ రేస్
పాసింగిది బాల్
జిగ్‌జాగ్ రేస్
} అనే 4 ఆటల్లో పోటీ చేశారు.

మొదటి మూడు ఆటల్లోను మోతీదళం గెలవడంవల్ల షీల్డు మోతీదళానికే వచ్చింది. ఒక్కొక్క ఆటలో గెలిచిన దళములోని ప్రతి బాలికకు బహుమతులిచ్చారు.

ఇంకా వ్యక్తిగతమైన ఆటలలో రోప్‌స్కిప్పింగులో ఫస్టుప్రైజు—విమల గుప్త, సెకండు ప్రైజు- ఆశాలత; మూడు కాళ్ళ ఆటలో ఫస్టుప్రైజు- ఎలిజబెత్తు, లక్ష్మి; సూదీ దారంలో ఫస్టుప్రైజు — ఇందు. ప్రీతి; సెకండు ప్రైజు- ఎలిజబెత్తు, లక్ష్మి; మ్యూజికల్ చైర్సులో ఫస్టుప్రైజు— కుమారీనందిని లకు బహుమతులు వచ్చినవి.



(దసరా ఉత్సవాల సందర్భంలో నృత్యంచేసిన కొచ్చిన్ సోదరీమణులు)

సర్వింగుహోమ్ విద్యార్థినుల ఆటలు : స్కిప్పింగులో - ఫస్టు ప్రైజు పి. చంద్ర, సెకండు ప్రైజు—వి. కాంత. సూదీ-దారం ఆటలో ఫస్టుప్రైజు ఎ. రామలక్ష్మి సెకండు ప్రైజు- వి. కాంత ; బేలన్సింగ్ ఆటలో ఫస్టుప్రైజు- ధనలక్ష్మి, సెకండు ప్రైజు— భవాని.

సభ్యురాండ్ర పిల్లల పోటీలు :— మూడు కాళ్ళ ఆటలో—ఫస్టు ప్రైజు ప్రమీల, పాపాయి; సెకండు ప్రైజు శకుంతల.

ఆంధ్ర మహిళాసభ దసరా ఉత్సవాలు



శ్రీమతి వి. లక్ష్మీపార్వతిగారు

సావిత్రి; సూదిదారం- ఆటలో ఫస్టుప్రైజు ప్రమీల, 2వ ప్రైజు— శకుంతల ; స్కిప్పింగ్- ఫస్టుప్రైజు- ప్రమీల, సెకండుప్రైజు సావిత్రి ; హాపింగు — ఫస్టుప్రైజు- శకుంతల, సెకండు ప్రైజు- సావిత్రి.

సభ్యురాండ్ర ఆటలు :——స్కిప్పింగ్- ఫస్టు ప్రైజు— చెల్లాయి, సెకెండు ప్రైజు-సుబ్బలక్ష్మి. బాలెన్సింగ్ రేస్ ఫస్టు ప్రైజు- జయలక్ష్మి, సెకెండు ప్రైజు చెల్లాయి ; ఎలిజబెత్ రాణి— సర్ వాల్టర్ రాలే ఆట— ఫస్టుప్రైజు— రత్నం, చెల్లాయి ; సెకెండు ప్రైజు- కె. సుగుణమణి, లక్ష్మీకాంతమ్మ. త్రాప్ రేస్- ఫస్టుప్రైజు రాజ్యలక్ష్మి. సెకెండు- చెల్లాయి ; మ్యూజికల్ ఛైర్స్- ఫస్టు ప్రైజు మంగతాయారు, సెకెండు- జయలక్ష్మి.

వినోద కార్యక్రమములు :— ఈ మూడు రోజులు నృత్య, నాటక ప్రదర్శనములు జరిపారు. అందులో నృత్యం చేసిన కొచ్చిన్ సోదరీమణులకు శ్రీమతి పురం అన్నపూర్ణమ్మగారు బహుమానం యిచ్చారు. నాటకాలలో మహిళాసభ విద్యార్థినులు ప్రదర్శించిన 'స్నోవైట్' (ఇంగ్లీషు)లో నందిని, కుసుమలతా కెంప్‌రాజ్ : 'మేవాడ్ పతన్' (హిందీ) వసుమతీషా ; 'మొదటి కేసు' (తమిళం) లక్ష్మి ; 'ఒద్దంటే పెళ్ళి'(తెలుగు)లక్ష్మీదేవి; నర్సింగుహోమ్ పిల్లలు నటించిన 'గయ్యాళి అత్త' (తెలుగు) శాంతకుమారి ; 'క్వీన్సు రైవల్' (ఇంగ్లీషు) మిస్. విలియమ్సు ప్రథమ బహుమానాలు పొందేరు. మేవాడ్ పతనానికి షీల్డు యిచ్చారు. ఫాన్సీ డ్రెస్ పోటీలలో పి. లీలకు ప్రథమ బహుమానం ఇచ్చారు. మిమిక్రి చెప్పిన కుమారి అండాళకు ప్రత్యేక బహుమానం యిచ్చారు. మహిళా సభ ఆర్కెస్ట్రాకు ఒక బహుమానం యిచ్చారు. ఆ తర్వాత వస్తు ప్రదర్శనలో పాల్గొన్న నాల్గు సంస్థలకు ప్రత్యేక బహుమానాలు పంచి పెట్టేరు.

ప్రత్యేక బహుమానాలు :— శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారు జనరల్ ప్రొఫిషియన్సీకి మూడు బహుమానాలు యిచ్చారు.

కుమారి వేదవల్లి— సీనియర్ మెట్రిక్ ;
,, తులసీ రత్నం— నర్సింగ్‌హోమ్
,, మీన —పారిశ్రామికశాల

వీరందరికి శ్రీమతి వి. లక్ష్మీ పార్వతిగారు బహుమతులు పంచారు.

కార్య దర్శిని వందన సమర్పణతో యీ మూడు రోజుల కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

విజయం

1954 ఆగష్టు మాసంలో జరిగిన హిందీ పరీక్షలలో ఉత్తీర్ణులైన ఆంధ్ర మహిళాసభ విద్యార్థినులు—

మధ్యమ పరీక్షలో — కుమారి కస్తూరి ప్రమీల

ప్రాథమిక పరీక్షలో — వనజాక్షి (ప్రథమ శ్రేణిలో)

కుమారి గుణభూషణి, శ్రీమతి బొడ్డుపాటి గౌరీదేవిగారు. (ద్వితీయ శ్రేణిలో)

విజయమందారు. వారికి మా అభినందనములు.

కార్యదర్శులు.

ప్రత్యేక వివాహాల చట్టం.

శ్రీమతి ఎర్రమిల్లి సరోజినీదేవి

ప్రత్యేక వివాహాలబిల్లు శాసనసభలో లోక సభ, రాజ్య సభలచే ఆమోదింపబడి ప్రెసిడెంటు ఆమోదము కూడ పొందింది. స్వరాజ్యము వచ్చిన తరువాత యావద్భారత దేశమునకు వర్తించు శాసనములలో ఒకటి ఇది. దీనికి ముందు వివాహములకు సంబంధించిన చట్టములు కొన్ని వున్నవి. 1872 వ సంవత్సరంలో ప్రత్యేక వివాహాల శాసనము (**Special Marriage Act of 1872**) పాసయింది. ఈ శాసనము క్రింద వివాహము చేసుకొనే వారు తాము హిందూ, మహమ్మదీయ, సిక్కు, జైన, క్రైస్తవ మతములకు చెందలేదని (**declare**) వక్కాణించ వలసి వచ్చెను. ఈ చట్టము క్రింద వివాహము చేసుకోదలచినవారు సహజముగా అబద్ధము చెప్పి చేసుకొనేవారు! దీనిలోని అనర్ధకము కనిపెట్ట 1923 వ సంవత్సరములో ఒకే మతమునకు జెందినవారు ఈ చట్టము క్రింద వివాహము చేసుకోవచ్చునని సవరణ చేయడమయినది.

ఇప్పుడు ప్రతిపాదించు చున్న ప్రత్యేక వివాహాల బిల్లు ముఖ్య ఉద్దేశము మతవిషయ మయిన భేదములను లెక్కకు తీసుకోక పోవుట. యేమతమునకు చెందిన వారయినా ఈ చట్టము క్రింద వివాహము చేసుకోవచ్చు. హిందూ, మహమ్మదీయులనే భేదములేకుండా యెవరయినా వివాహము చేసుకోవచ్చు. కాని ఈ చట్టము యావద్భారత దేశమునకు అనువర్తిస్తుంది. ఈ చట్టముక్రింద యిష్టమయిన వారే వివాహము చేసుకోవచ్చును కాని, అందరిలా చేసుకొని తీరాలను నిర్బంధము లేదు. **"It is optional or permissible but not Compulsory"** ఈ చట్టము క్రింద వివాహము చేసుకొనే వారికి హిందూ ధర్మశాస్త్రము వర్తింపదు. **Indian Succession Act**వర్తిస్తుంది. హిందూ ధర్మశాస్త్రమునకు **Indian Succession Act** కు ఆస్తి పంపుదలలో (**radical**) భేదములున్నవి. **Indian Succession Act** క్రింద కుమార్తెకు, కుమారునితో సమానముగా తండ్రి ఆస్తిలో సగము భాగము వస్తుంది. భార్యకు ⅓ వంతు భాగము వస్తుంది. హిందూ ధర్మశాస్త్రములోవలె కాక స్త్రీకి ఆస్తి సంపూర్ణహక్కుతో వస్తుంది. బొంబాయి రాష్ట్రంలో తప్ప హిందూ దేశములో మిగిలిన ఇతర రాష్ట్రములు స్త్రీకి ఆస్తి జీవిత హక్కుతోనేవస్తుంది. ఈచట్టము రానిముందు కాని తరువాతకాని వివాహము చేసుకున్న వారు వారి యిష్టమయితే ఈ చట్టముక్రింద మరల వివాహము **Register** చేయించుటకు ఈచట్టమును అనువర్తింప చేసుకోవచ్చు. ఈ చట్టము క్రింద వివాహము చేసుకొనుటతోనే హిందూధర్మశాస్త్రముకాని, మరి యే యితరమయిన (**Personal laws**) తో సంబంధము త్రెంచివేయడమవుతుంది. ఈ చట్టముక్రింద వివాహము చేసుకొనేవారికి వారిసంతానముకు **Indian Succession Act** వర్తిస్తుంది.

ఈచట్టముక్రింద వివాహము చేసుకునే స్త్రీపురుషుల వయస్సు విషయమై దీర్ఘ వాదోపవాదముల తరువాత స్త్రీలకు 18 సంవత్సరములు, పురుషునకు 21 సంవత్సరములు వయస్సు వస్తేనేకాని ఈచట్టముక్రింద వివాహము చేసుకొనుటకు వీలులేదని నిశ్చయించబడింది. ఈచట్టము క్రింద చేసుకొనే ప్రతివివాహము **Register** చేయించవలెను. ఇంతకుముందు వివాహము చేసుకుని ఈ చట్టము క్రింద మరలవివాహము**Register** చేయాలంటే ఈ క్రింది పరిస్థితులలో వుండాలి. (ఎ) ఆభార్యాభర్త వారివ్యక్తిగతచట్టములు **personal laws** ప్రకారంవివాహహాము చేసుకుని అప్పటినుండి కాపురముచేస్తూవుండవలెను. (బి)వివాహము **Register** చేయించుకునేటప్పుడు భార్యా భర్తలకు వారు తప్ప యిరువురికి మరియొక భార్యకాని భర్తగాని వుండకూడదు. (సి) వారు (**Prohibited degrees**) నిషేదపు బంధురికములో వుండకూడదు. (డి) భార్యకాని భర్తకాని రిజిష్టర్ చేయించు కునేటప్పుడు పిచ్చివారుగా వుండకూడదు. (ఇ) వయస్సు 21- సంవత్సరములోపుగా వుండ కూడదు,

ఈచట్టముక్రింద చేసుకొను వివాహాలు భార్యాభర్తల అనుమతిమీద రద్దు చేసుకుని విడాకులు తీసుకొనవచ్చు. అనుమతిమీద విడాకులు తీసుకోదలచిన భార్యాభర్తలు భేదాభిప్రాయములు వచ్చి ఒక సంవత్సరము విడిగావున్న తరువాత, ఇద్దరూ కలసి యికముందు వుండుట అసంభవమని నిర్ణయమునకు వచ్చినతరువాత ఇద్దరూ కలిసి జిల్లా జడ్జిగారివద్ద పిటీషను దాఖలు చేసుకోవలెను. పిటీషను దాఖలు చేసిన ఒక సంవత్సరములోపు కాకుండా భార్యా భర్తలు పిటీషను **withdraw** (తీసివేసుకో)కుండా విడాకులు కావాలని కోరగా జిల్లాజడ్జి ఇద్దరి వైపునా విని తగినంత విచారణచేసి, పిటీషనులోని విషయములు నిజ

మని, ఈ చట్టముక్రింద వివాహము అయినదని నిశ్చయమునకు వచ్చినతరువాత వివాహము రద్దు అయినదని **decree pass** చేయవచ్చు. కోర్టువారిపై అనుమతిమీద విడాకులకు వచ్చినవారి అనుమతి వారి యిష్టముమీద వచ్చినదో లేక వారి అనుమతి బలవంతముచేత యియ్యబడినదో అను సంగతి చాల జాగ్రత్తగా పరిశీలించవలసిన బాధ్యత వున్నది. జిల్లా జడ్జి వీలయినంతమటుకు వారి మధ్య ఐక్యమత్యమును పెంపొందించుటకు, భేదాభిప్రాయములు మరచిపోయి, విడాకులు కోరకుండేటట్టు ప్రయత్నములన్నీ చేయవలెను. సంధి అసంభవమని తోచినప్పుడే వివాహము రద్దు పరచి విడాకులు యివ్వవలెను.

ఈసమ్మతిపై విడాకుల అంశముపైన శాసనసభలో తీవ్ర వాదోపవాదములు జరిగి చివరకు ఆ **Clause** వోట్లు తీసుకుని ఆమోదింపబడింది.

ఈచట్టములోని ఒక **Clause** ద్వారా భార్యకాని, భర్తకాని తగ్గని పిచ్చికాని **venreal disease** కాని, కుష్టుకాని వుండి, ఆకారణముచేత విడాకులకు **petition** పెట్టినప్పుడు మూడు సంవత్సరముల గడువు తరువాత వివాహము రద్దుచేయవచ్చును.

ఈచట్టము మూలముగా వివాహ, విడాకుల విషయములో మనదేశము చాల ముందంజవేసింది. ఈచట్టముక్రింద యిచ్చిన హక్కును దుర్వినియోగముచేసి అబలలైన స్త్రీలను యిష్టములేని, యేలాగయిన పెళ్ళాలను తప్పించుకోవాలనే భర్తలు బలవంతముమీద వారి సమ్మతిని పొంది, వివాహము రద్దు చేయించుకుని, ఆర్థిక మానసికంగా వెనుకపడివున్న స్త్రీలను అధోగతి పాలుచేస్తారేమోనని ఒక వంక ప్రజల భయము తెలియపరుస్తున్నారు. యెంతవరకూ ఈచట్టము అమలులోకి వచ్చి నిజంగా వివాహ సమస్యలు వున్నవారికి వివాహము రద్దుచేసి సహాయము చేస్తుందో మనము చూద్దాము.

పండిత రామాబాయి

శ్రీమతి కె. రామలక్ష్మి

జీవిత చరిత్రలు అందులోనూ చనిపోయిన వారివి చదువడంవల్ల వచ్చేలాభం ఏమిటి? బతికి ఉన్నవారిని గురించి రాయకూడదా? లేకుంటే యింక దేన్నిగురించేనా వ్రాయకూడదా? అంటారు చాలామంది. కాని అందరికీ తెలిసినవే అయినా మానవత్వంలో నమ్మకం నశించకుండా నీలో నీకు, నీశక్తిలో నీకు అపనమ్మకం కలుగకుండా జీవితచరిత్రల పునశ్చరణ అవసరం అని నా నమ్మకం. నీ జీవితంలో నిన్ను ఏవ్యక్తి ఎక్కువగా ఆకర్షించింది? నీ ఆదర్శమూర్తి ఎవరు? అని



ప్రశ్నించుకొంటే మనోవీథిని అనేకులు మెదులుతారు. వీరందరి జీవిత చరిత్రలూ ఒక్కసారి మననం చేసుకొంటే, ఛాయా మాత్రంగా వెలిగిన యీ మూర్తులు మరొక్కసారి వెలిగి నడలుతున్న నీ ఆదర్శాలకీ, నమ్మకాలకీ మరింతబలం యిస్తారు. ఇదే నమ్మకంతో గతించిన వారి జీవిత చరిత్రలని పునశ్చరణ చేస్తున్నాను.

స్వీయకథగా తన కథని పండిత రామాబాయి వ్రాసింది. అది చదివితే మనకి స్ఫురించేది - ఆవిడగాంభీర్యమూర్తి. ఎంత గంభీర్య హృదయమో, ఆమెది అంత దయార్ద్ర హృదయం అన్న సంగతి తేట తెల్లమవుతుంది.

1858 లో అనంతశాస్త్రి డాంగ్రే లక్ష్మీబాయిలకి జన్మించింది — రమాబాయి. అసలు, అనంతశాస్త్రి లక్ష్మీబాయిల కలయిక జీవితం చదవడానికే వింతగావుంటుంది. అనంతశాస్త్రి ప్రథమ భార్య తీర్థయాత్రలు చేస్తూమరణించింది. భార్యా విహీనుడైకూడా తీర్థయాత్రలు సాగిస్తూ పైఠాన్ అనే చిన్ని పట్టణాన్ని చేరుకున్నాడు అనంతశాస్త్రి. అక్కడే లక్ష్మీబాయిని ఆమె తండ్రిని చూశాడు. ఈ రోజులలో మనం ఊహించుకోలేని వివాహం ఆరోజులలో అతిమామూలుగానే జరిగిపోయింది: పెళ్ళినాటికి లక్ష్మీబాయికి తొమ్మిది సంవత్సరాలైతే, అనంతశాస్త్రికి నలభై తొమ్మిది. వివాహం కాగానే భార్యను స్వస్థలమైన మంగుళూరుకి తీసుకువచ్చి సంస్కృతం నేర్పడం ప్రారంభించాడు. ఆడదానికి చదువెందుకు? అందులోనూ పండితులు నేర్చుకోవలసిన సంస్కృతం ఎందుకు అనే యింట్లో వారిమాటలను లెక్క చేయకుండానే ఆమె చదువు సాగించాడు. వారి సూటిపోటి మాటలకు స్వస్తి చెప్పడంకోసం భార్యాసమేతుడై యిల్లు వదిలి వెళ్ళిపోయాడు.

మంగుళూరు వదలి, గంగామూల అటవీ ప్రదేశం తన నివాసస్థలంగా చేసుకున్నాడు. సంస్కృతంలో పండితునిగా పేరుగాంచిన అనంతశాస్త్రి ఆ పరిసరాల వున్నాడని తెలియగానే చుట్టుపక్కల వూళ్ళనుంచి అనేకులు వచ్చి సంస్కృతాధ్యయనం చేసేవారు. చిన్న గుడిసె ఒకటివేసి అదేపాఠశాలగా చేసి తన శిష్యులకి శాస్త్రాలు వాటి సారమూ బోధిస్తూండేవాడు అనంతశాస్త్రి. అతను పుణ్యతీర్థాలు దర్శింపబోయినపుడు, అతని స్థానే లక్ష్మీబాయే విద్యగరిపేది. మైసూరు నేపాలు మహారాజుల ఆదరణకి పాత్రుడైనాడు అనంతశాస్త్రి. ఈ ప్రదేశంలో 20

సంవత్సరాలపాటు వున్నారు. కాని తమ ముగ్గురు పిల్లల భవిష్యత్తుకొరకై మైసూరు పోవనిశ్చయించారు. కాని, మైసూరు వచ్చేసరికే వృద్ధుడైన అనంతశాస్త్రిని ఎవరూ గుర్తించలేదు. దానికితోడు అతని ఆరోగ్యం కూడా సరిగాలేదు. లక్ష్మీబాయే, అతనిస్థానే సంస్కృత గ్రంథ పఠనం చేస్తూండేది. మైసూరులో గడవక, ఒక స్థలంనుండి యింకొక చోటికి, పాదచారులైపోతూ, చాలా కాలం కాలక్షేపం చేశారు. అటువంటి సమయంలోకూడా అనంతశాస్త్రి తన పిల్లలకి సంస్కృతంలో పాండిత్యం యిచ్చే యత్నంమట్టుకు మానలేదు.

ఇటువంటి కష్టపూరితమైన కాందిశీక జీవితం అనంత శాస్త్రి పిల్లలకి విద్యగాపరిణమించింది. కష్టసుఖాలలో ఒక్కలా వుండకల్గడం కష్టాలను ఎదురీదడం దారిద్ర్యంలో కూడా ఆనందంగా వుండకల్గడం - ఇవన్నీకూడా కష్ట మయ జీవితం ప్రసాదించిన విషయాలే. అనంతశాస్త్రి కుటుంబం పడని యిక్కట్టులేవు. 1879 లో మద్రాసు వచ్చినప్పుడు, తినడానికి ఏ ఆహారంకూడా దొరక్క బాధపడ్డారు. అసలే వయస్సు ముదిరిన అనంతశాస్త్రి జీవితం త్వరగా ముగియడానికి యివన్నీ తోడ్పడ్డాయి. వారి బిడ్డలే - ముగ్గురు. ఈముగ్గురిలోనూ చిన్నది రమాబాయి.

అనంతశాస్త్రి కాలంచేసిన కొద్ది మాసాలకే, లక్ష్మీ బాయి, వారిపెద్ద కుమార్తెకూడా కాలం చేశారు. ఇక మిగిలినది రమాబాయి, ఆమె అన్నగారే. ఇద్దరూ కలిసి కాలక్షేపంకోసం ఉత్తరాదికి వెళ్ళారు. ఎన్ని కష్టాలుపడ్డ మంచిరోజులు ముందువస్తాయన్న నమ్మకంమట్టుకు పోలేదువారికి.

రమాబాయి యిరవై సంవత్సరాల యువతిగా నున్నప్పుడు, అన్నా చెల్లీ కలిసి కలకత్తా చేరుకున్నారు. రమాబాయి ఎవరో తెలియకపోయినా, అనేకవందల మైళ్ళు నడిచిన వ్యక్తి అనీ, సంస్కృతంలో పండితురాలనీ తెలుసుకొని, అనేకులు ఆమెను చూడవచ్చారు. పండిత ప్రకాండులుకూడా ఆమె సంస్కృత పఠనాన్ని గురించి విని, తామే విని, ఆమె పాండిత్యాన్ని కొనియాడేరు.

సంతోషించే రోజులు, ప్రారంభం కాగానే రమాబాయి అన్న మరణించాడు. దుఃఖిత అయిన రమాబాయి, తన అన్నగారి ప్రాణస్నేహితుడైన ఒక బెంగాలీ యువకుణ్ణి వివాహమాడి, అతనితో అస్సాం వెళ్ళిపోయింది. కాని, ఈ సౌఖ్యంకూడా ఎక్కువకాలం నిలువలేదు. పంధొమ్మిది మాసాల అనంతం కలరావ్యాధికి గురిఅయి రమాబాయి భర్త మరణించాడు. అతని జ్ఞాపక చిహ్నంగా ఒక పసి పాప మాత్రం మిగిలింది. తన హృదయానికి ఆనందం యిచ్చే యీ చిన్ని ప్రాణానికి "మనోరమ" అని పేరెట్టుకుంది రమాబాయి.

రమాబాయి, జీవితంలో దేన్నిగురించీ భయపడడం గాని బాధపడడంగాని ఎరుగదు. ఎన్ని కష్టాలనైనాసరే సాధారణంగానే నెట్టివేయడం ఆమెకు అలవాటయి పోయింది. ఇన్ని కష్టాల మధ్య ధైర్యంగా వుంటూ ఇంగ్లీషు నేర్చుకో నిశ్చయించింది. అందుకై మద్రాసు పోనిశ్చయించుకున్న సందర్భంలో, "దైవనిర్ణయంచేత నైతేనేం, మరెందువల్లనైతేనేం, యీపాటికి కర్ణాటకంలో, మహారాష్ట్రంలో, అస్సాంలో నా బంధువులూ, ప్రియ బాంధవులూ, నన్ను విడిచిపోయారు. ఆయా ప్రాంతాల నివశించే అవసరం నాకేముంది యింక ?....కాని మద్రాసులో వారి భాష నాకెలా తెలుస్తుంది అందుకే, ఏమీలేకున్నా తిరిగి మహారాష్ట్రం పోకతప్పదు" అని తన జీవిత చరిత్రలో రాసింది రామాబాయి.

పూనాలో పండిత రామాబాయి ఉత్తమోత్తమమైన స్నేహితులను పొందకల్గింది. మహదేవ గోవిందరనడె, రామకృష్ణగోపాల్ భండర్కర్ మొదలైనవాళ్ళు ఆమె అండనిలచారు. పూనా స్త్రీలకి ఆరోజులలో ఆమెచదువు సంధ్యలు నచ్చలేదు. అయినాకూడా, హిందూ స్త్రీలకి, హిందూ వితంతువులకి రామాబాయి తలపెట్టిన సేవ అపారం. 'ఆర్యమహిళా సమాజం' స్థాపించి ప్రతి శనివారం సమావేశాలేర్పరుస్తూ గంభీరంగా మాట్లాడి, ప్రేక్షకులని ఉత్తేజపరిచి, ఉత్సాహులని చేసేదిరమాబాయి. మహిళల స్థితిగతులను తెలుసుకొందుకు ప్రభుత్వం ఏర్పరచిన రాయబారం పూనా వచ్చినప్పుడు, రామాబాయి వారిని కలుసుకొని విద్యాసౌకర్యాలు ఆడువారికి కల్గించ మని కోరింది. స్త్రీ వైద్యులుకూడా అత్యవసరం అని కోరింది. ఇంత చేసినా, తగిన ఆర్థిక స్తోమతూ, మనుష్య సహాయమూ లేక తన సమాజ నిర్వహణకి చాలా కష్ట పడింది రమాబాయి.

వితంతు శరణాలయం స్థాపించి హిందువితంతువుల కష్టాలను బాపుదామనే ఆమె కోర్కెకి అడ్డు నిలచినది

ఆర్థికలోపమే. డబ్బు పోగుచేయడంకోసం "స్త్రీధర్మ నీతి" అనే చిన్న మరాఠీ గ్రంథాన్ని రచించింది. స్త్రీలు జీవితం సౌఖ్యప్రదం చేసుకోవాలంటే ఎలా బ్రతకాలో, ఎలా పని చేసుకోవాలో, యింటినీ పిల్లలనీ ఎలా సరిదిద్దుకోవాలో అన్నీ యీ పుస్తకంలో సవివరంగా వ్రాసింది.

తరువాత తన కుమార్తెతోసహా ఇంగ్లెండు వెళ్ళింది. ఇంగ్లాడులో "వాండేజి సిస్టర్సు"తో ఉన్న రోజులలోనే ఆమె క్రీస్టియను మతాన్ని స్వీకరించింది. తరువాత కాలేజీలో చేరి సంస్కృతం నేర్పుతూ, తాను ఇంగ్లీషూ, లెఖ్ఖలూ, సైన్సూ చదువుకో నారంభించింది.

రామాబాయి అమెరికాకు వెళ్ళినప్పుడు ఆనందిబాయి జోష్ డాక్టరు పట్టాను పుచ్చుకొంది. తానుకూడా డాక్టరు కావాలని రామాబాయికి చాలావుత్సాహం కల్గింది. కాని, పడలేదు. కాలం వృధాపుచ్చకుండా, పిల్లలకి చదువు సంధ్యలు ఎలా నేర్పాలో, నేర్చుకొంది. అదేవిషయంపై కొన్ని గ్రంథాలుకూడా వ్రాసింది. "సనాతన హిందూ స్త్రీ" అన్న ఆమె పుస్తకం అమెరికనులను ఎక్కువగా ఆకర్షించింది. ఆమె యిచ్చిన గంభీరోపన్యాసాలూ, హిందూ స్త్రీల దైన్యస్థితీ, ఫలితంగా అమెరికనులు 'రామాబాయి అసోసియేషన్' ప్రారంభించి డబ్బు పోగుచేశారు.

ఆ డబ్బుతో యిండియాకు తిరిగివచ్చి రామాబాయి 'శారదాసదన్' స్థాపించింది. మహాపట్నం బొంబాయిలో ఆర్థికంగా పరిష్టంగాని ఒక సంస్థని నడపడం సామాన్యం కాదు. కొద్దిరోజులలో ఈసంగతి గ్రహించిన రామాబాయి తన సంస్థని పూనాకి మార్చింది. పూనాకి ఆమె రాక ఉత్సాహాన్ని కల్గించలేదు. ఇదివరకటి ఆమె స్నేహితులంతా ముఖం చాటుచేసుకొన్నారు. దానికి కారణం ఆమె క్రైస్తవ మతాన్ని స్వీకరించడమే. అయినా, రామాబాయి తన పట్టుదలనీ ధైర్యాన్ని విడువలేదు. తన 'శారదా సదన్' సవ్యంగానే నడకసాగించింది.

ఇదేసమయంలో సెంట్రల్ యిండియాలో క్షామం ప్రారంభమయింది. తన సదన్ గొడవలలో మునిగి వుండే రామాబాయి చూస్తూ వూరుకోలేకపోయింది. తనతో పనిచేస్తున్న యితర స్త్రీలని జట్టుకట్టుకొని క్షామపీడిత ప్రదేశాలకి పోయి సేవసాగించింది. కేడగోవన్‌లో 'ముక్తి ఆశ్రమం' అనే ఇంకో సంస్థని ప్రారంభించింది. అదే తనకీ ఆశ్రయం చేసుకొంది. శారదాసదన్‌ని తన తోటి స్త్రీలకి అప్పగించింది. ఈముక్తి ఆశ్రమం సరిగా నడవడానికి డబ్బు పోగుచేయడానికి తిరిగి మరోసారి అమెరికా వెళ్ళింది. ధనమైతే సమకూరిందికాని, రామాబాయి ఆరోగ్యం కొంచం కొంచంగా క్షీణింపనారంభించింది.

ముక్తి ఆశ్రమం - పండిత రామాబాయి తలపెట్టిన సర్వతోముఖ అభ్యుదయానికి కేంద్రం. ఇదనేకులకు ఆశ్రమం అయింది. అంతేకాక, దిక్కులేని పిల్లలకీ స్త్రీలకీ సహాయంకోసం కృపాసదన్ ప్రారంభించింది.

వయస్సుతోపాటు ఎక్కువయిన పనికి తోడు పండిత రామాబాయి ఆరోగ్యం తీవ్రగతిని క్షీణించింది. 1922లో తన 64-వ ఏట పండిత రామాబాయి కనుమూసింది.

రామాబాయి జీవిత చరిత్ర చదువుతుంటే - ఎంతటి పిరికివారికైనా, ఎంతటి దిక్కులేని పక్షులకైనా - గమ్యం చేరగలమనే ధైర్యం రాక మానదు. ఈమె జీవితం ఒక సత్యాన్ని చాటుతుంది: "ప్రపంచం నీకు ప్రసాదించే దానికంటే నీవే ప్రపంచానికి ఎక్కువగా ప్రసాదించే అవకాశాలు ఉన్నాయి" అన్నదే ఆ సత్యం. రామాబాయికి ప్రపంచం యిచ్చినదేమిటి? — అష్టకష్టాలూ అశాంతీనూ. కాని రామాబాయి యీ ప్రపంచానికి చేసిన సేవ, స్త్రీ జాతికి చేకూర్చిన అభ్యుదయం విలువ ఎంత? — అమూల్యం అది. స్త్రీజాతికి అబలత్వం అంటగడతారేకాని, కారణాలుంటే అవకాశాలుంటే, వారు తమ సబలత్వాన్ని వేయినోళ్ళ చాటకలుగుతారు. పండిత రామాబాయి జీవిత చరిత్ర చదువుతే మనకి చిరకాలం జ్ఞాపకం వుండిపోయేవి — ఆమె — కష్టాల గాథకాదు; ఆమె పడిన శ్రమకాదు: ఫలించిన ఆమె శ్రమమాత్రమే. స్త్రీ జనాభ్యుదయానికి ఆమె యిచ్చిన చేయూతమాత్రమే.

గాంధీ సాహిత్యం

• శ్రీమతి కె. సుగుణమణి •

"రామాయణమంతా మూడుముక్కల్లో చెప్పు" అన్నాడట వెనుకటికి ఒకాయన; ఎలాగ చెప్పడం? "పుట్టె - కొట్టె - తెచ్చె" అని చెప్పవలసివచ్చిందట! అలాగ, 'గాంధీజీ సాహిత్యాన్నిగురించి రేడియోవారు పది నిమిషాల్లోచెప్పండి' అంటే-అదిసాధ్యమయ్యేపనా? మరొకరి విషయంలో ఐతే, వారు వ్రాసిన వ్రాతలే 'సాహిత్యం' క్రిందలెక్క; కాని, గాంధీజీ విషయంలో ఆయన వ్రాసిన ప్రతీ అక్షరం, మాట్లాడిన ప్రతీ ముక్కా సాహిత్యమే గాంధీజీ పల్కులన్నీ వ్రాతలన్నీ త్రికరణశుద్ధిగా జరిగినవే గనుక ప్రతీదీ ఒక కావ్యమే, ప్రతీదీ గొప్ప సాహిత్యమే. అవన్నీ లిఖితమాత్రాలుగాక, 'జీవితం' అనే గ్రంథంలోని పుటలు. నిత్యాచరణ, స్వానుభావం అన్న మూసలోనుంచి రాలిన బంగారు కణికలు. మహాత్ముడి చిరునవ్వొక చిద్విలాస సాహిత్యం. ఆయన నవ్వులో విశ్వమంతా నవ్వినట్లే యుండేది. చిటికిన వ్రేలెత్తితే దేశమంతా లేచి పోయేది. "ఉ" అంటే ప్రపంచ పత్రికలన్నిట్లోను ప్రతిధ్వనించేది.

ఆ మహానుభావుడు మాట్లాడని హంశంలేదు. వ్రాయని శీర్షికాలేదు; చీమదగ్గరనుండి, హరిజనులవరకు ఆయనకు కావలసిన విషయాలే; గోసంరక్షణ మొదలు, ప్రపంచ రక్షణ అంతా ఆయన తాపత్రయమే; బ్రహ్మచర్యం నుంచి, భగవద్గీతవరకు భాష్యం వ్రాసాడు. ఆయన అలవరచుకోని గొప్పగుణంలేదు. శంకరుడున్నాడంటే ఒకే ఒక లక్ష్యం — అద్వైతం ఆయన మతం; బుద్ధుడంటే — అహింస ఆయన సిద్ధాంతం; నన్నయభట్టు వంటివారికి — ఒకటే కావ్యలక్ష్యం; శ్రీ రామకృష్ణ పరమహంసకు — భగవంతుడు తప్ప మరో విషయమే తెలియదు. కాని, మహాత్ముడేమిటి! ఆయనకు అక్కరలేని హంశంలేదు, ఆయనకాకనివిషయం లేదు! భారతావనిలోని మహామహుల సద్గుణాలేగాదు, లోకోత్తర ప్రతిభా సంపన్నులైనవారి అందరి గొప్ప గుణాలు మూర్తీభవించాయి — ఈతనిలో. ఇతడు ప్రాచ్య లిన్‌కోలిన్, ఇండియా క్రైస్తున్ను; భగవద్గీతలోని నిష్కామ కర్మాచరణానికి అర్థం చెప్పినంత సులువుగానూ బైబిలులోని 'సెర్మన్ ఆన్ ది మౌంటు'కూ భాష్యం చెప్పగల సమర్థుడు.

ఇతడు సత్యస్వరూపి, ప్రేమమూర్తి, అహింసా వ్రతధారి, నిరాడంబరులలో నిరాడంబి, హరిజనులలో హరిజనుడు, గృహస్థులలో బ్రహ్మచారి, మానవులలో దేవతామూర్తి, యుగపురుషుడు, రాజకీయవేత్త, సంఘసంస్కర్త, వేదాంత వేత్త, ప్రకృతి — వైద్యుడు, శాస్త్రజ్ఞుడు, ఋషి, వీరాధివీరుడు, వివిధభాషలలో అపూర్వవక్త, గీతకు వ్యాఖ్యాన కర్త, అందలి అమూల్య సూత్రాలను అరవై యేళ్ళు ఆచరణలో పెట్టగలిగేనని చెప్పుకోగల అఖండ ఆధ్యాత్మిక శక్తిస్వరూపి, రాజకీయాలను పరమార్థానికి ముడిపెట్టిన ప్రధానమనీషి. భారతీయుల భావముక్తికి, సాంఘిక ముక్తికి, రాజకీయ ముక్తికి, ఆర్థికముక్తికి ఆధ్యాత్మికముక్తికి, జీవిత సర్వస్వాన్నీ తృణప్రాయంగా ధారబోసిన త్యాగస్వరూపి. భారతమాతే — తాను, తానే - భారతమాత. ఇలాంటి సర్వజ్ఞుడూ, స్థితప్రజ్ఞుడూ, మహాత్ముడూనైన "గాంధీజీ సాహిత్యాన్ని" గురించి పది నిమషాల్లో చెప్పమంటే నాతరమా! ఆయన వ్రాసిన హంశాల్ని దిగ్దర్శినిగా చూచాయగా చూపించడానికిగూడ సాధ్యంకానిపని! "భారతాన్నే గనుక నేను వ్రాయవలసి యుంటే బండ్లకెక్కించేద్దు" నన్నబమ్మెరపోతనలాంటి ఏమహాకవో ఈ యుగపురుషుని సాహిత్యం సంగతి ఎత్తాలి. గాంధీ 'భారతా'న్ని, ఆయన మాటల్లోనే, నాలుగు వేల పేజీలుగల 8 'పర్వా'లోకి యిమిడ్చేసరికి, టెండిల్ కర్‌లాంటివాడూ, ఆయన సహకరులూ, టక — టకలాడిపోయారు! భారతాన్ని — ధర్మశాస్త్రం, వేదాంతం, నీతి శాస్త్రం, మహాకావ్యం, లక్షణ గ్రంథం, ఇతిహాసం, పురాణం వగైరాల సముచ్చయం అన్నారు. నవయుగ ప్రవక్తయైన గాంధీ సాహిత్యానికిగూడ ఈ లక్షణాలన్నీ ఉన్నాయనొచ్చు.

గాంధీజీ వ్రాసిన గ్రంథాలు: 'ఆత్మకథ', సత్యాగ్రహం, దక్షిణాఫ్రికాలోని సత్యాగ్రహం, ఆహార సూత్రాలు, శాంతి - యుద్ధకాలాల్లో అహింస, స్త్రీలు — సాంఘిక అన్యాయాలు, హిందూ ధర్మం, స్వదేశీ, బేసిక్ విద్య, వగైరాలు. ఇవిగాక నడిపిన పత్రికలు, నవజీవన్, హరిజన్, యంగ్ ఇండియాలు. వీటిల్లో ప్రతీ వ్యాసం లోను. మాటలోను సాహిత్యం తొణికిస లాడుతూ ఉంటుంది. ఆఖరుకు "ఆయన మౌనంకూడ, లండన్

పౌరులు, సాహిత్యంకంటె, గొప్పగా ఆనందించా"రని డా॥ మాంటుసోరీ వ్రాసింది. 'ఆత్మకథ'లో మచ్చుకు కొన్ని సాహిత్య విషయాలు చూడండి. అందలి భాష అతి తేలిక ; ఆంగ్లేయులుకూడా ఆశ్చర్యపోయారు ఆ కవనానికి. "గద్యం కవీనాం నికషం వదంతి !" తనపై దుర్జనసాంగత్యం సాగించిన ప్రభావాన్ని మర్మంలేకుండా చెప్పడంలో మనకందరికీ మరువరాని గొప్పగుణపాఠా లున్నాయి ; వట్టినీతులెన్ని బోధించినా యీ పద్ధతికి సరి రావు. "'విద్య' అంటే బాలల హస్తం - హృదయం - మస్తిష్కాలకు ఏకరీతిని తర్ఫీదిచ్చి - శరీర మానసిక శక్తుల విజృంభణకు తోడ్పడేది" అన్న డిఫినిషన్ చూడండి; విద్యను గూర్చి యింతకంటె సూక్ష్మంగా చెప్పగలవారెవ్వరు? "నయాగరా జలపాతాన్ని ఉపయోగించడం నేర్చుకున్న మనిషి, తన హృదయకోశంలోని అఖండశక్తిని సద్వినియోగంలోకి తెచ్చుకున్నాడుగాదు" అంటాడు. 'నీవారసూకవత్తన్వీ' అన్న ఋగ్వేద మంత్రంతో యిదితులతూగడంలేదు ? భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాస్తున్నప్పటి ఇతని ప్రథమ వాక్యం చిత్తగించండి ! 'గీత మొదటిసారి చదివినప్పుడే అది ఐతిహాసం కాదనీ, నిత్యం ప్రతిమనిషి హృదయంలోను జరిగే ద్వంద్వయుద్ధ వర్ణనేనని' గ్రహించాడట ! 'నిష్కామ కర్మాచరణ' గీత సారాంశమట ! ఏళ్ళతరబడినీ, నిత్యం, గీత, పారాయణ గావించే మనలో ఎంతమంది దీన్ని అవగాహణ చేసుకున్నాం ? 'హరిజన్' పత్రికలోని సుభాషితం వినండి : 'మానవుడు అందలానికెక్కి చిందులు దొక్కే ఆనందాన్వేషి' అంటాడు ; ఏమి సూత్రప్రాయమైన వాక్కులు ! 'హరిజన్'లో వేరే చోట వ్రాసిన మాటలు : 'గ్రంథాలన్నీ గ్రంథులే నట ; 'తనకే పూర్తి హోదాయిస్తే పాఠశాలల్లో పాఠ్యగ్రంథాలనేవే ఉండవట ! అతని మాటల్లో చలోక్తికూడ నర్మగర్భితంగా ఉంటుంది: సంతకం కోసరం కాగితమిస్తే, డబ్బుకోసరం చేయిచాపుతాడు ! "నా ఐదు రూపాయిలేవి ? - నేను లోభిని (మైకంజూస్ హూమ్), హరిజన్ ఫండుకు యాచకుణ్ణి !" అంటాడు. ఇక ఐదుకు పది చెల్లించకుండా ఎవరైనా యెలా ఉండగలుగుతారు !

ఆ మహానుభావుడు ఒకటి చెప్పాడు, ఒకటి చెప్పలేదు అనలేం : దేవుడు, ప్రార్థన, నమ్మకం, సత్యం, మతం, ఉపవాసం, మౌనం, నిశ్చయత్వం, త్యాగం, పెళ్ళి, స్త్రీలు, వర్ణాశ్రమం, చర్కా, ఖాదీ, స్వదేశీ, మద్యపాన నిషేధం, విద్య, కళ, జాతీయత, స్వరాజ్యం, కార్మికులు, యంత్రాలు, బ్రతుకు, చావు - ఒకటేమిటి ? సర్వం, అతడి వాఙ్మయంలో ఇమిడివుంది. "హక్కు పట్టాలతో బాటు బాధ్యతా చిట్టాలు సంక్రమిస్తాయి" అంటాడు. "మరణంలోనైనా జీవించడం కనబడుతుంది" అంటాడు. "నాకు భగవంతుడంటే సత్యమే" అంటాడు. "అవాఙ్మానస గోచారమైనదొకటి సర్వాన్నీ శాసిస్తుంది" అంటాడు. ఇలాంటి సూత్రప్రాయమైన మాటలు గాంధీజీ వ్రాతల్లో ఎక్కడ చూచినా లెక్కలేనన్ని ఉంటాయి. వాటినితరచే కొద్దీ అనంతార్థం అవగాహన మౌతూనే ఉంటుంది. గాంధీజీ సాహిత్యంలో హృదయం హృదయంతో మాట్లాడుకుంటుంది. అదొక అపూర్వ భాష ! భాషకు మించిన భావసంపద ! ఇట్టిట్టివనిమాటల్లో చెప్పరాని సాహిత్య తళుకులవి !

గాంధీ సాహిత్యంలో మరొక్క విశిష్టత ఉంది ; సాధారణంగా కవి వ్రాతల్లోనున్న ఘనత, కవి జీవితంలో మృగ్యం. కాని, గాంధీజీ మాత్రం, తాను సృష్టించిన సాహిత్యంకంటె, అనేకరెట్లు గొప్పవాడు. నిత్యజీవితంలో తనకు స్వానుభావంగానిది అతడు వ్రాయలేదు. అందులోను అలా అనుభవించిన దాంట్లో ఏ అరవయ్యోవంతో వ్రాశాడు. ఆమాటల వెనుకనున్న అనుభవమూ, సూటిగా హృదయాన్ని తాకే సామర్థ్యమూ అలాంటివి. ఆయన 'ఆత్మకథ'లో మొదటి 52 ఏళ్ళ జీవిత గాథ ఎలా ఇమిడ్చాడో అంతా గమనించే యుంటారు. మరొకరెవరైనా అంత చరిత్రా చెప్పాలంటే అలాంటి వాల్యూములు పదైనా అంతటి సారాన్నీ సారస్వతాన్నీ పెట్టలేరు. క్లుప్తాతిక్లుప్తంగా ముఖ్య విషయాలే చెపుతూ ఆయన వ్రాశాడు. గాంధీ సాహిత్యాన్ని చదివేవారంతా ఈఅంశం జ్ఞాపకముంచుకోవచ్చు. మిగత సాహిత్యకారుల వ్రాతలకు, గాంధీ సాహిత్యానికి ఇలా ఎంతో తేడా ఉంది. ఉపనిషత్తుల భాషలో చెప్పాలంటే గాంధీజీ "ద్రష్ట" (సత్యాన్ని ముఖాముఖీ చూచేవాడు). అందుచేత ఆయన సాహిత్యాన్ని పరికించేవారికి అందులోనున్న దానికంటె పదిరెట్లు అవగాహనలోనికి రాకతప్పదు.

ఇలాంటి గాంధి సాహిత్యాన్ని గురించి ఎంత చదివినా, ఎంత చెప్పినా "చెవులకు తనివయ్యేదిననెడి" వారుండరు. ఇప్పటికైనా ప్రజలూ ప్రభుత్వమూ వీటి సామర్థ్యాల్ని గమనించి, పాఠశాలల్లో పాఠ్య గ్రంథాలుగా పెడితే

బాగుంటుంది. యువతీ యువకులు వీటిని పఠించి అందలి హంశాల్ని కొన్నైనా ఆచరణలో పెడితే ధన్యులమౌతాం.

గాంధీ నేషనల్ మెమోరియల్ ఫండ్‌వారు గాంధీ వాఙ్మయ సాహిత్య - ప్రచారాలకు ఇంకా కృషిసల్పవలసియుంది. కాన్‌స్టిట్యూషన్ నిర్మాణం జరుగుతున్నప్పుడూ, పంచవర్ష ప్రణాళికలు తయారు చేస్తున్నప్పుడూ గాంధీ సూత్రల్ని దృష్టిలోనుంచుకొని నిర్మించేనన్న విషయం దేశానికెంతైనా శుభావహం. ప్రభుత్వంవారు అనుదినం కూడా గాంధీ పలుకుల్లో నమ్మకాన్ని ప్రకటిస్తూనే ఉన్నారు. ప్రభుత్వోద్యోగులు శాసన సభ్యులు వీటిని సర్వత్రావర్తిస్తున్నారు. ఆయన సాహిత్య సంపద దేశానికంతకూ కళతెచ్చేదిగానున్నప్పటికీ, భావిపౌరులు తయారయ్యే కళాశాలల్లో మాత్రం. ఆ కళాకారుని కళనేర్పబడ్డం లేదు. "దేశగర్వము దీప్తిజెందగ, దేశచరితము తేజరిల్లగ, దేశమరసిన ధీరపురుషుల వీరగాథలు" ప్రతీ దేశంలోనూ పాఠ్యగ్రంథాలుగా ఉంటుండే, మనదేశంలో యిది గమనింపకబడకపోవడంకంటె శోచనీయాంశం లేదు. దీన్ని అంతా ఎంత త్వరలో గ్రహిస్తే అంత శుభావహం.

గాంధీ సాహిత్యంలో ఎక్కడ ఏపుట త్రిప్పినా గాంధీ మీతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది. ఏ పలుకు విన్నా 'శరీరం' గగుర్పాటొందుతుంది. చదివేవారి 'చిత్తం' అని వాక్యమైన సంస్కారాన్ని పొందుతుంటుంది. వినే జనుల చెవులు — నోరూ స్వాతివానకు ముత్యపుచిప్పల్లాగు తెరుచుకొని ఉంటాయి! ఒక్కొక్క ఘట్టనలో అప్రయత్నంగా అశ్రుబిందువులు రాలుతాయి. మరొకప్పుడు చేతులు వాటంతట అవే లేచిపోయి జోడించి నమస్కారాలు పెడతాయి :—

"ఖ్యాతిగలట్టి గటికవు లందఱులేరె. అదేమిదో 'వ్యమోహాత్మ' దన్నచో గరగిపోవు నెడెంద, జోహారుచేతకై
చేతులులేచు ; ఆజన వశీకరణాద్భుత శక్తిమూడగా
నాతని పేరులోగలదొ ; ఆ గాంధి సారస్వతాన
నున్నదో !"

అని ముగించవచ్చు.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

ఉరుములు - మెరుపులు

గ్రహాలపట్ల భారతీయులు చూపుతున్నంత ఆసక్తిని భారత ప్రజలపట్ల గ్రహాలు చూపుతున్నవాయని ప్రధాని నెహ్రూ మొన్న బొంబాయిలో అన్నట్లు పత్రికలలో వార్త—

గ్రహాలతో సాంగత్యము చేస్తేనేకదా ఆవిషయము మనకు తెలసేది.

"ఇండియాలో బిసికెట్లు తినుట తగ్గినది" — పత్రికా వార్త.

శ్రీ కిద్వాయిగారి పుణ్యమాని బియ్యము సమృద్ధిగా దేశములో పండుతున్నవిగా !

"భిన్నత్వంలో ఏకత్వము మన సంస్కృతీ లక్షణము" — బూర్గుల.

మన సంస్కృతీ లక్షణమేకాదు. మన జాతి లక్షణము - పైగా ఆంధ్రుల ప్రత్యేక లక్షణము.

"వస్త్రంగమును వృత్తిగా అవలంభించడమే తనకు ఎక్కువ యిష్టంగా వుండేదని. కాని విధి అన్యధా తలచడమువల్ల తాను మంత్రయి ప్రజల విమర్శలకు, పత్రికల విమర్శలకు సరికావలసివచ్చిందని" తిరుకొచ్చి పబ్లిక్‌వర్క్స్ శాఖమంత్రి శ్రీ అచ్యుతన్‌మేనన్‌గారు వాపోయారు — పత్రికా వార్త.

చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునేమి లాభము.

"మన ఫిల్ము నిర్మాతలుగూడా సమాజక్షేమము నిమిత్తము ధర్మసూత్రాలను ఏర్పరుచుకొని పనిచేస్తే బాగుంటుంది" — రాజేంద్ర ప్రసాద్.

ఇది చెవిటివాని చెవిలో శంఖమూదిన చందము కాదుకదా ? — కె. ల. ర.

తపాలా ఆఫీసులు

మన దేశములో రకరకాల తపాలా ఆఫీసులున్నవి.

ప్రపంచములోకెల్ల ఎక్కువగా కుంభవృష్టికి గురి అయ్యే తాపాలా ఆఫీసు చిరపుంజిలోవుంది. ఇది నీలగిరి కొండలపై త్రాళ్ళసహాయంతో తపాలాలు చేరవేయబడుతున్న మాదిరిగానుండును.

రాజస్థాన్ ఎడారులలో ఒంటెలపై పోస్టల్ సర్వీసు జరుగుచున్నది.

హుగ్లీలో స్టీమర్ పోస్టల్ సర్వీసున్నది.

బీహార్‌లో కోసినది వరదలకు గ్రామాలు మునిగిపోయినప్పుడు నాటుపడవలలో తపాలా సర్వీసు నడుపబడుచున్నది.

కాశ్మీరు పర్వత ప్రాంతములలో కంచరగాడిదలతో పోస్టలు సర్వీసు జరుపబడుచున్నది.

ఒరిస్సాలో పోలీసుదళము అతిప్రాచీన వార్తావాహక సాధనమైన కపోతములను ఉపయోగిస్తున్నారట.

నా సింహళ ప్రయాణము

శ్రీమతి ఆ. భాస్కరమ్మ

నా సోదరుఁడు సింహళమును చూచివచ్చి దాని నద్భుతంగా వర్ణించి చెప్పాఁడు. **"See Naples and die"** అంటారు. కాని నేను **"See Ceylon and die"** అంటాను అన్నాఁడు. ఒకటేమాట. అప్పటినుండి నాకు సింహళమును చూడాలని యుండేది. చూచేది యెట్లా? నా జీవితముతో ఎప్పుడైనా సింహళమును చూస్తానా అని అనుకొంటూ ఉండేదాన్ని. నేను చదువుకొనే రోజుల్లో ఒకసారి నీవు చేసిన యొక ప్రయాణాన్ని గుఱించి యింగ్లీషులో కాంపొజిషను వ్రాయమంది మా టీచరు. తక్కిన విద్యార్థులందఱూ మేమేమీ అంత యెక్కువయిన ప్రయాణాలు చేయలేదు. ఏమి వ్రాయమని ఏదో వ్రాశారు. నేను నా సోదరుఁడిచ్చిన వర్ణనంతా వ్రాశేసాను నేనే చూచినట్లు. మా ఉపాధ్యాయిని తరగతికి వచ్చి నిజంగా నీవు సింహళం వెళ్ళావా? అని అడిగింది. నేను వెళ్ళ లేదన్నాను. నీవు చూచినట్లే వ్రాశావే చాలా బాగాను ఏలా వ్రాశావంది. నా సోదరుఁడు వెళ్ళాఁడు. అతను అంతా వర్ణించి చెప్పాఁడు. అదే ఇప్పుడు నేను వ్రాశా నన్నాను. చాలా బాగుందని మెచ్చుకొన్నది,

తిరువనంతపురంలో జరిగే అఖిలబారత మహిళాసభకు వెడుతోన్నాం. అక్కడనుండి వెడితే బహుశః సింహళం కూడా వెడతామన్నాను ఇంట్లో. నా సోదరుఁడనవ్వాడు. మీరు వెళ్ళేవాళ్ళంతా ఆడవాళ్ళు. సింహళం వెళ్ళడమంటే సామాన్య విషయంకాదు. ఇక్కడినుండి వెళ్ళేవాళ్ళని ఆరోగ్యంగా ఉన్నారో లేదోనని పరీక్ష చేస్తారు. వారం రోజులు ఆపేస్తారు. ష్టీమరెక్కడానికి టిక్కెట్టు దొరకడం కష్టం. వెళ్ళారులే. అన్నాఁడు.

త్రివేంద్రంలో కాన్ఫరెన్సు అయిపోయింది. ఇంటికి తిరిగి వస్తోన్నాం. మాతోనున్న ఒకామెకు సింహళంలో ఉన్న ఇండియా గవర్నమెంటు ఏజెంటుగారి భార్య స్నేహితురాలు. ఆమె నాకూ స్నేహితురాలే. ఆమె అంతక్రితమొకసారి వారక్కడుండగా అక్కడకు రమ్మ నమని అడిగింది. సింహళం వెడదామా అంటే వెడదా మని అనుకొన్నాం. రామేశ్వరంలో దిగి అదికూడా చూడాలని రైలెక్కాం. రైలు మండాపం ష్టేషనునకు వచ్చింది. రైలులోని వారు చాలా మంది దిగి ఏవో కాగితాలు తెచ్చుకొంటున్నారు. రైలు చాలాసేపు ఆగిం దక్కడ. మా బండిలోనున్న ఒకాయన వద్దకు వెళ్ళి ఆ కాగితాలేమిటని అడిగాను. అది డాక్టరు సర్టిఫికేట్టనియు, తాను కొలంబోలోనొక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుఁడ ననియు, త్రివేంద్రంలో వాలంటీర్లకు కేప్టెనుగానుండి మమ్ములనందఱి నక్కడ చూచితిననియు చెప్పారు. మేము సింహళం వెళ్ళాలనుకొంటున్నాము. ఇండియా గవర్నమెంటు ఏజెంటుగారి యింటికి వెడతామనియు, ఆయనకూడా కొలంబోలోనేకదా ఉంటారనియు అడిగాను. ఆయన యుండేది కొలంబోకాదు కాండీ, మీరంతా ఆడవాళ్ళు వెడుతోన్నారు. అక్కడ మోసం చాలా యెక్కువగా ఉంటుంది. ఆయనకొక టెలిగ్రామివ్వండి పుల్గావలె జంక్షను దగ్గరకొక నవుకరును పంపమని. అప్పుడు మీరు సుఖంగా వెళ్ళవచ్చునని చెప్పారు.

రామేశ్వరంలో దిగి ష్టేషనునుంచే టెలిగ్రామిచ్చాను ఏజెంటుగారికి. రామేశ్వరంలో సముద్ర స్నానం చేసి, దేవాలయంలోకి వెళ్ళి చూడవలసినవన్ని చూసి రాత్రి మళ్ళీ రైలెక్కాం. తెల్లవారి 10 గంటలకు మండాపం జేరుకొన్నాం. డాక్టరుగారింటికి వెళ్ళాం. ఆయన వచ్చి ఏజెంటు చంద్రన్‌గారు తనకిచ్చిన టెలిగ్రాము చూపిం చారు. మేమంతా బాగా ఆరోగ్యంగా నున్నట్లు సర్టిఫికేట్లు ఇచ్చారు. అవి తీసికొని మళ్ళీ సాయంకాలం రైలెక్కాం. 5 గంటలకు ధనుష్కోడి చేరుకొన్నాం. అక్కడ ష్టీమరు సిద్ధంగా ఉంది. ష్టీమరు దగ్గరకు వెళ్ళేసరికి ష్టీమరులోని ఉద్యోగస్తులు వచ్చి మమ్ముల నాహ్వానించి లోపలికి తీసికొనివెళ్ళారు. అంత పెద్ద ష్టీమరెప్పుడూ చూడక పోవుటచేత అదంతా తిరిగి చూస్తోన్నాం. ష్టీమరులోని ప్రతి యుద్యోగి మా యొద్దకు వచ్చి **What do you want madam? What shall I do for you?** అని యెంతో నమ్రతతో అడుగుతున్నారు. మాకాశ్చర్యం వేసింది. ఏమిటిది యెంతో ఎరిగినవాళ్ళలాగ వీళ్ళిలా వచ్చి మర్యాదచేస్తోన్నారనిపించింది. సింహళం వెడుతో

న్నా మేగాని దానిని గుఱించి యేమీ తెలియదు. ఆ స్టీమరులో ఒకచోట సింహళ ద్వీపపు పెద్ద మేపు ఒకటి తగిలించి యున్నది. వీళ్ళంతా వచ్చి యిలా అడుగుతూ ఉంటే ఒక కుర్చీ తీసికొనివచ్చి ఆ మేపు దగ్గర వేయ మన్నాను. ఒక పడక కుర్చీ తీసికొనివచ్చి అక్కడ వేశారు. ఆ మేపంతా పరిశీలిస్తోన్నాను. మేము స్టీమరు ఎక్కడ దిగుతామో, పుల్గావలె జంక్షను ఎక్కడో, కాండీకి రైలు మార్గమేలా యున్నదో మొదలైన విషయాలన్నీ తెలిసికొంటున్నాను. టిఫను, టీ వచ్చాయి. ఎవరో స్నేహితులింటికి వెడితే వచ్చినట్లు. తీసికొన్నాం. స్టీమరు కదిలింది. అందులో ఒకరికి వాంతులు ప్రారంభించాయి. కొందరు నెమ్మదిగా పడకలు వేశారు. నేను, మరికొందరు కూర్చుని పాక్ జలసంధిలో నుండి స్టీమరు వెళ్ళే మార్గం చూస్తోన్నాం. స్టీమరు శ్రీరాముఁడు కట్టిన వారధి ప్రక్కనుండే వెడుతోంది. కూలి శిధిలమైపోయినా ఇంకా ఆ పెద్ద పెద్ద రాళ్ళు మాత్రం ఉన్నాయిపొడుగునా.

7 గంటలయింది. స్టీమరు తలైమన్నారు రేవుకు చేరింది. స్టీమరులోని ఒక ఉద్యోగి వచ్చి రైలుకు టిక్కెట్లు తెచ్చిపెట్టనా అని అడిగాడు. మాకు సెకండు క్లాసు టిక్కెట్లు కావాలని అంతా డబ్బిచ్చాం. ఆయన ఇక్కడ హిందూదేశంలోలాగ రైలుకు, ఇన్ని తరగతులు లేవు. రెండే తరగతులు - **Upper class & Lower class**, అప్పరు క్లాసులో కొంచెం డబ్బుగలవాళ్ళు, ఉద్యోగస్తులు ప్రయాణం చేస్తారు. లోయరుక్లాసులో కూలీలు, బొత్తిగా డబ్బులేనివాళ్ళు ప్రయాణం చేస్తారు. అప్పరుక్లాసు మీవైపు సెకండుక్లాసువలె ఉంటుంది. కాని కూర్చుండుటకే కాని పరుండుటకు తగిన సదుపాయం లేదు. ఇంతడబ్బూ ఖర్చుపెట్టి మీరు తెల్లవార్లూ మేలుకొని కూర్చోవాలి. లోయరుక్లాసులో ఒక పెట్టె మీకు ప్రత్యేకంగా యిచ్చేటట్లు ఏర్పాటు చేస్తాను. హాయిగా పడుకోవచ్చును. అంతగా మీకు డబ్బెక్కువగా ఉంటే నాకీయండి పిల్లలుగలవాణ్ని అన్నాఁడు. తీసికోమన్నాం. ఆయన నవ్వుతూ ఊరికే అన్నాను. మీవద్ద డబ్బు తీసికొంటానా ? అన్నాఁడు. హార్బరులో దిగి రైలుకు వచ్చాం. రైలు చాలా యెత్తుగా ఉంది. ఎక్కటానికి చిన్న చిన్న బల్ల నిచ్చెనలు వేసియున్నాయి. మాకొఱకు నియమింపబడిన పెట్టె యొద్దకు వచ్చి నిచ్చెనలమీదనుండి లోపలికి వెళ్ళాం. పెద్ద పెట్టె ఒక వందమంది కూర్చోవచ్చు. కడగఁబడి శుభ్రంగా ఉంది. మేము ఏడుగురం పక్కలు పరిచేసికొని హాయిగా పడుకొన్నాం. మాకు టిక్కెట్లు కొనియిచ్చి రైలెక్కించిన ఆయన మా యొద్ద సెలవు తీసికొని వెళ్ళిపోయారు. మాకిదంతా చూస్తో ఉంటే ఆశ్చర్యంగా ఉంది. ఏమిటిది ! ఎంతో ఎరుగున్న వాళ్ళలాగ వీళ్ళంతా ఈలా ఆదరించి గౌరవం చేస్తోన్నారు! ఇక్కడ మర్యాదాయిది ? మన వేపున ఎన్నో ప్రయాణాలు చేశాంకాని ఇంత ఆదరణ యెక్కడా లేదే ! అనుకొంటూ నిద్రపోయాం.

తెల్లవారి 5 గంటలవుతుంది. ఇంకా వెలుతురు రాలేదు. అది జనవరి నెల యగుటచేత యింకా చీకటిగానే యుంది. మాకింకా మెలుకువ రాలేదు. మంచి నిద్దట్లో ఉన్నాం. మా పెట్టె యొద్దకెవరో వచ్చి తలుపు తట్టారు. ఎవరా అని లేచాను. నాచేతికొక టెలిగ్రాము ఇచ్చాఁడు. అది నేను చంద్రన్‌గారికిచ్చిన టెలిగ్రామే. ఈ టెలిగ్రామిచ్చినది మీరేనా అని అడిగాడు వచ్చీరాని యింగ్లీషులో. అవునన్నాను. పుల్గావలె జంక్షను వచ్చింది దిగండి నన్ను చంద్రన్‌గారు పంపారు అన్నాఁడు. సామాను నేను చూసుకొంటాను మీరు వెళ్ళి వెయటింగు రూములో కూర్చోండన్నాఁడు. మేము దర్జాగా వెళ్ళి కూర్చున్నాం. 9 గంటలకు రైలు వచ్చింది. మేము వెళ్ళి బండీలో కూర్చున్నాం. మా పెట్టెలో మేము ఏడుగురము తప్ప యింకెవరూలేరు. రైలు టన్నెల్‌లో నుండి పోతోంది. అందులో ఒక టన్నెలు ఒక మైలు పొడవుంది. అవన్నీ చూస్తూ లంకాద్వీపము యొక్క సౌందర్యాన్ని మెచ్చుకొంటో సరదాగా ప్రయాణం చేస్తోన్నాం. కాండీ స్టేషను వచ్చింది. 12 గంటలయింది. నౌకరు వచ్చి మాకొఱకు సిద్ధంగా ఉన్న రెండుకార్లలో మమ్మెక్కించి తాను వెనకాలనుండి సామాను తీసికొని వచ్చాఁడు. ఏజెంటుగారి బంగళాకు చేరికొన్నాం. ఆ దంపతులిరువురూ మమ్ముల నతిఆదరముతో ఆహ్వానించారు. చంద్రన్‌గారితో దారిలో మాకు జరిగిన గౌరవాదరణలను గుఱించి చెప్పాం. ఇక్కడంతా యీలా మర్యాద చేస్తారా అని అడిగాం. ఆయన సమాధానం చెప్పకుండా నవ్వుకొంటో వెళ్ళిపోయారు. ఆయన భార్య చెప్పింది ఈలా మీరు వస్తోన్నట్లు, మీకు కావలసిన సౌకర్యములన్నీ చేయవలసిందని ఈయన వాళ్ళందరకు టెలిగ్రాములిచ్చారని. వారం రోజులున్నాం అక్కడ. సిగిరి, న్యూవరేలియా, బౌద్ధదేవాలయాలు మొదలైన చూడవలసిన స్థలములన్ని చూశాం.

నా సింహళ ప్రయాణము

న్యూవరేలియో 6000 అడుగుల యెత్తుగల ఒక చక్కని కొండ. లంకాద్వీపానికి మధ్యగా ఉంది. నత్త గుల్ల చంట్లవలె ఆ పర్వతమునకు చుట్టూ చక్కని తారు రోడ్డు మరియొక వైపునుండి రైలు మార్గము ఉన్నవి. ఒక వైపున తేయాకు తోటలు, లవంగ ఏలకుల తోటలు మొదలైనవానితో గూడిన మైదాన ప్రదేశములు, అడవులతో నిండిన యెత్తైన యేటవాలు ప్రదేశములు. మరియొక ప్రక్కన చూస్తే అగాధమైన లోయలు, ఆ లోయలలో అతియెత్తైన రబ్బరు, టేకు మొదలైన చెట్లు. ఈలోయకు, కారు నడచే మార్గమునకు మధ్య ఒక మనిషి మాత్రమే నడచుటకు వీలుగానుండే ఒక సన్నని కాలిబాట. కారు నడిపే డ్రైవరు ఏమాత్రం ఏమరిపాటగానున్నా ఆ కారు ఆ లోయలో పడిపోయిందంటే ఇక యెక్కడా కనపడదు. ఒక కారులో ముగ్గురం కొంచెం పెద్దవాళ్ళం, బాధ్యతకలవాళ్ళం కూర్చున్నాం. రెండవ కార్లో నలుగురు కుఱ్ఱకారు కూర్చున్నారు. కార్లు రెండూ అతివేగంగా యెక్కుతోన్నాయి కొండ. దారిపొడుగునా తేయాకు తోటలు, రబ్బరు తోటలు, ఏలకులు లవంగములతోటలు, అడవులు, జలపాతములు, రకరకముల పక్షులు దృశ్యము అతిమనోహరంగా ఉంది. స్వర్గంలోకి వెడుతోన్నామా అనిపించింది. ఈ సింహళమంత అందమైనది కనుకనే "The pearl of the sea" అన్నాఁడు ఒక కవి. నా సోదరుఁడు చెప్పినమాట నిజమే. ఈ సింహళమును చూచిన తరువాత యిక చూడవలసినదేమీలేదు అను కొన్నాను. జీవితములో పొందవలసిన అతిఉచ్ఛస్థాయి ఆనందము ననుభవిస్తోన్నాం.

వెనుకకు తిరిగి చూస్తిమికదా రెండవకారు కనబడ లేదు. మా కారునాపమన్నాం. ఆ కారు వచ్చే జాడలేమీ కనబడటంలేదు. ఏమయింది ఆ కారు? ఒకవేళ లోయలో కాని పడిపోలేదుకదా? సంతోషమంతా పోయింది. మనస్సు పరిపరివిధాల పరుగెత్తుతోంది, వెనక్కు వెడదామా అనుకొన్నాం. మా డ్రైవరు భయంలేదని మాకు ధైర్యం చెపుతోన్నాఁడు. ఒక గంట అయింది. కారు ఇంకా కనఁబడలేదు. ఇక మాకు ఓపిక తగ్గిపోయింది. ఆరాటము హెచ్చయింది. ఏమీ తోచడంలేదు. ఎందుకు వచ్చామా యిక్కడకు అనిపించింది. ఇక చాలు కారును వెనుకకు మరల్చమని డ్రైవరును తొందరపెడుతోన్నాం.

ఇంతలో దూరాన్నుంచి కారుచప్పుడు వినిపించింది. మా కారు ఆగియుండటం, మేమంతా యేమీ తోచక అక్కడ బయట తిరుగుతో ఉండడం చూచి వాళ్ళు నవ్వుతోన్నారు. మాకు తెలుసు మీరీలా ఖంగారు పడ తారని అందుకే త్వరత్వరగా ముగించుకొని వచ్చాము అన్నారు వాళ్ళు. మాకు చాలా కోపం వచ్చింది. ఏమిటది ముగించుకొని వస్తా? కారే చెడిపోయిందో, టైరే పోయిందో, లేక ఆకారు వంపులు తిరగడంలో దారి తప్పి అగాధంలో పడిపోయిందో అని ఖంగారు పడు తోన్నాం అన్నాం.

అందులో నున్న నా చెల్లెలొకామె చిత్రకారిణి. ఆ దృశ్యాన్ని చూస్తో ఉంటే ఆమె మనస్సు పరవశమై పోయింది. ఆమె అన్నీ మరచిపోయి ఆ కారునక్కడా పించి అక్కడి దృశ్యాన్ని సంక్షిప్తంగా వ్రాస్తోకూర్చుంది. ఆ బొమ్మలు చూపించింది. అంత తక్కువ కాలంలో అంత చక్కగా చిత్రించిన ఆ బొమ్మల్ని చూడడంవలన కలిగే ఆనందం కలగలేదు మా చెదిరిపోయిన మనస్సులకు. వారిని కోప్పడి ఈసారి వారి కారు ముందు మా కారు వెనుక పెట్టి పైకి వెళ్ళాం. ఎక్కడ చూచినా అశోకపు వృక్షములే. పెద్ద వనం దానికి అశోకవనమని పేరు. ఒక చోట నిర్మలమైన ఒక సెలయేరు ప్రవహిస్తోంది. అది పడే స్థలమొక పెద్ద గుండం. స్వచ్ఛమైన రాళ్ళమధ్య నుండుటచేత నీరతి నిర్మలంగా ఉంది. సీతమ్మవారక్కడ సమీపంలోనున్న ఒక అశోక వృక్షం క్రింద ఉండేదని, ఆ గుండంలో స్నానం చేస్తో ఉండేదని చెపుతారు అక్కడివాళ్ళు. ఆ కొండమీద ఒక పెద్ద వూరుంది. అక్కడ తేయాకు తోటల యజమాన్లు దొర్లుంటారు. అక్కడి షాపులన్నీ యూరపియను కంపెనీలవే. ముఖ్యంగా ఇంగ్లీషువారివి.

సింహళం వదిలి తిరిగీ వచ్చేటప్పుడు కొలంబోలో ఆగాం. అక్కడ విక్టోరియా హోటలులో దిగాం. కొలంబోలో ఉన్న హోటళ్లన్నిటిలో పెద్ద హోటలది. అక్కడో గమ్మత్తు జరిగింది. మేమున్న గదిలో టేబిలుమీద రెండు పెద్ద సీసాలున్నాయి. వాటిమీద "ఇటలీ" అని లేబిల్సు అంటించి యున్నాయి. ఇదేమిటి మనగదిలో కూడా సీసాలు పెట్టాడు. మనం త్రాగుతామనుకొన్నారా వీళ్ళు అని నవ్వు కొన్నాం. మాకు దాహం వేసింది. మంచినీళ్ళు కావాలని గుమ్మంలో కూర్చున్న Waiting boy ని పిలిచి మంచినీళ్ళు తీసికొనిరా అన్నాం. అదిగో ఆటేబిలు మీద

ఉన్నాయి అన్నాడు వాడు. ఆ టేబిలుమీద యెక్కడ ? ఇక్కడ బీరు బుడ్లున్నాయన్నాం వాడు నవ్వి అవి బీరు కావండి డిష్టిల్డు వాటరు బీరు సీసాలలో పోశాం లేబిల్సు తీయలేదు. అంతే మీరుస్త్రీలు. అందులోనూ స్వచ్ఛమైన భారతస్త్రీలు మీరున్న గదిలో బీరు సీసాలు పెడతామా ? అన్నాడు. ఆమాత్రం జ్ఞానం వాడికున్నందుకు సంతోషించాం.

అక్కడనుండి అనురాధపురం, గాల్ మొదలైన స్థలాలు చూచుకొని యింటికి చేరుకొన్నాం. మేమతి జయప్రదంగా చేసికొని వచ్చిన (Adventures) సాహసమైన యీ ప్రయాణం విని మా వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. మాసోదరుడు మరీను, ఇదంతా మీ గొప్ప కాదు లెండి ఏజెంటు చంద్రన్ గారి యోగ్యత అన్నాడు.

భావసంకీర్తనము

* కవిరాజహంస, కవికులాంకార, శ్రీ బాలాంత్రపు వేంకటరావు *

సీ॥ చదల చుక్కలపేరి జపమాలలీవోయి !
తొలిమంతరపుపాట తోఁచుదాఁక—
కడలిముత్తెపునావ నడపింపఁగదవోయి !
బ్రదుకుపేటలపాట లదుకుదాఁక !—
బ్రదుకుటామనితోట పల్లవింపఁగదోయి !
జీవకోకిలము కూజించుదాఁక—
జీవవీణను బ్రపంచించిమీటగదోయి !
ఆత్మరాగాలాపమందుదాఁక—

ప్రణయవాహినుల్ గాత్రగోత్రములఁదెరలి
చారులై వచ్చి ప్రణవాబ్ధిఁబడినదాఁక
జీవగాయకుల్ నినుఁజేరిపోవుదాఁక
మైమఱచుదాఁక, పాటలు మాన్పకు ప్రభు !

సీ॥ నేనాడు మాటలు, నిగమంపుఁదోఁటలో
శుకభాషణములుగా శ్రుతులనింతె ?—
నేఁబాడుపాటలు, నిర్మలశ్రుతివీధి
సామగానములుగా, సంతరింతె ?—
నేవ్రాయువ్రాతలు, నీ చిత్రసృష్టిలో
బ్రహ్మసూత్రములుగాఁ బ్రస్తరింతె ?—
నేఁజేయుకైతలు, నిఖిలభారతములో
నాత్మభారతముగా ననువదింతె ?—

అలవుచేఁగాదు— ఆశచేనడుగుచుంటి,
చలముచేఁగాదు— చనవుచేఁ బలుకుచుంటి,
చేవచేఁగాదు— చెలిమిచేఁ జెప్పుచుంటి,
మొదలననిపించి, తుదిని నవ్వేనుగద : ప్రభు !

సీ॥ ప్రభుగోపురము పూర్ణభక్తిచేగట్టించి
గోపరాజెత్తించె శ్రీపతాక !—
రక్తికీర్తనలఁ దారకములోఁ బట్టించి
త్యాగరాజెక్కించె నమృతనౌక—
భక్తికావ్యము రామభద్రుఁడేపల్కింపఁ
బోతరాజూఁదించె భువనమురళి—
లలితకావ్యముకుశీలవులచేఁబాడించి
మునిరాజు మ్రోగించెముక్తివీణ—

వారిలోనెవ్వఁడను గానివాఁడనైన
నందితిపతాక, నౌకాశ్రయంబుగంటిఁ
మురళి వూఁదుచునుంటి నీశరణమంది,
వీణమ్రోఁగింతు నిఁకనీవె వినఁదగుప్రభు !

సీ॥ ఒంటి నేనని నొచ్చుకొంటినిఁగాబోలు !
జంట నేనని యచ్చుకొంటి వీవె—
పదమందదని వెఱ్ఱిపడితినిగాఁబోలు !
పదములందించి కాపాడితీవె—
అర్థమున్నదెయని, యనుకొంటిఁగాఁబోలు !
శ్రుతులంటిచూపి నవ్వితివి నీవె—
భావ్యమా ! యనితొట్రుపడితినిగాఁబోలు !
ఉపనిషద్భావాల నూర్చితీవె—

మనసు వ్రాసినదనుకొనఁ జనితినేమొ !
మనము వ్రాసినదనుమాట మలపి-యిదియె
భక్తతతిపాట- జ్ఞానులబాట- భావ
సూనములపేట యనియెదఁ జూపవె ప్రభు !

సాంఘిక సంక్షేమం

ఇటీవల ఇండియాలో సంఘ సంక్షేమాభివృద్ధికై జరిగే కార్యావళిలో అతి ప్రాముఖ్యమైన హంశం ఏమిటంటే, దేశంలో సంఘ సంక్షేమం సాగించే ఐచ్ఛిక సంస్థల కృషిని సమీకరణగావించడానికై కేంద్ర సంఘ సంక్షేమ బోర్డు యొక్క నియామకం.

ఈ పేజీలలో, మాసమాసం, పాఠకులకోసరం - ఆ బోర్డుయొక్క కృషి. సాధించిన పనులూ, వీటితోబాటు, కేంద్ర సంఘ సంక్షేమ బోర్డువారు ప్రకటించే 'సంఘ సంక్షేమ' పత్రికనుండి కొన్ని ముఖ్య వ్యాసాల తర్జుమాలు కూడ ప్రకటించగలిగే అవకాశం మాకు లభించినందుకు గర్విస్తున్నాం.

ఈసదవకాశాన్ని మాకు కల్పించినందుకు బోర్డువారికి మా కృతజ్ఞత తెలియపరుస్తున్నాం.

★



స్త్రీలు - కార్మిక సంక్షేమం

పద్మినీసేన్ గుప్త

మానవుడు తన స్వంత పనిముట్లతో తన ఆత్మీయుల సహాయంతో తన జీవితావసరములను తయారు చేసుకొంటూన్నన్నాళ్ళూ కార్మిక సంక్షేమం అనే ప్రసక్తే లేదు. పారిశ్రామిక విప్లవం ధర్మమా అంటూ ఆవిరి యంత్రాలతో బాటు కర్మాగార పద్ధతి అమలులోకి వచ్చినందువల్లనే అనేక కార్మిక సమస్యలు యేర్పడ్డాయి; ఆ సమస్యలను పరిష్కారం చేయడానికే కార్మిక సంక్షేమ కార్యక్రమం యొక్క ఆవశ్యకత కలిగింది.

ప్రస్తుత పారిశ్రామిక వ్యవస్థలో కార్మికుడు కూలి కోసం ఒకరి అజమాయిషీలో పనిచేసే వ్యక్తి. అతనుపయోగించే పనిముట్లమీద గాని, ముడి పదార్థాలమీద గాని, తాను తయారు చేసిన వస్తువులమీద గాని అతనికే మాత్రం అధికారం లేదు. వీటన్నిటికీ యజమాని పెట్టుబడిదారు. కార్మికుడు యజమానింప బడేవాడు మాత్రమే. అందుచేత యజమానికీ కార్మికులకీ మధ్య స్పర్ధలు రావడం సహజం. వాటిని సరిదిద్ది పరిశ్రమలో సామరస్యం చేకూర్చి కార్మికుని పురోభివృద్ధికి తోడ్పడడమే కార్మిక సంక్షేమ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. కార్మికులు యంత్రాల్లో పళ్ళచక్రాల్లాంటి వారు మాత్రమేగాక, వారూ మానవులే కాబట్టి వారికి ఆరోగ్యం, విద్య, వసతి మున్నగు సౌకర్యాలు కల్పించే బాధ్యత సంఘంపైన వుంది. కార్మికుల సంతృప్తిపైననే జాతియొక్క శ్రేయస్సు ఆధారపడి వుందని గ్రహించుటచేతనే మన ప్రభుత్వం కార్మిక సంక్షేమ కార్యక్రమాన్ని జయప్రదంగా కొనసాగించేందుకు కృషి చేస్తోంది.

కార్మికుని జీవితం సుఖప్రదం చేయడమే కార్మిక సంక్షేమ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఈ కార్యక్రమమును సక్రమముగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వం, పెట్టుబడిదారు, కార్మిక సంఘాలు, సంఘ శ్రేయస్సు నభిలషించే స్వచ్ఛంద సేవకులపైనా ఆధారపడి వుంది. ఈ రోజుల్లో కార్మిక సంక్షేమ కార్యక్రమానికి విశిష్టమైన ప్రత్యేక పద్ధతులేర్పడ్డాయి కాబట్టి ఆ పద్ధతులను అవగాహన చేసుకుని వాటిని అమలులో పెట్టగల సమర్థత లేబర్ ఆఫీసర్లోనూ, అతని సిబ్బందిలోనూ వుంటేనే యీ కార్యక్రమం జయప్రదం అవుతుంది. ఈ 'లేబర్ ఆఫీసరు' యజమాని కార్మికుల మధ్య సమన్వయం యేర్పరచుటకు నియుక్తుడైన వుద్యోగి. వేలకొద్దీ కార్మికుల శ్రేయస్సు వారి జీవితపథం 'లేబర్ ఆఫీసరు' సమర్థతపైనే చాలా మటుకు ఆధారపడి వుంది. అందుచేతనే యీ 'ఆఫీసరు' ఆఫీసరుమాత్రమే గాక జీతం కోసమే పనిచేసే వుద్యోగిమాత్రమే గాక కార్మిక సంక్షేమమనే మహత్తర ఆశయ సిద్ధికి పాటుపడే మనఃప్రవృత్తి కలిగి వుండాలి.

పరిపాలనా భారం వహించిన యీ యేడేళ్ళ స్వల్ప కాలంలోనే మన ప్రభుత్వం శ్రామికుల సుఖ జీవనానికి తోడ్పడే అనేక శాసనాలు చేయగలిగింది. వీటిలో ముఖ్యమయినది సమగ్రమైన 'ఫాక్టరీస్ ఏక్ట్'. కార్మికుల నెదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించి కార్మిక సంక్షేమానికి తోడ్పడుతోంది యీ శాసనం. కర్మాగారాల్లోని 'మురికి'ని కడిగి వాటిలో పనిచేయుటకనువగు పరిస్థితుల నేర్పరచడంలో నేమి, శుభ్రమైన పాయిఖానాలు, కేంటీనులు, సంక్షేమ కేంద్రాలు, క్రీచీలు, విశ్రాంతిగదులు-యిట్లే అనేక అవసరాలు యీశాసనంవల్ల కలుగజేయబడ్డాయి. 11 ఏండ్లలోపు గల పిల్లలను ఫాక్టరీలలో నియోగించరాదన్న హంశం గూడా యీ చట్టం స్థిరపరిచింది. ఈ సౌకర్యాలన్నీ కర్మాగారాలలో నెలకొల్పబడ్డాయా లేదా అని పరీక్ష చేసి లోటుపాట్లను సరిదిద్దడానికి సంక్షేమోద్యోగులను (వెల్ఫేర్ ఆఫీసర్ను) నియమించుటకు యీ చట్టం వీలు కలుగజేసింది. ఈ వుద్యోగులు యజమానుల సహకారంతో కార్మికుల శ్రేయస్సుకు పాటుబడుతూ వుంటారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక మన ప్రభుత్వం సాధించిన ఘన విజయాల్లో "ఎంప్లాయీస్ స్టేట్ యిన్సూరెన్సు ఏక్ట్" ఒకటి. ఈచట్టం ఢిల్లీ కాన్పూరు పట్టణాలలో అప్పుడే అమలులో పెట్టబడింది. దేశంలోని తదితర పారిశ్రామిక పట్టణాలలో గూడ త్వరలో అమలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ శాసనం కలుగజేసే సదుపాయాల వల్ల కర్మాగారాల్లో చిక్కి శల్యమౌతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి


చక్కబడి తీరుతుంది. కార్మికులకు తగువసతి కల్పించడం మొదలగు అనేక సౌకర్యాలు మన పంచవర్ష ప్రణాళిక ద్వారా కార్మికవర్గానికి అందుబాటులోనికి రాబోతున్నాయి. ఈనాడు కార్మిక సంక్షేమం అన్నది మహత్తరమైన సమస్యగా పరిగణింప బడుతోంది.

దేశంలో పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే స్త్రీ కార్మికుల సంఖ్య సుమారు అయిదు లక్షలు. ఇది 70 లక్షల స్త్రీల వరకున్న కార్మిక సంఖ్యగల గ్రేట్ బ్రిటన్‌లాంటి దేశాలతో పోలిస్తే తక్కువే అనుకోండి. నిజానికి ఇంగ్లాండు లోని కార్మిక సంఖ్యలో మూడోవంతు స్త్రీలే. మనదేశంలో స్త్రీ కార్మికుల సంఖ్య తక్కువైనా, ప్రభుత్వంవారు అనేక మంది స్త్రీలను లేబర్ ఆఫీసర్లుగా నియోగించారు. మెటర్నిటీ బెనిఫిట్ ఆక్టు (గర్భవతిగానున్నప్పుడు సెలవు, అలవెన్సు మొదలగు సదుపాయాలు కలుగజేసే-చట్టం) అమల్లోపెట్టారు. 50మంది కార్మికస్త్రీలకంటె మించిఉన్న కర్మాగారంలో క్రీడాస్థలంకొల్పాలని, ప్రొద్దుట 6- సాయంత్రం 7గం,లకు మధ్యకాలం తప్పించి ఇతరకాలాల్లో వీరిని వినియోగించ రాదని, విస్తారం బరువులు ఎత్తించ రాదని, విశ్రాంతికి, కాలకృత్య నిర్వహణకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని యిట్లే అనేకవిషయాల్లో ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని కార్మికు స్త్రీల యోగక్షేమాలు కనిపెడుతున్నారు. ఒకేపనిచేసే స్త్రీపురుష కార్మికులకు సమాన వేతనాలివ్వాలని కూడా నొక్కి చెబుతున్నారు. అందుచేత మన దేశంలో కార్మికస్త్రీల స్థితిగతులు చాలబాగు పడ్డాయి. యుద్ధకాలంలో నారమిల్లుల్లో పనిచేసే స్త్రీల దురవస్థ నాకు బాగా జ్ఞాపకం- రాత్రుళ్ళు లాంతర్లు పట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ అర్ధరాత్రులు పనిచేయడానికి వెళ్ళేవారు. అప్పుడు ఏర్పడ్డ పరిస్థితుల్లో స్త్రీలను బొగ్గుగనుల్లోనికి, కూడ పంపించి పని చేయించేవారు. ఇలాంటి అవస్థలన్నీ పోయినందుకు అంతా సంతోషిస్తున్నారు.

అంటే కార్మికుల, అందు ముఖ్యంగా స్త్రీలయొక్క, సంక్షేమం సంతృప్తికరమైన అవధికి వచ్చిందని గాదు. ఇంకా చేయవలసింది ఎంతో ఉంది; ప్రతీ పారిశ్రామిక సంస్థలోను ఇంకా ఎక్కువగా ఉమెన్ లేబర్ ఆఫీసర్లను నియోగించేటట్లు చూడ వలసియుంది. కొన్ని పరిశ్రమల్లో నుంచి స్త్రీలను తీసేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరికి శాసనప్రకారం సమకూర్చ వలసిన సౌకర్యాలు ఎక్కువగా ఉంటున్నాయని! విద్యా సౌకర్యాలు అభివృద్ధి పొందుతున్న యీ రోజుల్లో స్త్రీలను హెచ్చుగా నియోగించడానికి బదులు, వారి సఖ్యతగ్గించడం చాలా శోచనీయం.

ఇండియాలో కార్మికుల సంక్షేమ కార్యక్రమావళి ఎత్తుకునే ముందు వారిస్థితిగతులు అవగాహన చేసుకోవాలి. ముఖ్యంగా తోటిసోదరులకంటె అమాయకత్వంలోను, అదోతంతులోను పూర్వాచారాల్లోను పడికొట్టుకొనే స్త్రీల విషయంలో వీటిని అర్థం చేసుకోవాలి. ఆధునిక పాశ్చాత్య పద్ధతులు ఇండియా కర్మాగారాల్లోను, కార్మికుల యిళ్ళల్లోను ప్రవేశ పెట్టాలంటే వాటిని కార్మికులు ఎంతవరకు అవగాహన చేసుకున్నారు అన్నదాన్నిబట్టి అవిజయప్రదమౌతాయి. ఒక శ్రేయోభిలాషియైన ఉమెన్ వెల్‌ఫేర్ ఆఫీసరు — స్త్రీ కార్మికులను టొమెటోపళ్ళు వండకుండా తినడం చాలా ఆరోగ్యం అని హెచ్చరించింది! వీటిని పైటచెరుగుల్లో దాచి ఇంటికి పట్టుకుపోయి వండుకునేవారు చాలమంది! వండుకు తినడం కంటె టమెటోలు అలాగే తినడం చాల ఆరోగ్య కరమని మనవారికి ముందునచ్చితే తప్ప పూర్వాచార పరాయణులు బాగుపడ్డం ఎలాగ!

పురుషుల సంక్షేమ కార్యక్రమావళి కంటె స్త్రీల సంక్షేమ కృషి చాలకష్టం— ఏందుకంటె స్త్రీ ఒక విశిష్ట సాంఘికవ్యక్తి —భౌతికరీత్యాను, మానసికశాస్త్ర రీత్యాను ఆమె తత్వమేవేరు. ఒక సంక్షేమపత్రిక వ్రాసినట్లు "ఆమె పురుషునికంటె శారీరకంగా అబల, అందుచేత కాయకష్టం విస్తారంగా కావలసిన వృత్తులకు ఆమె సరిపడదు. సంతానాన్ని కనవలసిన విధికూడా వుంది ఆమెకు. అందుచేత కాన్పుకు ముందూ వెనుకా చాల విశ్రాంతి కావాలి. ఆమె ప్రేమను, ఆమెకృషినీ ఆశిస్తూ, ఆధారపడే ఎడబిడ్డల బాధ్యత ఒకటి వుంటుంది. ఆబిడ్డను గురించిన శ్రద్ధా దానికేమైనా అస్వస్థత వచ్చినప్పుడు మరీ ప్రత్యేక శ్రద్ధా, ఆమె కాలాన్ని చాలమట్టుకు తీసుకుంటాయి. ఆమె ఇంకా 'ఇంటావిడ'గా చేయవలసిన పనులున్నాయి— వంట, గృహ నిర్వహణ, భర్తకు సహధర్మచారిణిగా నిర్వర్తించవలసిన పనులు, బంధువులు, అతిథి— అభ్యాగతుల్ని ఆదరించే బాధ్యత ఆమె వహించ వలసివుంది. భర్తకుగాని, కుటుంబంలో మరొకరికి గాని రుగ్మత వస్తే, ఆమె ఇంటివద్ద తప్పక ఆగి పోవలసివస్తుంది. ఆమే గదా కుటుంబానికి ప్రకృతి ప్రసాదించిన దాది (నర్స్)! పనిలో నుంచి




క్రెచీలో వంటశాల

తిరిగి వచ్చిన మగవాడు, తన సులక మంచంమీద ఒరిగి భోజనం కావాలన వచ్చు, కాని స్త్రీ పనిలోనుంచి రాగానే విశ్రాంతి అన్నదే లేక, వండాలి. కడగాలి, బిడ్డల్ని ఛస్తూ నవరించాలి. ప్రకృతి ప్రసాదించిన యీబాధ్యతలను స్త్రీలే ఎక్కువ అవగాహన చేసుకోగలరు. అందుచేత స్త్రీలనే ఎక్కువగా లేబర్ వెల్‌ఫేర్ ఆఫీసర్లుగా నియోగించాలి. విమెన్ వెల్‌ఫేర్ ఆఫీసర్లు కావాలన్న ప్రణాళికలు శీఘ్రంగా అమలు జరగాలి.

మన కర్మాగారాల్లో ముఖ్యమైనలోటు యేమిటోమనకి తెలుసు. గంటల తరబడిని అదేపనిగా విసుగు కల్పించే పనియివ్వడం; ఎక్కువ గంటలు అట్లేనిలబడ్డం, దుమ్ము శబ్దం — విశ్రాంతిలేమి. విశ్రాంతి స్థానాల లోపం. వీటన్ని టినీకూడా సరిచెయ్యవచ్చు - క్రమంగా సరిదిద్దుతున్నారు. కాని, వీటిని పూర్తిగా సరిదిద్దడానికి చాలాకాలం పడుతుంది. పనిచేస్తున్నప్పుడు విసుగు పుట్టకుండా, పాటలు వినిపించడం, అన్నది మనదేశంలో ఎవరూ ఆలోచించరు. ఇతర దేశాలన్నీ ఈ సంక్షేమ సూత్రాన్ని ఆచరిస్తున్నాయి.

ఫాక్టరీ కొంచెం చూడసొంపుగాచేయడం అన్న సమస్య మరొకటి. జపాన్‌లో స్త్రీలు పనిచేసే ప్రతీ మనిషికూ ఒక చేపల్నిపెంచే పెట్టెను వుంచుతారు. చూడ్డానికి ఏదోచక్కగా ఉంటుందని. మన పారిశ్రామిక సంస్థల్లో దుమ్మూ, కశ్మూ తలా తిరిగించే వాతావరణం, తప్ప మరేమీ ఉండదు! ఫేక్టరీలు పరిశుభ్రంగా ఉంచడం అన్నది కూడ కలలోని మాటే, గ్లాసు కిటికీలుండే గిందే — ఫూళి దూసరాలై ఉంటాయి, గోడల కెక్కడ చూచినా తమల పాకుల ఉమ్ముల మరకలు. ఇక ఫాక్టరీల్లో నేల చూడబోతే ఏవంకజూచినా చెత్త చదారాలు! శబ్దానికా లోటు వుండదు. ఒకరి కొకరు మాట్లాడుకున్నది వినబడకుండా ఉండేటంత శబ్దం! గంటలకొద్దీ అలా నిలువు కాళ్ళపై పడుగాపులు పడి నిలుచుండ వలసిందేగాని పనిచేసేవారు కొంచెం కూర్చుందామంటే వీలుండదు- ఫలితం స్త్రీల అంతరంగాల్లో బాధలు - శాశ్వతమైన నడుంనొప్పి బాధలు!

వృత్తివల్ల సంక్రమించే రోగాలు:— చాలమంది కార్మిక స్త్రీలు "మైసి" అనే పొడుం (తాటాకులు, పుగాకు కలిసింది) తమ రొంటిని దాచి ఉంచుకోడం చూచాను. దీన్ని తరుచు ఇంతంత నోట్లో వేసుకుని నములుతారు. అది అప్పటికి-కొంత హుషారు ఇస్తుందట. అది ఏలాగున్నా దంతాలు పూడడం — నోటికి దుర్గంధం మాత్రం తథ్యం. వృత్తులవల్ల సంక్రమించే రోగాల్ని ఏకరువు పెట్టడం ఇక్కడ సాధ్యంకాదు. కాని తరుచు ఫ్యాక్టరీలలో దుమ్ముమాసరితమైన గాలిపీల్చడం వల్ల అనేక శ్వాసకోశరోగాలు, గొంతుక రోగాలు వస్తాయి; కొన్ని రసాయనికాలు తాకడం వల్ల చర్మ రోగాలు వస్తాయి. నారమిల్లుల్లో నూనెవల్ల వచ్చే చర్మదద్దుర్లు. దక్షిణాన్ని చాలకాలం క్రితం ఒక గ్లాసుఫ్యాక్టరీ చూసేను- దాంట్లో 14 ఏళ్ళలోపు వయస్సు పిల్లలు గ్లాసు గ్లోబులూ, చిమ్నీలు చేయడానికి ఊదడం అదేపనిగా రోజూ గంటల



క్రెచీలో పిల్లలకు ఆహారం పంచుట

కొద్దీ చేసేవారు. వారి దవడలు పడిపోయివుంటాయని, పెదిమెలు పుండుపడి ఉంటాయని నేననుకుంటున్నాను. ఒక చోట కొందరు స్త్రీలు పనిచేస్తున్న ఒక గదిలోకి వెళ్ళేను - ఏవో కొన్ని పొగలవాసనలతో నిండిఉంది ఆ గది — ఒకక్షణంలో ఊపిరాడకుండా కొట్టుకుపోయేను నేను. అక్కడ గంటలకొద్దీ స్త్రీలు ఎలా పనిచేస్తున్నారో దైవానికే ఎరుక! ఇలాంటి సమస్యలు దండిగా ఉన్నాయి - ప్రభుత్వంవారు, యజమానులు, ట్రేడ్‌యూనియన్లు, వాలంటీర్లు, లేబరు ఆఫీసర్లు పరిష్కరించవలసినవి. ఇంకా పారిశ్రామిక ప్రభుత్వశాఖల పని చెప్పనేలేదు.

కొంచం శ్రద్ధవహించి చేసే వెల్‌ఫేర్‌పద్ధతులవల్ల, పారిశ్రామికుల్ని కొంచం చాకచక్యంతో కనిపెట్టడంవల్ల అపాయాలు జరక్కుండా ఆపడానికి వీలుంది. ఒక్క ఉదాహరణ చెపుతా: ఉత్తర హిందూస్థానంలోని స్త్రీలు ముంజేతుల నిండా బరువైన అలంకారాలుధరిస్తారు. నారను మెత్తగా చేయడానికి మిల్లులో పెట్టేటప్పుడు ఆమె చెయ్యికూడ నారతోపాటు యంత్రంలోకి పోయింది. ముంజేతి గాజులు దాంట్లో చిక్కుకోవడంవల్ల దాన్ని చప్పునలాక్కోందుకు వీలులేదు — ఇలాంటి అపాయాలు ఆ మిషీన్లనునడిపేవారిని తరుచు శ్రద్ధగా పరీక్షించడం వల్లనూ, ఆ స్త్రీలను అలాంటి అనవసరం, బరువుచేటునైన అలంకారాలు ధరించవద్దనడం వల్లనూ తగ్గించొచ్చు. ఈ రెండోపని చేయాలంటే మాత్రం ఆ కార్మిక స్త్రీల వంశపారంపర్యా సంక్రమించే అలవాట్లు, ఆచారాల్ని అర్థం చేసుకోవాలిసుమండీ! అంతేగాని హిందూస్థానీ స్త్రీలు ముంజేతి అలంకారాలు ధరించరాదని వట్టినే ఉత్తరువు జారీచేసేమంటే - వెంటనే తిరుగుబాట్లు సిద్ధం! ఇలాంటివి నెమ్మదిగా బోధపరచాలి; ప్రశాంతంగా, వాటి అనర్థాలు విశదీకరించి నచ్చజెప్పాలి. ఇలాంటివాటిల్లోనే విమెన్ వెల్‌ఫేర్ ఆఫీసర్లు, యజమానులు యొక్క చాకచక్యం తెల్లమౌతుంది. యదార్థానికి పెర్సొనెల్ ఆఫీసర్లకు కావలసిన ముఖ్యలక్షణం ఏమిటంటే చాకచక్యమూ, కార్మికులపై ప్రేమాను.

వారిజీవిత పరిస్థితులుకూడ తరుచు పరికిస్తూ బాగుచేస్తుండాలి. లేబరు ఆఫీసర్లకు కార్మిక సేవాభిలాష వున్నప్పుడే యివి సాధ్యమౌతాయి. నేనేదో గొప్పదాన్ని, మిమ్మల్ని ఉద్ధరిస్తాను అన్నది కార్మికుల విశ్వాసాన్ని మారగొనలేవు. ఆహారీలైన్లలోను, నారమిల్లుల్లోను కార్మిక స్త్రీలతో కలిసి టీత్రాగుతూ (పిచ్చా-పాటీ) కబుర్లు చేయడంకంటె నాకు ఆనందదాయకమైన పనిలేదు. కార్మిక స్త్రీల సహవాసం సంపాదించాలంటే ప్రయాసపడాలి, ఓపిగ్గా చాలకాలం గడపాలి. కాని వీటివల్ల అమోఘమైన ఫలితం సాధించవచ్చు.

ప్రసూతి సౌకర్యాలు సరిగా యిస్తున్నారా లేదా? క్రీచీలు, క్లినిక్కులు చక్కగా పని చేస్తున్నాయా? అని చూస్తూ తరుచు ఆరోగ్య పరీక్షలు గావించాలి. అంటురోగాలు వస్తే చప్పున నిరోధక చర్యలు తీసుకోవాలి. హోటళ్ళలో చవగ్గా ఆరోగ్య కరమైన ఆహారం పెడుతున్నారో లేదో గమనించాలి. సహకార సంస్థలూ, డబ్బు సర్దే బ్యాంకులూ ఏర్పాటు చేస్తే, డబ్బు వడ్డీలకిచ్చే వారి చేతుల్లో కార్మికులు చిక్కుకోరు. ఇలా శ్రద్ధ తీసుకోవలసినవి లెక్కలేనన్ని పనులున్నాయి - కార్మిక సంక్షేమోద్యోగినులు (వెల్‌ఫేర్ ఆఫీసర్లు) సాధించవలసినవి.

వెల్‌ఫేర్ సెంటర్లు, క్లబ్బులూ పెడితే స్త్రీలు బాగుపడరనుకోవడం తప్పభిప్రాయం. కార్మిక స్త్రీలకై ప్రత్యేకించిన క్లబ్బులకు వెళ్ళి రేడియో వినడం, ఆటలు ఆడడం, క్రొత్త వంటలు నేర్చుకోవడం, కుట్టడం, చదవడం అంటే వారికి ఎక్కువ సరదా. ప్రథమంలోవుండే సిగ్గు, క్రమంగా తగ్గినకొద్దీ వారికి చలోక్తి కావలసినంత ఉంటుంది. వారు కొంచం కూర్చుని, నవ్వుకొని, మాట్లాడుకొనే అవకాశాలిచ్చే స్నేహపూరితమైన సౌకర్యాలు కల్పిస్తే వారు తప్పక వాటిని సద్వినియోగ పర్చుకుంటారు. వాక్తృత్వ పోటీలన్నా, మీటింగులన్నా, సినీమా ఆటలు చూడ్డమన్నా వారికి చాల సరదా. ఇట్టి అవకాశాలు కార్మిక స్త్రీలకు కల్పిస్తే సంఘ సంక్షేమ కార్యక్రమంలో ముందడుగు వేసామన్నమాటే.

లేబర్ వెల్‌ఫేర్ కృషిలో ఐహికంతోబాటు ఆముష్మికం విలువ ఇమిడి వుంది. కష్టపడి పనిచేసే కార్మికుల్ని ప్రేమించడం అన్నది ముఖ్యం. ఎంత సాంకేతిక విజ్ఞానం ఉన్నా, మానవునిలోని "మానవత్వం" ఉంటేనే అన్నీ రాణిస్తాయి.

"నేను దేవతవలె మాట్లాడవచ్చు. ఎల్లా మాట్లాడమంటే అల్లాగే మాట్లాడుతుంది నాలిక. కాని ఆ మాటలలో ప్రేమ లోపిస్తే అది వట్టి కంచుమ్రోతే సుమా" అని సెయింట్‌పాల్‌గారన్నట్లు కార్మిక సంక్షేమ కార్యక్రమానికి గీటురాయి చెమటూడ్చి పొట్ట పోషించుకునే కార్మికుడంటే గౌరవము, ఆదరణ, ప్రేమ.

"స్వచ్ఛంద సేవ ఆంధ్ర ప్రజల రక్తంలోనే ఒదిగి ఉన్నది"

ఆంధ్రరాష్ట్ర సంఘ సంక్షేమ సలహా సంస్థ సమావేశం, కర్నూలు.

అధ్యక్షురాలు శ్రీమతి చన్నఘంటమ్మగారి ఆహ్వానోపన్యాసము

గౌరవనీయులైన ముఖ్యమంత్రీ, మంత్రివర్గ సభ్యులారా, ప్రధాన కార్యదర్శీ. రాష్ట్రసంక్షేమ సంస్థ సభ్యులారా,

ఆంధ్ర రాష్ట్ర సంఘ సంక్షేమ సలహా సంస్థ తరఫున మీకందరకు ఈసమయాన హృదయపూర్వక స్వాగతం ఇవ్వగలుగుతున్నందుకు నేను చాల గర్విస్తున్నాను. ఈ సంస్థ స్థాపింపబడిన తర్వాత, ఆంధ్ర రాజధానిలో జరుపుకుంటున్న ప్రథమ సమావేశ కార్యకలాపాలకు ప్రారంభోత్సవం చెయ్యటానికి, వాటిని ఆశీర్వదించటానికి శ్రీ ముఖ్యమంత్రి అంగీకరించటం మహద్భాగ్యం. రాష్ట్ర సంస్థలోని నా సహసభ్యులందరూ ఈ విషయాన్ని తప్పక అంగీకరిస్తారు. మీవంటి ప్రముఖ వ్యక్తులందరూ ఈ సమావేశంలో పాల్గొనటం మా అదృష్టమే ఇతరమైన బాధ్యతలు మీమీద ఎన్ని ఉన్నా, ముఖ్య కార్యక్రమాలు ఎన్ని ఉన్నా, సంక్షేమ కార్యక్రమాల పట్ల మీకున్న అభిమానాన్ని, ముఖ్యంగా శైశవదశలో ఉన్న ఈ సంస్థ కార్యక్రమంపట్ల మీకున్న ఆదరాన్ని పురస్కరించుకొని మీ అమూల్యమైన కాలమును కొంత ఇక్కడ వినియోగిస్తున్నారు. మీరు చూపుతున్న ఈ వాత్సల్యానికి, గౌరవానికి నేను కృతజ్ఞురాలను.

కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ 1953 ఆగస్టులో నెలకొల్పబడి శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారి అధ్యక్షతను నిర్వహింపబడుతున్నది. ప్రజలను ఉత్తేజపరచి, వారి ఉత్సాహంవల్లను, సౌహార్ద్రంతోను, స్వచ్ఛందసహకారంతోను సంఘసంక్షేమాన్ని జాతీయ విస్తృతంగా నెలకొల్పటమే ఈ సంస్థ ముఖ్యోద్దేశము. ప్రజలకు అవసరమైన సూచనలను, ఆర్థిక సహాయాన్ని ఒక నిర్ణీత సూత్రంప్రకారం అందజేస్తూ, ప్రభుత్వం, వారి సేవా కార్యక్రమాలను గుర్తించి వారికి తమ సహకారాన్ని అందజెయ్యటానికి పూనుకున్నదనే విషయాన్ని వారు గుర్తించి తమ కార్యక్రమమును నూతనోత్సాహంతోను, సులభంగాను నెరవేర్చగలిగేటందుకు పైసంస్థ తోడ్పడుతుంది. మొదటి పంచవర్ష ప్రణాళికలో ఈ కార్యక్రమం నిమిత్తమై నాలుగుకోట్ల రూపాయలు కేటాయించబడినవి. స్త్రీ సంక్షేమం, పిల్లల సంక్షేమం, నిరాశ్రయుల సంక్షేమం, వికలాంగుల సంక్షేమం. బాల్యనేరస్థుల సంస్కరణ నిర్వర్తిస్తున్న స్వచ్ఛంద సంస్థలలో ఈ కార్యక్రమాన్ని వ్యాపింపజెయ్యాలని కేంద్రసంస్థ నిర్ణయించింది.

కేంద్ర సంస్థ నియమించిన పరిశీలనా సంఘాలు వివిధ రాష్ట్రములలో సంక్షేమ కార్యక్రమం కొనసాగిస్తున్న ఎనిమిది వందల స్వచ్ఛంద సంస్థలకు పైగా పరిశీలించి, వారి నివేదికలను, సహాయముచెయ్యవలసిన సంస్థలను గురించిన సిఫార్సులను కేంద్ర సంస్థకు అందజేశారు. ప్రచురించబడిన జాబితాల ప్రకారం, మన రాష్ట్రంలో, చిరకాలమై స్థాపింపబడినవి ఐతేనేమి, క్రొత్త సంస్థలైతేనేమి మొత్తం 66 సంస్థలు రు 2,24,000 ల ఆర్థిక సహాయాన్ని పొందినవి. జూలై నెలలో కేంద్ర సంస్థ మరి22 సంస్థలకు ఇంచుమించు రు$1\frac{1}{2}$ లక్షల సహాయాన్ని అందజేసినది. ఈ ధనము రెండు దఫాలుగా అందజేయబడుతుంది. కొన్ని సంస్థలు పూర్తి సహాయాన్ని రెండు దఫాలలోనూ పొందినవి. మరికొన్ని మొదటి దఫా సహాయాన్ని పొంది, మిగిలిన ధనం కోసమై దరఖాస్తు పెట్టినవి. ఈ ధన సహాయము "మేచింగ్" పద్ధతిపై, మొత్తం ఖర్చులో నూటికి 50 వంతులు, సంక్షేమ కార్యక్రమములను విస్తృతం చెయ్యటంలో అవసరమైన సామగ్రి, పరికరాలు కొనుటకై వెచ్చించిన ధనంలో సగభాగం, సాధారణంగా మొత్తం రు 10.000 లు మించకుండను, ప్రత్యేక సంవత్సరంలో రు 15,000 లు మించకుండను, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ భరిస్తుంది.

వివిధ రాష్ట్రములనుండి వేలాది దరఖాస్తులు రావటం ప్రారంభించినవి. దీనితో కేంద్ర సంస్థ దీని నంతను నిర్వహించుట అసాధ్యమైపోయింది. సంఘ సంక్షేమ కార్యక్రమంలో పాల్గొంటున్న ఏ సంస్థ సహాయాన్ని పోగొట్టుకోవటానికి వీలు లేకుండగను, ఈయబడిన ధనం నిర్ణీత కార్యక్రమానికే ఖర్చు చేయబడునట్లు చూచుటకు, ధన సహాయాన్ని పొందిన సంస్థలు కోరిన పద్ధతులలో అభివృద్ధి చెందునటుల చూచుటకుగాను ప్రతి రాష్ట్రంలోను 'రాష్ట్రసలహా సంస్థ' లను నెలకొల్పుట అవసరమైనది.

కేంద్ర సంస్థయొక్క ఈ సూచనను ప్రథమంగా ఆంధ్ర ప్రభుత్వమే అంగీకరించింది. రాష్ట్ర సంస్థను దేశం మొత్తంమీద ప్రథమంగా ప్రకటించటమే కాకుండ సంస్థ

స్థాపనకు, రాష్ట్రంలో సంస్థ ఆధ్వర్యాన సంక్షేమ కార్యక్ర మాలను నిర్వర్తించుటకు, అవసరమైన ఆర్థిక సహాయం విషయమై నిశ్చయమైన సూచనను ఆంధ్ర ప్రభుత్వమే ప్రథమంగా చేసింది. ఇది మన మందరం గర్వించ వల సిన విషయం

మా మీద మీరు ఉంచిన నమ్మకానికి, ఈ గురుతర బాధ్యతగల స్థానాలకు మమ్ములను నియమించినందుకు రాష్ట్ర సలహా సంస్థ సభ్యులందరము మీకు కృతజ్ఞులము. ఈ రంగంలో మేము నిర్వహించవలసిన విధుల విష యంలో మేము పూర్తిగా మెళుకువతో ఉన్నామనీ, వాటిని నిర్వర్తించుటకు ఎంత శ్రమనైనా ఓర్చుటకు సంసిద్ధులమే ననీ మీకు హామీ ఇస్తున్నాము.

రాష్ట్ర సంఘ సంక్షేమ సలహాసంస్థ, ఇతర కార్యక్ర మాలతోబాటు, రెండు నిర్ణీత ప్రముఖ కార్యక్రమాలకు పూనుకుంటుంది.

1. వివిధ జిల్లాలలో సంక్షేమ విస్తరణ ప్రణాళికలను నిర్వహించుట.

2. కేంద్ర సంఘ సంక్షేమ సంస్థనుండి ఆర్థిక సహా యము కోరిన స్వచ్ఛంద సంస్థల దరఖాస్తులను పరిశీలించి, కేంద్ర సంస్థకు శిఫార్సు చేయుట, ఆర్థిక సహాయం పొందు సంస్థలను అప్పుడప్పుడు పరిశీలించి, ఆ సంస్థలు తమ కార్యక్రమమును విస్తృత పరుచుటకుగాను కార్య కర్తలకు అవసరమయే సలహానిస్తూ, ధనమును సరిగా వినియోగించునట్లు చేయుట.

ఐతే, ఇంతవరకు మేము ఏమిటి చెయ్యగలిగాము ?

జూలై నెలలో ఈ సంస్థ నెలకొల్పబడిననాటినుండి, సంక్షేమ విస్తరణ ప్రణాళికలను ఆంధ్రదేశంలోని ప్రతి జిల్లాలోనూ ఆగస్టు 15 వ తేదీన ప్రారంభించవలెనని మేము చాల తొందరపడ్డాము— ఆగస్టు 15 భారత స్వాతం త్ర్యదినము, కేంద్ర సంఘ సంక్షేమ సంస్థయొక్క మొదటి వార్షికోత్సవ దినముకూడ గనుక ఈ ఉత్సాహము, శ్రద్ధ.

గత సంవత్సరం కేంద్ర సంస్థనుండి సహాయం పొందిన సంస్థలలో ఇంచు మించు అన్నీ నగరాలలోను, పట్టణాలలోను, ఇతర నాగరిక ప్రాంతాలలోను నెలకొల్ప బడినవి మన జనాభాలో ముఖ్య భాగం గ్రామసీమలలో ఉన్నారు. ఈ సహాయ కార్యక్రమంవల్ల వారికి ఏవిధమైన ఉపయోగం జరగలేదు. అందువలన కేంద్రసంఘ సంక్షేమ సంస్థ సంక్షేమ కార్యక్రమం పల్లెలలోనికి బాగా వ్యాపించు టకుగాను, చిన్న చిన్న పల్లెలలోను, అభివృద్ధి చెందని బీద గ్రామములలోను ఈ సహాయం లభించుటకుగాను, సంక్షేమ విస్తరణ ప్రణాళికలను తలపెట్టింది. దేశం మొత్తంమీద 300 విస్తరణ ప్రణాళికలు స్థాపించుటకు ఉద్దేశింపబడింది. ఆంధ్ర దేశం 'ఎ' తరగతి రాష్ట్రం కావటంవల్ల, 17 ప్రణాళికలు కేటాయించబడినవి. ప్రతి జిల్లాకు మొదట ఒక్కొక్క ప్రణాళిక ఈయబడుతుంది. మిగిలిన ప్రణాళికలు "బహుమతి ప్రణాళికలు." అత్యంత అభివృద్ధి చూపించిన జిల్లాలకు ఇవి ఈయబడుతవి. ఆంధ్ర దేశంలో ప్రస్తుతం 12 ప్రణాళికలు మేము ప్రారంభిం చాము. ఆంధ్ర మహిళాసభ, మద్రాసులోని ఇతర ఆంధ్ర సంస్థలు ఈ విస్తరణ కార్యక్రమాలలో అత్యంతోత్సా హం చూపుటవల్ల మద్రాసు నగరానికి అత్యంత చేరు వలోనున్న సూళ్లూరుపేట తాలూకాలో వారి ఆధ్వర్యాన ఒక ప్రణాళిక నిర్వహించబడుతోంది.

ఆర్థికదృష్ట్యా, ఒక ప్రణాళికకు రెండు సంవత్సరా లకు రమారమి రు 50,000 లు అంచనావేయబడినదని మీకందరకు తెలుసును. ఈ వ్యయంలో, కేంద్ర సంస్థ 100 కి 50 వంతులు, రాష్ట్ర ప్రభుత్వం నూటికి 25 వంతులు భరిస్తుంది. మిగిలిన 25 వంతులు ఆయా ప్రాం తాలలో ప్రజలనుండి వసూలు చేయబడుతుంది. అది వారి పూచీగా భావింపబడుతుంది ఇదికాక, కేంద్ర సంస్థ ప్రతి ప్రణాళికకు తన పూర్తి ఖర్చుతో ప్రయాణ సౌకర్యానికి అవసరమయే కారును ఇవ్వగలదు.

20 లేక 30 గ్రామములు కలిగిన ఏక ప్రాంతంలో ఈ ప్రణాళికను అమలు జరుపవచ్చును. లేదా రెండు ప్రత్యేకమైన ఏక ప్రాంత భాగాలలోకూడ ఈ ప్రణాళికను నిర్వహింపవచ్చును ఈ ప్రాంతంలో 7 సంక్షేమ కేంద్రా లను ప్రారంభించి వేతనాలపై నియమింపబడిన కార్య కర్తలతో వాటిని నిర్వహిస్తారు. ఈ కేంద్రాలు, ప్రసూతి కేంద్రం, పిల్లల సంక్షేమ వైద్యశాల, వికలాంగులకు, అశక్తులకు, గృహపరిశ్రమల శిక్షణ కేంద్రం, శ్రామిక స్త్రీలయొక్క పిల్లలకై విశ్రాంతి గృహము, బాల్యనేర స్థుల సంస్కరణాలయం, మొదలైన రూపాలలో ఆయా ప్రాంతపు అవసరాల ప్రకారం ఏర్పాటుచేయబడుతవి.

కర్నూలు సమావేశం

ప్రతి ప్రణాళికను జిల్లా ప్రణాళికా నిర్వహణ సంఘం నిర్వహిస్తుంది. దీనిలో 11 గురు సభ్యులు ఉంటారు. వీరిలో 9 మంది అనధికార సభ్యులు. వీరిలో ఒకరు కన్వీనరుగా ఉంటారు. జిల్లా ప్లానింగు ఆఫీసరు, అసిస్టెంటు మహిళా ఆఫీసరు కూడా సభ్యులుగా ఉంటారు. జిల్లాలోని వివిధ సంఘసేవా సంస్థలలో ఉత్సాహంతో స్వచ్ఛంద సేవచేసేవారిని, సంస్థ నిర్వహణ విధానం తెలిసిన వారిని అనధికార సభ్యులుగా ఎంచుకుంటారు.



పశ్చిమగోదావరి జిల్లా రాయలం గ్రామంలో శ్రీమతి చెన్నఘంటమ్మగారు ప్రసూతి శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవం చేసిన దృశ్యం.

శ్రీకాకుళం :— శ్రీమతి పొన్నమ్మా కరియప్ప.
విశాఖపట్టణం :— ,, దిగుమర్తి జానకీబాయి.
తూర్పుగోదావరి:— శ్రీ ముత్తంగి అయ్యన్న.
పశ్చిమగోదావరి: – శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ.
కృష్ణా :— ,, అయేషా అబ్దుల్ దిర్.
గుంటూరు :— ,, కొండా పార్వతీదేవి.
నెల్లూరు :— డాక్టర్ ఎస్. లక్ష్మి.
చిత్తూరు :— శ్రీమతి రత్నాబాయి శ్రీనివాసరావు.
అనంతపురం :— ,, వెంకటస్వామినాయుడు.
కడప :— ,, నరసారెడ్డి.
కర్నూలు :— ,, బి. నటరాజన్.

ఇతర సభ్యులందరు సమాన ప్రతిభ గలవారే.

ఆగస్టు 15 వ తేదీకి పూర్వమే రాష్ట్రసంస్థ సభ్యులు పదకొండు తెలుగు జిల్లాలలోను పరిశీలనలు సాగించారు. జిల్లా సంస్థలు కేంద్రములు నిర్ణయించుటకు సహాయం చేశారు. ఆయా జిల్లాలలోని కలెక్టర్లు సంపూర్ణ సహకారాన్ని అందజేశారు. అందువలన ఆ దినమున అనుకున్న ప్రణాళికలన్నీ ప్రారంభింపగలిగాము.

<u>శ్రీకాకుళం జిల్లా</u>

అంపోలు — మాతాశిశు సంరక్షణ కేంద్రం.
పాత్రునివలస ..

<u>విశాఖజిల్లా</u>

జాలచెరువు - మాతా శిశు సంరక్షణ కేంద్రం.

<u>తూర్పుగోదావరి జిల్లా</u>

1. రాజానగరం (అశక్తులకు, వికలాంగులకు పనికేంద్రం.)
2. బూరుగుపూడి- మాతాశిశు సంరక్షణ కేంద్రం.

<u>పశ్చిమగోదావరి జిల్లా</u>

1. తాళ్ళకూరు - కొవ్వూరు ప్రసూతి కేంద్రం.
2. రాయలం- ..

<u>కృష్ణాజిల్లా</u>

నున్న - ప్రసూతి కేంద్రం
పోరంకి - ..
పెనములూరు- ..

<u>గుంటూరు జిల్లా</u>

మోర్జంపాడు — ప్రసూతి కేంద్రం
తొండపి — ..

<u>నెల్లూరు జిల్లా</u>

సంగం ప్రసూతి కేంద్రం
కోనిమెర్ల ..
మర్రిపాడు ..
సిద్ధిరెడ్డిపాలెం శిశు సంక్షేమ కేంద్రం

<u>చిత్తూరు జిల్లా</u>

నాంపల్లి ప్రసూతి కేంద్రం.

యాదమర్రి - ప్రసూతి కేంద్రం, పిల్లల విశ్రాంతి కేంద్రం.

కావేరి రాజపురం - పిల్లల విశ్రాంతి కేంద్రం, లైబ్రరీ. స్త్రీల పని కేంద్రం.

<u>కడప జిల్లా</u>

వల్లూరు — ప్రసూతి కేంద్రం.

కొప్పర్తి ,,

కర్నూలు జిలా

బ్రాహ్మణ కొట్టూరు — ప్రసూతి కేంద్రం.

పర్ల — ,,

<u>అనంతపురం జిల్లా</u>

మారూరు — ప్రసూతి కేంద్రం, పిల్లల విశ్రాంతి కేంద్రం.

గుగుడు — ,,

<u>ఆంధ్ర మహిళాసభ</u>

మాంబట్టు :— ప్రసూతి. పిల్లల విశ్రాంతి కేంద్రం,

చేనిగుంట — ,,

జిల్లా నిర్వహణ సంఘములు చూపిస్తున్న ఉత్సాహం అపరిమితం. ఏ విధమైన బాటలూ లేని గ్రామ ప్రాంతాలలో వీరు సంచరించారు. అరణ్యాలను అధిగమించారు. ఏవిధమైన మార్గాలూ లేని ప్రదేశాలలో మైళ్ళకొద్దీ సంచరించారు. ఈ విధంగా స్వచ్ఛమైన మిషనరీలవలె వీరు సంక్షేమ జ్యోతిని దేవుడు మారని ప్రదేశాలలోనికి కూడ తీసుకుపోతున్నారు.

ఇక గ్రామీణుల ఉత్సాహం, ఈ కార్యక్రమాలపట్ల చూపిస్తున్న ఆసక్తి అత్యద్భుతం, అనూహ్యం అని చెప్పాలి. ఆంధ్ర గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలు, ప్రసూతి కేంద్రాలు ముఖ్యావసరాలు. మన ప్రాంతాలలో స్త్రీలు ఈ కేంద్రాలు లేక చాలా అవస్థ పడవలసి వస్తున్నది. ప్రతి చోట ప్రసూతి కేంద్రం కోసమై ప్రజలు కలవరిస్తున్నారు. అనాథ శరణాలయాలు, పిల్లల విశ్రాంతి శాలలు, అనాథ గృహాలు మున్నగునవి కూడ అత్యధికముగా ఏర్పాటు కావలెనన్నమాట నిజమేకాని, ప్రసూతి కేంద్రాల ఆవశ్యకత అత్యధికం. ఇంచుమించు అన్ని జిల్లాప్రణాళికల లోను ప్రసూతి కేంద్రములు నెలకొల్పబడినవి.

ఇక మా రెండవ కర్తవ్యం విషయం. ప్రణాళికా ప్రారంభోత్సవాలు జరిగిన తర్వాత, ఈ మధ్యనే దేశంలోని స్వచ్ఛంద సంస్థలను పరిశీలించుట ప్రారంభించాము. కొంతమంది మా సంస్థ సభ్యులు, నేను ఇంత వరకు ఇంచుమించు 35 సంస్థలు పరిశీలించాము. ఇందులో 75 వంతులు కేంద్ర సంస్థనుండి సహాయం పొందినవే. మిగిలినవి క్రొత్తగా ధన సహాయాన్ని అర్థించిన సంస్థలు. ఈ సమావేశంలో 40 సంస్థలనుండి సహాయంకోరుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించుటకు నిశ్చయించాము.

ఆంధ్ర దేశంలో నేను ఈ మూడు నెలలు పర్యటించి గ్రహించిన విశేషం ఏమిటంటే, స్వచ్ఛందసేవ అన్నది ఆంధ్ర ప్రజల రక్తంలోనే ఒదిగివున్నది. భారత దేశంలోని మరే ప్రాంతంలోను అనాథ శరణాలయాలు, వితంతు శరణాలయాలు మొదలైనవి తలపెట్టని క్రితమే ఆంధ్ర దేశంలో ఇటువంటి సంక్షేమ కేంద్రాలు ఎంతో దిగ్విజయంగా, బహుజన ఉపయుక్తంగా నిర్వహింపబడుతున్నవి. స్త్రీ విద్య, స్త్రీ స్వాతంత్ర్యము, అస్పృశ్యతా నివారణ మొదలైనవన్నీ ఆంధ్ర దేశంలో ఎన్నాళ్ళనుంచో వేళ్ళు పాతుకున్నవి.

అనేక కారణములవలన గడచిన కొద్ది సంవత్సరాలలో ఆంధ్ర దేశంలో అంతపురోగతి కనుపించకపోయినా, మనం మన ఆశయాలలోని నిజాయితీని, మన కార్యక్రమాలలో ఆసక్తిని ప్రజలకు చూపించి సహృదయం కలుగునట్లు చేసి, ప్రజలలో నిద్రాణమై ఉన్న వితరణ, స్వచ్ఛందసేవా గుణాలను తిరిగి పెంపొందింపవచ్చును. ఈ మహత్తర ఆశయాన్ని సాధించుటకుగాను రాష్ట్రసంక్షేమ సంస్థ మీ సహకారాన్ని, ఆశీర్వచనలను కోరుతున్నాము. ప్రజల సహకారాన్ని సమీకరించి, నిర్మాణయుక్తమైన కార్యక్రమాలపై ప్రజల దృష్టి మరల్చి, ఈ విధంగా ప్రజల గృహములలో సంక్షేమం వ్యాపింపచెయ్యవలెనని ఆశిస్తున్నాము.

"గాంధీజీ సూచించిన నిర్మాణ కార్యక్రమమే సంఘ సంక్షేమానికి ప్రాతిపదిక"

ప్రధానమంత్రి శ్రీ ప్రకాశం పంతులుగారి ప్రారంభోపన్యాస భాగములు.

సంఘ సంక్షేమ సంస్థ కార్యక్రమం, చిరకాలం క్రితమే గాంధీజీ ఊహించిన నిర్మాణ కార్యక్రమానికి అనుగుణంగా ఉన్నది. మహాత్మా గాంధీ ఆశయాలకు, నిర్మాణ కార్యక్రమానికి ప్రజానీకం తగిన ప్రాముఖ్యతను ఇస్తున్నందుకు నేను చాలా ఆనందిస్తున్నాను పాశ్చాత్య దేశాలు కూడ గాంధీజీ నిర్మాణ సూత్రాలను వివిధములైన పేర్లతో అనుసరిస్తున్నారు మన దేశ ప్రజలు కూడ ఆ సూత్రాలనే మన దేశ ప్రజల ఆచరణ నిమిత్తం వేర్వేరు పేర్లలో అనుసరిస్తున్నారు రాష్ట్ర సంక్షేమ సంస్థ చేస్తున్న ఉత్కృష్ట సేవకు నేను ఆనందిస్తున్నాను

డాక్టర్ సీటరాజన్‌తో కలిసి ఆంధ్ర దేశం పర్యటించి సంఘ సంక్షేమం నిమిత్తమై మన ప్రాంతాలలో జరుగుతున్న కృషిని నేను స్వయంగా దర్శించాను కర్నూలు జిల్లా బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో ఒక ప్రణాళికకు ప్రారంభోత్సవం చేశాను కాని అప్పుడు శరీరంలో అస్వస్థతగా ఉండుటవల్ల దాని విషయమై అంత శ్రద్ధ పట్టించుకోలేకపోయాను. ఈ సంఘ సంక్షేమ కార్యక్రమములు అంటే నాకు అమితమైన ప్రీతి. నా చిన్నతనంలో ఇటువంటి కార్యక్రమాలలోనే పాల్గొనే వాడిని. గాంధీజీ నాయకత్వం క్రింద ఇటువంటి కార్యక్రమాలనే నేను. నా మిత్రులు అమలు జరిపేవాళ్ళం. అందువలన ఈ సంస్థ సమావేశ ప్రారంభోత్సవం చెయ్యటానికి నేను చాలా ఆనందిస్తున్నాను.

ఈ కార్యక్రమ నిర్వహణకు ఆంధ్ర దేశంలో శ్రీమతి ఎ. సి. కృష్ణారావు, శ్రీమతి జమునాబాయి తగిన వారని ఆంధ్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీరిద్దరు ఈ కార్యరంగంలో అనుభవశాలురు. ఆంధ్ర మహిళాసభతో చిరకాలం సన్నిహిత సంబంధం కలిగి ఉండటమే కాకుండా అనేకమైన ఇతర సంస్థలలో పనిచేసిన కార్యశూరులు. మేము వారికి నిర్ణయించిన కార్యక్రమమును జయప్రదముగా నిర్వహించగలుగుతారనే మా విశ్వాసానికి ఏమి సందేహం లేదు.

కొంతకాలం క్రితం శ్రీ జవహర్‌లాల్ నెహ్రూకి లేఖ వ్రాస్తూ, గాంధీజీని అందరు ప్రజలు మరచిపోయారని వ్రాశాను. ఐతే గాంధీజీ సూత్రాలను వివిధములైన పేర్ల క్రింద ఈ నూతన పరిస్థితులకు అనుగుణంగా ఆచరణలో పెడుతున్నందుకు నెహ్రూను అభినందించాను. గాంధీజీకి మరణం లేనేలేదు. ఆ వ్యక్తి చనిపోవటానికి జన్మించిన వ్యక్తి కాదు ఆయన జీవితమంతా ప్రపంచ సౌభాగ్యం కోసమే ధారపోశారు

నిర్మాణ కార్యక్రమంలో స్త్రీలు నిర్వహించవలసిన పాత్ర అత్యంత ప్రశంసనీయమైనది ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యవలెనంటే స్త్రీలే పూనుకోవాలి. వివిధ గ్రామాలలో ఉంటూ ఈ ఉద్యమంలో పనిచేస్తున్న స్త్రీలందరూ వారి సేవా కార్యక్రమాలను నాకు తెలియ జేస్తారని ఆశిస్తాను సత్ ప్రారంభం జరిగింది కొలది సంవత్సరాలలో, అంతా సవ్యంగా వెళ్ళిపోతే ఆంధ్ర రాష్ట్రం సమస్త ఐశ్వర్యాలతోను తులతూగుతుంది.

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అన్ని తరగతుల ప్రజలను సమీకరించి, ఈ విధమైన కార్యక్రమములను అనేకం జయప్రదంగా నిర్వహించిన "దేశ సేవకురాలు". ఇటువంటి కష్టతమమైన కార్యక్రమ సత్వర నిర్వహణకు నెహ్రూ శ్రీమతి దుర్గాబాయి మీదను, ఆమె సహచరుల మీదను ఈ భారం ఉంచారు. గ్రామ సీమల్లో జరుగవలసిన ఈ కార్యక్రమానికి స్త్రీలే సమర్థులు ఈ ఉద్యమాన్ని ఒక క్రమ పద్ధతిలో నిర్వహించలేనిచో విజయం సాధించలేము. జాతీయ ప్రణాళికా ఋణం విషయంలో ఆంధ్ర దేశం ముందు చాలా వెనుకబడి వుండేది. ఒక క్రమ పద్ధతి ప్రకారం ఆ కార్యక్రమానికి పూనుకునేసరికి 5 కోట్ల రూపాయలను ఆంధ్ర ప్రభుత్వం వసూలు చెయ్యగలిగింది.

ఈ కమ్యూనిస్టు "కుత్రవాళ్ళు" వాళ్ళ నాయకులు వ్రాసినది. చెప్పినది అర్థం చేసుకోలేకపోయినట్లే, గాంధీజీ సూత్రాలను, ఆచరణ విధానాలను ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు. గాంధీజీ తత్వాన్ని ప్రజలు బాగా అర్థం చేసుకోవటం చాలా అవసరం. ఆయన ఆదర్శాలను అవగాహన చేసుకుని, ఆయన నిర్ణయించు కార్యక్రమాలను సరిగా అమలు జరిపి. నిర్మాణ సూత్రాలను ఉత్సాహంతోను, పట్టుదలతోను, క్రమపద్ధతితోను అనుసరించవలసిన అవసరం, బాధ్యత మన అందరిపైనా ఉన్నది.

తేనెటీగల్ని పెంచడం

తేనె:— ఆది కాలంనుండీ తేనె ఔషధప్రాయమైన అమూల్య పదార్థంగా పరిగణింప బడుతూవుంది. క్రతువుల్లో కూడ ఉపయోగింప బడుతూవుండేది. ప్రశస్తమైన తేనెకు ఎంతైనా గిరాకీ వుంది. ఐతే, బజారులో కొన్న తేనె, బెల్లం పాకం వగైరాలు కలిసిందేగాక తేనెతో పాటు తేనెపట్టునుండి దారుణంగా పిండిన తేనెటీగల పిల్లలసారం కూడా కలిసిందై ఉంటుంది!

ఆర్థిక మాంద్యం ఏర్పడ్డ ఈ రోజుల్లో మధ్య తరగతి కుటుంబాలు తమ తీరిక కాలంలో తేనెటీగ పెంపకాన్ని అవలంబిస్తే తమకూ ప్రజలకూ కూడ ఎంతో లాభం.

అదీగాక మన మతం జీవహింసను, పాపాన్నీ సహించదు. మామూలు పద్ధతిలో, తేనె పట్టు పిండి, తేనెటీగల పిల్లల్ని అసంఖ్యాకంగా చంపడం జరుగుతుంది. అందుచేత చాలమంది తేనె త్రాగడానికి సందేహిస్తారు — పాపమనీ— యీగపిల్లల్ని పిండిన సారాన్ని త్రాగాలనీను! ఆధునికంగా శాస్త్రీయమైన పద్ధతిలో యీ యిబ్బందులేమీ ఉండవు.

తేనెటీగ:— తేనెటీగలలో మూడు జాతులు చూచే వుంటారు. మన్యం పట్టు— దీని జోలికి వెళ్ళకండి. చిన్న తేనెటీగలు కొన్ని చూచే వుంటారు. ఇవీ మనకు లాభంలేదు. మామూలుగా చెట్టు తొర్రల్లోను, పుట్టల్లోనూ పట్లు పెట్టేజాతి (ఏపిస్-ఇండికా అంటారు) ఇవే మనకు మచ్చిక అయ్యేవి. ఇవి ఒకదాని ప్రక్క నొకటి వేలాడేటట్లుగా పట్లు కడతాయి. వీటికి మనం యిచ్చే తేనెపట్టు పెట్టెల్లో సహజరీతిని యివి సులభంగా పెంచవచ్చు.

ప్రకృతిలో అనేక పుష్పాలున్నాయి ; కొన్ని మకరందాన్ని హెచ్చుగానూ, కొన్ని పుప్పొడిని హెచ్చుగాను యిస్తాయి. తేనెటీగలకు యివి ఎక్కడ లభ్యమయ్యేదీ ఎరుకే. మనం ఇందుకని అంతగా ప్రయాస పడనక్కరలేదు. తేనెటీగలుకూడా తమ తేనెను తాము తెచ్చుకొని తమ పొట్ట తాము పోసుకోవడమేగాకుండా విస్తారంగా మనకు తేనెను కూడదెడతాయి కాదంటే పూర్ణంతగా లభించని మండు వేసంగిలోను, తేనె తక్కువయ్యే వర్షాకాలం ఎద్దడి రోజుల్లోనూ యింత బెల్లం పాకమో, పంచదార పాకమో, సాయంత్రపు వేళ ఇస్తేచాలు

తేనెటీగల పెట్టె :— మన దేశంలో విస్తారంగా న్యూటన్ తేనెపట్ల పెట్టె అని ఏటవాలైన కప్పుతో చిన్న టేకు పెట్టె చూచేవుంటారు. 6-8 రూపాయలకు ఏ వ్యవసాయ డిమాన్‌స్ట్రేటరుదగ్గరైనా లభిస్తుంది. దాంట్లో పట్లు ప్రక్క ప్రక్కగా ఉండటానికి ఏడేసి కర్ర చట్రాలతో రెండు అంతస్తులుంటాయి. క్రింది అంతస్తు పిల్లల్ని పెంచడానికీ, పై అంతస్తు తేనె నిలువచేయడానికీను ;

తేనెపట్టు పట్టుకోవడం :— తేనెటీగలు గుంపులు గుంపుల్లాగ వసంతఋతువు లగాయతు- వర్షఋతువు వరకు బయలుదేరుతుంటాయి. మొట్ట మొదటిగా తేనె పెట్లు పెట్టేవారు— పుట్టల్లోను, తొర్రల్లోను ఉండే పట్టు అట్టల్ని— తేనెటీగల్ని సంపాదించే విధానం వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగితే చెపుతారు- అన్ని విషయాల్లోను తగు సహాయంచేసి తగినంత సలహా ఉచితంగాయిస్తారు. తేనెటీగల పెట్టెలో చట్రానికి తేనెతెట్టు కట్టి దానిమీద తేనెటీగల గుంపు ప్రవేశింపజేయాలి. వాటిల్లో ఒక రాణి ఈగ ఉంటుంది. అది ఉండేటట్లు చూచుకుంటే దాని వెంటనే తతిమా ఈగలన్నీ ఉంటాయి. తేనెటీగల గుంపు నెక్కించిన పెట్టెను- ఒక సురక్షిత స్థానంలో సమతలంలో- అంతగా ఎండా వానా, హోరుగాలీ తగలకుండా ఉండే చోట పెట్టాలి. పెట్టె ముఖం, సూర్యరస్మి దాంట్లో ప్రవేశించేటట్లు ఉంచగలిగితే, చాలమంచిది.


తేనెపట్టుపెట్టె మూతతీసి ఒక ప్రక్కనుపెట్టి, చట్రాలు మెల్లగాఎత్తి అప్పుడప్పుడు కొన్నిరోజులకొకసారి చూస్తుండడం మంచిది. భయపడనక్కరలేదు. తేనెటీగల్ని ఏమీ చేయకుండా ఉంటే అవి మనల్ని ఏమీ చెయ్యవు. మీద వాలినా చేత్తో కొట్టరాదు. చాల మచ్చికగా ప్రవర్తిస్తాయి నెమ్మదిగా చూస్తుంటేను. ఒకవేళ్లేదైనా కుట్టినా, కంగారు పడక, తేనెటీగ ముల్లుతోకూడా తీసేసి, ఒక పచ్చఆకుతో కుట్టినచోట రుద్దడం మంచిది. లేకుంటే ఆవిషం వాసనకు మిగతా ఈగలు రెచ్చిపోయి అల్లరి పర్చవచ్చు. తేనెటీగల కుట్టు కీళ్ళవాతాన్నీ, పక్షవాతాన్నీ కుదురుస్తుందంటారు.


పట్లు చిన్నవైనా, రాణీ లేకపోయినా- రెండు పెట్టెల్లోని పట్లను కలిపే మార్గం :—

పిల్లల్ని పెట్టే క్రింది అంతస్తుమీద ఒక చిల్లులు పొడిచిన కాగితం కప్పండి. దానిమీద రెండో పెట్టె రాలూక

తేనెటీగల్ని పెంచడం

తేనెటీగలను పెంచే పెట్టె





భూమిలో పాతిన కర్ర. **A.** పట్టుకు చీమలు వెళ్ళకుండా నీటిగళ్ళాయి ఏర్పాటు.

1. పైకప్పు
2. తేనెకూడ బెట్టే అంతస్తు
3. పిల్లలుండే క్రింది అంతస్తు
4. అడుగు చెక్క
5. ఈగలులోనికి వెళ్ళేమార్గం
6. తేనె తెట్టులుకట్టే చట్రాలు
7. పనిచేసే తేనెటీగ
8. రాణి ఈగ
9. మగఈగ (రెట్టింపు సైజులో)
10. తేనెతీసే చేతియంత్రం
11. తేనె సీసా
12. యంత్రంలోని ఏర్పాట్లు

అంతస్తు ఉంచండి. కాగితం కన్నాలు పెద్దవిగా చింపుకుని పట్టూ పట్టూ కలిసి పోతాయి. లేదా పైనుంచి తెచ్చిన చట్రానికి అటూ ఇటూ చించిన కాగితాలు పెట్టి రాత్రుళ్ళు పెట్టెలో ఉంచేస్తే— ఆ యీగలూ ఈ ఈగలూ కలుస్తాయి. రాత్రుళ్ళు తేనెటీగలు బయటికిపోవు. అందుచేత వాటి శరీర వాసనలు కలిసిపోయి ఐక్యమై పోతాయి. లేకుంటే ఒక పట్టు యీగలు మరోపట్టు ఈగలతో ఒక పట్టాన కలుపవు.

కొత్తరాణీని పెట్టడం :— మంచి పిల్లలూ గ్రుడ్లూ వగైరాలున్న ఒక తేనెపట్టు తెట్టెను (తేనెటీగలు లేకుండా చూసి) రాణి లేని పెట్టెలో పెడితే. ఆపిల్లల్లో ఒకటి రాణీ యీగ అయ్యేటట్లు అవే పెంచుకుంటాయి. లేదా పెద్దదిగా కట్టిన రాణీ గదులుండే భాగాన్ని మరొక తెట్టె నుంచి తెచ్చి ఆపెట్టె తెట్టెకు పిన్నువేసి గుచ్చినా అవే కలుపుకుంటాయి ఒక్కొక్కసారి క్రొత్త రాణీని చిన్న పంజరంలో పెట్టి అలాంటి పట్టులో ప్రవేశ పెట్టొచ్చు.

తేనెటీగ పెట్టెల్ని స్థానం. మార్చడం :-- పెట్టెను స్థానంలో నుంచి మార్చరాదు. తప్పనిసరియైతే రాత్రుళ్ళు రోజుకు 1, 2 అడుగుల చొప్పున మారుస్తూ క్రొత్తస్థానానికి క్రమంగా తీసుకెళ్ళాలి. పెట్టె దూర ప్రాంతానికి పట్టుకెళ్ళాలి అంటే రాత్రి, ద్వారం మూసివేయాలి. క్రొత్త ప్రాంతంలో పెట్టేక అడ్డు తీసివేయాలి. ఈగలు మళ్ళీ చుట్టుప్రక్కలన్నీ గుర్తులు పెట్టుకుంటేగాని పని ప్రారంభించవు.

తేనె తీయడం :—పై అంతస్తులో గల తేనెతెట్లలో గళ్ళు మూడు వంతులు

మూసివేయబడ్డాక, మనం తేనె తీసుకోవచ్చు. మెల్లగా తేనెటీగలు లేకుండా ఊది తెట్టువేరు చెయ్యవచ్చు. ఆ చట్రాన్ని తేనె తీసే యంత్రంలో పెట్టి గిర గిరా త్రిప్పితే తేనె బయటికి వచ్చేస్తుంది. అసలైన పట్టుతేనె ఇది. మళ్ళీ కాళీ తెట్టెను పెట్టెలో పెట్టేయాలి.

తేనెటీగల శత్రువులు :— మైనం పురుగు, చీమలు, కందిరీగలు, తొండలు, ఏడ్రింక, మరో చిన్న పచ్చటి పిట్ట తేనెటీగల శత్రువులు. మైనంపురుగు పట్లు తినేస్తుంది. తరుచు పెట్టెలోని తెట్లు పరీక్షిస్తుండాలి.

ఇదంతా కొత్తవల్ల సరిగా అర్థంకానివారు కొంచం శ్రద్ధ వహించి తేనెపట్లు ఇదివరలో పెట్టిన వారిదగ్గర గాని, వ్యవసాయశాఖ మేస్త్రీల సలహావల్లగాని కొద్ది రోజులు అలవాటు పడ్డారంటే— తేనెటీగల పెంపకం చాల సరదాగా ఉంటుంది. చాల లాభకరం. ఏడాదిలో పట్టు ఒక్కంటికి 10-15 రూపాయిలవరకు నికరాదాయం లభిస్తుంది. సరదా తీసుకొని దీన్ని కుటీర పరిశ్రమగా అవలంబించండి.

—సోషల్ వెల్ఫేర్ పత్రికలో స్వామి పరబ్రహ్మానంద్.

ఆంధ్ర మహిళాసభ సంక్షేమ ప్రాజెక్టు కృషి :—

ఆంధ్ర మహిళాసభ సంక్షేమప్రాజెక్టు క్రింద మాంబట్టు గ్రామంలో మాతాశిశు సంరక్షణాలయంకు ఆగష్టు 15 వ. తేదీని ప్రారంభోత్సవము జరిగినది. అక్కడ ఒక మంత్రసానిని సెప్టెంబరు 15 వ. తేదీని నియమించాము. ఆమె 8 కాన్పులు చేసినది. అన్నియు సుఖముగా జరిగి మాతాశిశువులు సురక్షితముగా వున్నారు. కొందరికి ఉదయము మందులు కూడా ఇచ్చుచున్నది. వారమునకు 4 రోజులు చుట్టుపట్ల గ్రామాలకు వెళ్ళి ఆ గ్రామాలలోని స్త్రీల యొక్కయు, పిల్లల యొక్కయు, క్షేమ సమాచారములను విచారించు చున్నది.

అక్టోబరు 2 వ. తేదీని చేనిగుంట గ్రామములో నెల్లూరు కలెక్టరుగారి సతీమణియైన మిసెస్. మాదప్ప గారు మాతాశిశు సంరక్షణాలయమునకు ప్రారంభోత్సవము జరిపిరి. శ్రీ మాదప్పగారు అధ్యక్షత వహించిరి. శ్రీ వేణు గోపాలరెడ్డిగారు పతాకావిష్కరణ చేసిరి. కన్వీనరు శ్రీ టి. జి. హైమవతి, గూడూరు సబ్ కలెక్టరు రాజారావు గారు, గూడూరు సివిల్ అసిస్టెంటు సర్జన్ రామచంద్ర రావుగారుమాట్లాడిరి. ఆంధ్ర మహిళాసభ నర్సింగ్ హోమ్ పిల్లలు బుర్రకధను చెప్పారు. చేనిగుంటపిల్లలు కోలాటం వేసిరి. చేనిగుంట గ్రామస్తులు తేనీటివిందు ఏర్పాటుచేసిరి. జనగణమనతో కార్యక్రమము ముగిసినది

చేనిగుంట సెంటరు ప్రారంభోత్సవ సమయములో శ్రీమతి ఇందిరాగాంధీగారు పంపిన సుభాకాంక్షలు :—

"మాంబట్టులో ప్రారంభించిన ప్రసూతి కేంద్రానికి అక్కడి ప్రజలు చాల సహకరిస్తున్నారని వినడానికి చాల ఉత్సాహంగాఉంది. ఇది మీకు చాల ప్రోత్సాహకరమైన అనుభవంగా వుండి వుంటుందని తలుస్తాను.

—మీరు మాంబట్టుకు 10 మైళ్ళదూరంలో మరో ప్రసూతి శిశుపోషణ కేంద్రాన్ని తెరవబోతున్నారని వినడానికి చాల సంతోషం. అవూరు ప్రజలుకూడ సహకరించి కేంద్రానికి కావలసిన గృహాన్ని, ఆ కేంద్రఖర్చుల నిమిత్తం అవూరు పంచాయితీ బోర్డువారు రూ. 500 యిస్తున్నందుకు చాల ఆనందం.

ఈ కేంద్రాన్ని అక్టోబరు 2 వ. తేదీని గాంధీజయంతి నాడు స్థాపించడం చాల సమంజసంగా వుంది. స్త్రీజన సంక్షేమం, శిశుసంరక్షణ - ఇట్టి సేవా కార్యక్రమమందు బాపూజీకి ఉన్న శ్రద్ధ జగద్విదితము. మీ కేంద్రం జయప్రదంగా సాగాలని నేను కోరుతున్నాను. ఈ నూతన కేంద్రంద్వారా సౌకర్యాలు పొందగలిగే తల్లులకు నా అభివందనాలు. పిల్లలకు ఆశీస్సులు —"

ఇందిరాగాంధి.

ఆజ్రా ఆపా

• సోమీంద్ర •

జంగిడతో కూరగాయలు ముందుంచుకొని, వరండాలో ఒకమూల మంచంమీద కూర్చునివుంది ఆమె. అది మా ప్రథమ సమాగమం. కలుసుకొన్న అరగంటలోనే మేం పరిచితులమయిపోయాం. ఆమే ఆజ్రా ఆపా మా పొరుగింటి మౌల్వీసాహిబ్ భార్య. పద్య పార పఠనం కోసం మౌల్వీ దగ్గరకి వెళ్ళుతుండే వాడిని. అసలే తీరిక లేని మనిషి కావడంవల్ల మౌల్వీసాహిబ్ నన్ను ఆయన భార్య దగ్గరకి పంపేవాడు — 'పాఠాలు చెప్పుకొందుకు. భర్తని పాండిత్యంలో ఏమాత్రం తీసిపోలేదు — ఆజ్రా ఆపా. సాధారణమైన కుటుంబంలో పుట్టిపెరిగిన ఆజ్రా ఆపా, అతిఛాందసులైన వారికుటుంబంలో అడుగిడింది. పరదా అతిగా అమల్లో వుండేది వారి యింట్లో. ఎప్పుడో కాని ఆమె బైట కనిపించేదీకాదు ఎంతో వినముచ్చటగా మాట్లాడేది. ఆమెకు తెలియని విషయాలు లేవు. ఆ సనాతనాచార పారాయణుల యింట్లో యింతటి ఉదాత్తమైన ఆత్మ ఒకటి ఉందంటే. నమ్మకంకూడా కల్గేదుకాదు. ఇల్లు కదిలి అవతలకి రాకపోయినా, ఆమె స్వేఛ్ఛాజీవే. సద్గుణ సంపన్న. విశాల భావాన్విత. తరువాత తరువాత తెలుసుకున్నాను : ఆమెను చూడవచ్చేది నేనొక్కడినే కాదని : అన్నిరకాలవారూ, ఆమె సహాయసలహాలు పొందడానికి వచ్చేవారు. వంటింటి సమస్యలు మొదలుకొని, షెల్లీ ఘాలిబ్‌ల కవిత్వంవరకూ అన్ని విషయాలని గురించీ మాట్లాడ కలిగిన ఆమె చాతుర్యానికి ఆశ్చర్యమే వేసేది. ఆమె స్నేహిత బృందంలో నాలాంటి చిన్నవాళ్ళు మొదలు ఆ పరిసరాల వయసుమళ్ళినవారందరూ ఉండేవారు.

ఆమె దేనినీ కాదనేదికాదు. ఆమె సాంఘిక సేవ అంతా, చేతనయినంతవరకు పేదవారికి అన్ని రీతులా సహాయపడడమే. తన ఉరుదూ అక్షరాల పుస్తకంతో తోటీ వాడి కూతురు వచ్చేది. వంటయింటి సమస్యల పరిష్కరణకై గొప్పయింటి నాగరిక యువతివచ్చేది. అర్థంలేని, సద్దుకుపోని అత్తగార్ని నేర్పుతో నెలా సరిదిద్దుకోవాలో నేర్చుకొందుకు చాకలి భార్యవచ్చేది. ఆజ్రా ఆపా తన స్నేహితులతో, ఏవిషయాలని గురించేనా మాట్లాడకలదు ; వేదాంతమైనా సరే, పట్టణ పరిసరాల రాజకీయాలైనాసరే, ఆమె కూర్చునే వరండా ఉదయం నుంచి సాయంత్రంవరకూ, వచ్చిపోయేవారి హడావిడితో ఒక సంస్థలా వుండేది.

మౌల్వీసాహిబ్, చెల్లెలినికూడా, తమలాంటి సనాతన కుటుంబంలోకి యిచ్చి వివాహం జరిపించాలని ప్రయత్నాలు చేశారు. పరదా జీవితం, బందికాన జీవితం నుండి తన ఆడబిడ్డని రక్షించాలని ఆపా కోరిక. తల్లిలేని యీ అమ్మాయి చిన్నతినంనుండీ ఆపా దగ్గరే పెరిగింది. కాని ఆమెకి వివాహం చేయడానికి మేనమామలు పల్లెటూరు తీసుకువెళ్ళారు. చూస్తూ వూరుకోలేకపోయింది ఆపా. ధైర్యం తెచ్చుకుని పల్లెటూరు వెళ్ళింది. కాని అక్కడివారు ఆమె మాటలు లక్ష్య పెట్టే స్థితిలోలేరు. ఆపా బతిమాలినా లాభం లేకపోయింది. కాని ఆమె ధైర్యం మాత్రం విడనాడలేదు. ఆ యింటితోటీ పనివారితో కలిసి గూడుపుఠాణీ చేసింది. ఫలితంగా, ఒకరోజు, తెలతెలవారుతూండగా ఇద్దరు బురఖాస్త్రీలు దగ్గిరవున్న రైలు స్టేషనుకి త్వరగా నడిచారు.

సంవత్సరాలు గడిచిపోయాయి నా చదువూ అయిపోయింది. గందరగోళాలు బయలుదేరి, ముస్లిములు కానివారు పశ్చిమ పంజాబు విడువవలసిన అవసరం ఏర్పడింది. ఆపా గృహం యిరుతెగలవారికీ తలదాచుకొనే ఆస్కారం అయింది. ఆమె అతిజాగ్రత్తగా, తన హిందూ, సిక్కు స్నేహితులు, సురక్షిత ప్రదేశాలు చేరే ప్రయత్నాలు చేయడంలో నిమగ్నమయిపోయింది.

కొన్ని సంవత్సరాల తరువాత, నా స్వంత వూరువెళ్ళే అవకాశం కల్గింది. ఆమెని కలుసుకున్నాను. పూర్వంలాగే జీవించాలని ఎక్కువ తాపత్రయపడుతోంది. కాని, ఆమె ఆరోగ్యం అందుకు అడ్డునిల్చింది. దానికితోడు ఆమె అప్పులలో మునిగివుంది. కాందిశీకులుగ వస్తున్న స్నేహితులకి ఆర్థికంగా సహాయాలు చేస్తూ వచ్చేసరికి ఆమె ఆర్థిక స్తోమత కుంగతీసుకుపోయింది. కుటుంబంతో పోరిపోరి చివరకి, తన ఆడబిడ్డకి ఆమె యిష్టం వచ్చినట్లు వివాహం జరిపించింది. ఆ పెళ్ళి ఖర్చు అంతా ఆమె భరించవలసివచ్చింది. కారణం ఆ పెళ్ళికి కారకురాలు ఆమె అవడం. అదేమంచంలో అనారోగ్యంతో అసహాయురాలిగా పడుకొనివుంది ఆపా. ఆరోగ్యం సరి

చేసుకుందుకి డబ్బు లేదు. భవిష్యత్తు, ఆశాజనకంగానూ లేదు. మృత్యుముఖానవున్న ఆమెను, ఆమె అప్పులవాళ్ళు వెంటాడుతూనే వున్నారు.

యిప్పుడో, అౢజా అపా చనిపోయిందని విన్నాను. నా స్మృతిపథాన పాతకాలపుటూహాలుకదిలితే, అౢజా అపా నిండైన కంఠస్వరం నాచెవులలో మారు౹మోగుతుంది. ఆ మాతృహృదయపు అభిమానమూ, ఆదరణా జ్ఞప్తికివచ్చి నా హృదయం ౹పశాంతమవుతుంది. అపా మృతితో, ఒక స్నేహితుని, ఒక గురువుని ఒక సహోదరిని కోల్పోయిన ఏకాకినయ్యాననిపిస్తుంది. ★

అఖిల భారత సంఘ సంక్షేమ కార్యకర్తల సమావేశం

కేం౹ద సాంఘిక సంక్షేమ సంఘము (సెం౹టల్ సోషల్‌వెల్ఫేర్ బోర్డువారి ఆదేశానుసారము వివిధ రాష్ట్రాలలో నెలకొల్పబడిన రాష్ట్ర సంఘ సంక్షేమసలహా సంఘాల అధ్యక్షురాం౹డ్ర సమావేశము నవంబరు నెల 11-13 తేదీలలో జరుగుతుంది. కేం౹ద సంఘ సభ్యు రాం౹డు, రాష్ట్ర సంఘ సభ్యురాం౹డు కొందరూగూడ యీ సమావేశంలో పాల్గొంటారు భారత రిపబ్లిక్ అధ్యక్షులు డాక్టరు రాజేం౹ద౹పసాద్‌గారు యీ సమా వేశానికి ౹పారంభోత్సవం చేయుటకు దయతో అంగీ కరించారు.

కేం౹ద సంఘం ఆహ్వానంపై రాష్ట్ర సంఘాధ్యక్షులు, ౹పముఖ సంఘ సేవాభిలాషులు సమావేశం అవడం యిదే ౹పథమం. సంఘ సంక్షేమ కార్యకర్తల నెదుర్కొం టున్న సమస్యలను గురించేగాక వివిధ రాష్ట్రాలలో అమలు జరుగుతున్న సంఘ సంక్షేమ విస్తరణ కార్య ౹కమం (సోషల్‌వెల్‌ఫేర్ ఎక్స్టెన్షన్ ౹పాజెక్టులు)యొక్క అభివృద్ధిని గూర్చి గూడా యీ సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది.

౹గామసీమలో సంఘ సేవాసంస్థలు

కేం౹ద సంఘ సంక్షేమ బోర్డువారి కార్య౹కమానుసారం అక్టోబరు 2 వ తేదీని గాంధిజయంత్యుత్సవసందర్భమున వివిధ ౹పాంతాల్లో 59 కొత్త సంక్షేమ ౹పాజెక్టులు ౹పారం భింపబడ్డాయి. ఆగస్టు 15 వ తేదీని ౹పారంభించిన ౹పాజె క్టులతో సహా ఇంతవరకు స్థాపింపబడ్డవి 137 ౹పాజెక్టులు. ఈ ౹పాజెక్టులయొక్క ముఖ్యోద్దేశం మహిళాభ్యుదయం, శిశు సంరక్షణ, అనాథ రక్షణ, మాతా శిశు సంరక్షణాల యాలు, అనాథ శరణాలయాలువంటి సేవాసంస్థలను ౹గామసీమలో నెలకొల్పి జాతీయ ౹శేయస్సుకు దోహద మివ్వడమే కేం౹ద సంక్షేమ బోర్డువారి ఆశయం.

ఆగస్టు 15 వ తేదీని ఆం౹ధాలో 12, అస్సాంలో 4, బొంబాయిలో 4, మధ్య౹పదేశ్‌లో 8, మదరాసులో 7, ఒరిస్సాలో 10, హైదరాబాదులో 10, పెప్సూలో 10 తిరువాన్కూర్- కొచ్చిన్‌లో 4, భోపాల్‌లో 5, ఢిల్లీలో 2, వింధ్య ౹పదేశ్‌లో 2, మొత్తం 78 ౹పాజెక్టులు వివిధ రాష్ట్రాలలో నెలకొల్పబడ్డాయి. అక్టోబరు 2 వ తేదీని ౹పారంభించిన ౹పాజెక్టులలో అస్సాంలో 2, బొంబాయిలో 3, మధ్య౹పదేశ్‌లో 7, మ౹దాసులో 4, ఒరిస్సాలో 7, పంజాబులో 2, ఉత్తర ౹పదేశ్‌లో 13, పశ్చిమబెంగాల్‌లో 5, మైసూరులో 1, సౌరాష్ట్రంలో 10, హిమాచల ౹పదే శ్‌లో 1, కచ్‌లో 2, వింధ్య౹పదేశ్‌లో 2 మొత్తం 59.

ఈ ౹పాజెక్టులు 2760 ౹గామాల్లో, 27 లక్షల 60 వేల ౹పజానీకానికి ఉపకరిస్తాయి. ఇదేగాక ఈ 137 ౹పాజెక్టుల లోను సుమారు నాలుగు వేలమంది స్త్రీలకు సంఘసేవా కార్య౹కమంలో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

* * *

కేం౹ద సంక్షేమ బోర్డు ౹పచురించే "సంఘ సంక్షేమ" ప౹తిక సంపాదకురాలు ౹శీమతి ౹ఫెడబెడిగారు మధ్య ౹పదేశ్, మ౹దాసు, ఆం౹ధ, తిరువాన్కూర్- రాష్ట్రాలు పర్యటించి, 1954 అక్టోబరు 17 వ తేదీకి తిరిగి న్యూ ఢిల్లీ చేరారు. బోర్డువారు సాంఘిక సంక్షేమ కృషికి సం బంధించిన విషయాలు రాష్ట్రభాషల్లో ౹పకటించాలన్న ౹పణాళికను గురించి వారు పర్యటించారు. వీరు రాష్ట్రాల్లో సంక్షేమ విస్తరణ ౹పాజెక్టులు నడిపే కృషి సమీక్షించ డానికై అనేక ౹గామాల్లో సంక్షేమ కేం౹దాల్ని చూచారు. వీరి పర్యటనలో సేవా౹గాం, గాంధి౹గాం కూడ దర్శించి, భారత సాంఘిక కృషికి శాఖయైన తిరువాన్కూరు- కొచ్చిన్ యొక్క ౹పథమ సమావేశాలలో పాల్గొన్నారు.

గాంధీజీ సుభాషితాలు?

స్త్రీలు :— మగవాని కామ సంతృప్తికి ఏర్పడ్డామన్న భావం స్త్రీలో అంతమొందాలి. దీనికి మార్గాంతరం మగవారి చేతుల్లోగాదు, స్త్రీ చేతిలోనే ఉంది. స్త్రీ నిజమైన సహభాగిని ఐతే మగవానికోసం బొమ్మలాగు సింగారించుకోవడం మానాలి.

స్త్రీలు గృహ రక్షణ కోసరం, తుపాకులు దాల్చడం అన్నది ఆమెకు, పురుషునికి గూడ పతనమే. ఇది పశుత్వానికి తరలిపోవడం అవుతుంది.

జీవితంలో పరిశుద్ధమైనది స్త్రీలల్లో పొందుపర్చబడి ఉంది. ప్రకృతి సిద్ధంగా ఆమె మిత వ్యవహారిణి. "పిచ్చి" నమ్మకాలను వదలడంలో స్త్రీలు చాలా నెమ్మదిగా గావిస్తారనుకుంటే—జీవితంలో పరిశుద్ధమైనది, పావనమైనది వదులుకోడానికి కూడా వారు చాల నెమ్మదిగానే చేస్తారనాలి.

పతివ్రతాగుణం పైనుంచి కల్పిస్తే వచ్చేదిగాదు. అది పర్దా అనే గోడలమధ్య పెడితే సంరక్షింప బడేదిగాదు.

భార్య భర్తకు బంధింప బడ్డ సేవకురాలుగాదు. ఆమె అతని స్నేహితురాలు, సహకారిణి; జీవిత సుఖదుఃఖాలన్నిట్లోను సహభాగిని. భర్తలాగే ఆమెకూ తనకు నచ్చిన పంథాననుకరించడానికి పూర్తి హక్కువుంది.

స్త్రీ అంటే ప్రత్యక్ష త్యాగ స్వరూపిణి. ఆమె సక్రమ విధానంలో ఏకార్యమైనా గావించింది అంటే మేరు పర్వతమే కదిలిపోతుంది.

వివాహం :— వివాహం యొక్క ఉద్దేశం తపించే స్త్రీ పురుషుల హృదయాల్ని పరిశుద్ధమొనర్చి, వారినిభగవంతుని దగ్గరకు జేర్చేది. భార్యాభర్తల మధ్య కామేచ్ఛలేని ప్రేమ అన్నది అసాధ్యం కాదు. (ఉదా :— రామకృష్ణ పరమహంస, శారదా దేవి.) మానవుడు పశువుగాదు. పశుజన్మాలెన్నో ఎత్తి, వాటి తలదన్నిన మానవ జన్మమెత్తినజీవి. అతడు చతుష్పాద జంతువువలె నాల్గు కాళ్ళతోగాక, రెండు కాళ్ళపై నిలబడ్డానికి పుట్టిన వ్యక్తి. భౌతికానికి, భౌతికేతరానికి ఎంత వ్యత్యాసం ఉందో, పశుత్వానికి మానవత్వానికి అంతటి తేడావుంది.

బర్త్‌కంట్రోల్‌ను గురించి రెండభిప్రాయాలులేవు: గాని యుగయుగాలుగా మనకు సంక్రమించిన పద్ధతి ఆత్మ సంయమమూ బ్రహ్మచర్యమూను.

వివాహం అంటే ఒండొరులపై పవిత్రమైన నిబంధనలు విధించేది. ఇరువురూ ఏక రీతిని వాంఛించినప్పుడే— జాతి ప్రవృద్ధికే- వారు కలుసుకొనేది.

మోక్ష ప్రాప్తికి వివాహం అంతరాయమే ఔతుంది— అది కేవలం భౌతిక శరీరవాంఛాపరి తృప్తికే ఏర్పడినదైతేను.

వివాహం యొక్క ఆశయం ఏమిటంటే భౌతికం ద్వారా ఆధ్యాత్మిక సమ్మేళన సాధించేది. వివాహంవల్ల ఉద్భవించే ప్రేమ భావం, దైవ ప్రేమకు, విశ్వ మానవసౌభ్రాత్రతకు దోహదం కావాలి.

స్త్రీ పురుషుల పరస్పర వాంఛ పవిత్రమైనదే దాని నుంచి సిగ్గు పడవలసినదేమీ లేదు. కాని, అది జాతి ప్రవృద్ధికై, సృష్టిప్రక్రియకై ఉద్దేశింపబడింది. అంతకంటె ఇతరంగా పరిణమిస్తే-దాన్ని భగవంతునియెడ, మానవ జాతియెడ జరిగే అపరాధం అనవలసిందే. ★

స్వదేశీ

నాకు 'స్వదేశీ' అంటే, గాంధీజీ చర్కాతో ప్రారంభమైనా, ఇంకా అనేకమైన వాటికెన్నిటికో వ్యాపిస్తుంది ఈ రోజున దేశంలో నశించిపోతున్న కళలనూ, వృత్తులనూ సముద్ధరించడమంతా స్వదేశీ అనే నా వుద్దేశం. దీని అంతరార్థం— బట్టలకు రంగులు వేయడం, లేసులల్లడం, మీ పెళ్ళిళ్ళకు బాసికాలు తయారు చేయడం, మీ ఉయ్యేల తొట్టెలూ, తెరలూ అల్లడం, మీ గృహ జీవనానికి కావలసిన చిన్న చిన్న వస్తువులన్నీ తయారు చేయడం మొదలైన—వృత్తుల వల్ల జీవించేవారందరికీ భుక్తి కల్పించడం. ఈ రోజున మీనుండి ఏమాత్రపు సహకార సానుభూతులూ పొందక, నిరుద్యోగులై, అన్నిటికీ తెగించే వేలకొద్దీగల, మీ దేశస్తులకు జీవనోపాధి కల్పింపబడి బ్రతుకుతెరువు చూపెట్టబడాలి; 'గుర్తింపబడని చిన్న వృత్తు'లని గాంధీజీ పేరెట్టిన, ఈ నశించిపోతున్న చేతి వృత్తులన్నీ మీ గారడీ చేతులవల్ల పునరుద్ధరింపబడాలి. నాకు 'స్వదేశీ' అంటే, మన సాహిత్యాన్ని పునర్జీవింప జేయడం, మన సంగీతాన్ని పునరుద్ధరించడం, మన ఆధునిక జీవిత ఆశయాలకు అనుగుణ్యంగా నుండేటట్లు నూతననిర్మాణ కార్యక్రమాలను సాగించడం. మన దేశంలో నున్న సమస్త ప్రకృతి సంపదలనూ గణకట్టి సద్వినియోగం చేయడానికి ఒక విధమైన ప్రయోగం— నాకు స్వదేశీ అంటేను

(సోషల్ వెల్‌ఫేర్ పత్రికనుండి)

శ్రవ్యనాటిక

మధూళి

శ్రీమతి రమా ప్రతాపరావు.

పాత్రలు

మాధవరావు	....	ఉపాధ్యాయుడు	...	వయస్సు 55
వరదరాజులు	....	జిల్లాజడ్జి	....	వయస్సు 42
మోహన్	...	విద్యార్థి	....	వయస్సు 20
శ్యామల	....	మాధవరావు భార్య	....	వయస్సు 45
సుందరి	....	మాధవరావు కూతురు	....	వయస్సు 19
ఒక జవాను.				

———:o:———

మాధవ: శ్యామా, అమ్మాయేదీ!

శ్యామ: ప్రైవేటు క్లాసేదో ఉందట. కాలేజీకి వెళ్ళింది. ఏం?

మా: ఏం జేసిందో చూశావా?

శ్యా: ఏం. ఏమయింది?

మా: పోస్టాఫీసులో గుమాస్తాగా చేరింది.

శ్యా: అదేమిటీ? ఎప్పుడూ?

మా: ఇదిగో ఉద్యోగం యిస్తున్నట్టు పోస్టల్ డిపార్టు మెంటువాళ్ళు పంపిన ఉత్తరం. ఈమధ్య వాళ్ళు ఎడ్వర్టయిజు చేశారు. మన అమ్మాయి దరఖాస్తు పెట్టి ఉంటుంది. ఈ ఊళ్ళోనే గాబట్టి ఇంటర్వ్యూ కూడా అయిపోయి ఉంటుంది.

శ్యా: మీతో ఏమయినా చెప్పిందా?

మా: ఊహు!_ నీకేమయినా తెలుసు ననుకున్నాను నీతోను చెప్పలేదన్నమాట___ ఉఁ బాగానే ఉంది.

శ్యా: తల్లిని_ నాదగ్గర దాపరిక మేమిటి దానికి?

మా: ఇంట్లో పరిస్థితులన్నీ గమనించి తనుకూడా ఆర్జిస్తే నేగాని మార్గం లేదనుకొని సాహసించి ఉంటుంది.

శ్యా: నేను నెత్తి నోరు కొట్టుకుని చెప్పాను దానికి పెళ్ళి చెయ్యండీ అని. మీరు నామాట వింటేగా___ పెళ్ళయి ఉంటే దాని మానాన్న అది బ్రతుకుననుగదా!

మా: అవును నిజమే___

శ్యా: ఆ మూడు ముళ్ళూ పడి ఉంటే మనకీ గొడవ ఉండకపోను. మనం ఏదన్నా ఉంటే తినేవాళ్ళం_ లేకపోతే చింతగింజంత నల్లమందుతో అన్నిబాధలూ తీరిపోయేవి.

మా: బ్రతక లేకపోతే బడిపంతులన్నారు. చివరికి ఆ సామెత కొచ్చింది నా బ్రతుకు.

శ్యా: చేతులారా మీరు చేసుకున్నదే. ఇప్పుడనుకుని మాత్రం ఏం ప్రయోజనం_ ఎన్నో సార్లు చెప్పాను___ ఆడపిల్లలు గల కొంప_ కాస్త ముందుసంగతి ఆలోచించండీ అని.

మా: ప్చ్...... ఏమిటో......

శ్యా: అప్పుడు నా మాట చెవిని పెడితేగా___ చదువు రాని వాజమ్మ క్రింద కట్టేసి నేనంటేనే ఖాతరుండేది కాదు మీకు. ఆనాడు నిలద్రొక్కుకుంటే ఇంత బాధ పడాల్సిన అవసరముండదుగదా!

మా: గొర్రెతోక జీతం___ వచ్చేది కుటుంబానికే సరి పోయేది కాదు గదా_ యింక ఏం మిగుల్చుకుంటాం!

శ్యా : ఎన్నిసార్లు వాగాను ప్రయివేట్లు చెప్పండని- ఆ కంపెనీల వాళ్ళు ఎంత మంది వచ్చి అడిగారు క్లాసు పుస్తకాలు వ్రాయమని. వ్రాశారూ? ఎంత చేసుకుంటే అంత.

మా : కాని నాకు టైమెక్కడుండేది!

శ్యా : అవును. ఆ కుర్రకుంకలందరికీ రాత్రనక పగలనక డబ్బూ దస్కం లేకుండా చదువు చెప్పడానికి టైముండేది. మనకు లాభించేపని చేయడానికి టైమెందుకుంటుంది?

మా : ఊఁ...... (నిట్టూర్పు)

శ్యా : వాళ్ళ సంగతి నాకప్పుడే తెలుసు. పంగనామాలు పెట్టే రకమని. పుస్తకాల్లేకపోతే కొనిచ్చారు. బట్టల్లేకపోతే కుట్టించి యిచ్చారు- వాడిమట్టుకు వాడు ఆ వరదరాజులు- ఏళ్ళతరబడి మేశాడే మనింట్లో- వాడికేమైనా కృతజ్ఞతుందా?

మా : వరదరాజు లిప్పుడు జిల్లా జడ్జి- ఒక వారం క్రిందటే ఇక్కడకు బదిలీ అయిందట.

శ్యా : జడ్జీగాకపోతే గవర్నరవమనండి నాకేం- వాళ్ళేమయితే మాత్రం నాకే మొరిగింది___ ఏం వాడు లేడు రామారావు- మీ శిష్యుడేగా- పోలీసు సూపర్నెంటుగా ఈవూళ్ళో___ వాడు వొలకబోశాడు యిన్నాళ్ళూ - ఇంక మీ వరదరాజులు చెట్టెక్కిస్తాడు మిమ్మల్ని.

మా : వాళ్ళు నన్ను ఎప్పుడూ మర్చిపోరు. పనుల తొందరలో తీరికుండుండదు. తప్పకుండా నన్ను చూడ్డానికి వస్తారు. నా శిష్యులమీద నాకఖండమైన విశ్వాసముంది.

శ్యా : ఆ రోజులు తల్చుకుంటూంటే నా కడుపు తరుక్కుపోతోంది. ఆ వరదరాజులుకు జ్వరమొస్తే, బాలింతననైనా గమనించకుండా అడ్డమయిన చాకిరీ చేయించారు. (గద్గదంగా వెక్కుతుంది)

మా : ఊరుకో... ఎవరో వస్తున్నారు. మన అమ్మాయే సుందరి వస్తోంది.

(చెప్పులు విడుస్తున్న చప్పుడు)

కాలేజీ అయిపోయిందామ్మా.

సుం : అయింది నాన్నా-

శ్యా : ఏమే___ ఏదో ఉద్యోగం చేయడానికి బయలుదేరావట!

సుం : అవునమ్మా- పోస్టాఫీసులో గుమాస్తా పనికోసం ప్రయత్నం చేశాను.

మా : కాని నువ్వు అలా చేయడం మాకెవరికీ యిష్టంలేదు తల్లీ- ఇప్పుడూ నీ కేకష్ట మొచ్చిందమ్మా - నే బ్రతికున్నాగా......

సుం : నాన్నా. మీమనసు నొప్పించినందుకు క్షమించండి. మీకు బాధ కలుగజేసే దేదీ చేయను. మీరు నన్ను కొడుకులా పెంచారు. మీకీ వృద్ధాప్యంలో తోడ్పడదామనే ఉద్దేశ్యంతో అలా చేశాను. మీకు సహాయపడడం నా విద్యుక్త ధర్మమని తలచాను.

మా : ఎంత మంచి మనసమ్మా నీది___ నీ విద్యుక్త ధర్మం నే చెప్పినటల్లా నడుచుకోవడమే. నువ్వా ప్రయత్నాలన్నీ మానేసి శ్రద్ధగా చదువుకో. డిగ్రీ పరీక్షలో క్లాసు రావాలి. నువ్వెంత బాగా చదువుకుంటే మాకంత ఆనందం.

సుం : మీ యిష్ట ప్రకారమే చేస్తాను నాన్నా... ఏమిటమ్మా... యిందాక ఏదో వరదరాజులంటున్నావు.

మా : అవును తల్లీ... అతను నా దగ్గర చదువుకున్నాడు. ప్రస్తుతం యిక్కడ జిల్లా జడ్జీగా ఉన్నాడు. అతని సంగతే మాట్లాడుతోంది.

సుం : ఆయన కొడుకు మా కాలేజీలో ఎం.ఏ. చదువుతున్నాడు. చాలా బ్రిలియంటు స్టూడెంటు. కాలేజీలో ప్రైజులన్నీ అతనివే.

శ్యా : నువ్వెళ్ళి చదువుకోరాదటే-

సుం : అలాగేనమ్మా.

శ్యా : ఏమండీ నాకు తెలియ కడుగుతున్నాను. మీగతా

యిద్దరు పిల్లలకీ పదిహేనో యేట నే పెళ్ళి చేశారుగదా- దీన్నింకా చదివిస్తున్నారేం.

మా : మా బాగా అడిగావు- చెప్పనా. యిదంతా నీ నిర్వాకమే. ఒక్క కొడుకుని కనలేకపోయావు. నిన్ను చేసుకునేటప్పుడే అనుకున్నాను. ఆ కుదుట్లోంచి వస్తోంది, వాళ్ళ ఆనవాయితే వస్తుందేమోనని. అలాగే అయింది. యింకా నయం. నీ అమ్మలాగ పన్నెండు మందిని కన్నావు గాదు. నా పుట మారిపోయేది.

శ్యా : ఎవళ్ళ వ్రాత వాళ్ళది. కొడుకుల్ని కన్నమ్మలందరూ కావాలంటేనే కలిగారా! వాళ్ళ వాళ్ళ అదృష్టం! నాకడుపునే ఒక నలుసుంటే మీరీమాటనరుగదా...

మా : పిచ్చిదానా- వేళాకోళానికంటే కంట తడి పెడతావు దేనికి - అయినా అందులో నీతప్పేముంది... పోయి వంట సంగతి చూడు. నేనలా బయటికెళ్ళొస్తాను.

2 వ రం గం

శ్యా : ఈ రోజెళ్ళి పోయింది. తెల్లవారితే మళ్ళీ తడుముకోవాలి... హాయ్ శ్రీరామచంద్ర...

మా : అమ్మో...

శ్యా : అయ్యో: అదేమిటి వణికిపోతున్నారు జ్వరమొచ్చిందా ?

మా: ఏం ఫరవాలేదు. కొద్దిగా చలిగా ఉంది అంతే.

శ్యా : కంబళీ కప్పుతాను. పడుకోండి... సాయంత్రం అనవసరంగా ఉద్రేక పడ్డారు. అంతా నా తప్పే. నేను ఆవేశంలో తెలియక ఏమిటేమిటో అనేశాను. మీ మనసు నొప్పించాను.

మా : నిజం మాట్లాడావు. నీ తప్పేముంది. నా విద్యార్థుల మీద నా కచంచలమైన విశ్వాసం ఉంది.

శ్యా : ఈ కష్ట సమయంలో ఆ రామకృష్ణ మీమీద గౌరవముంచి ఈ యిల్లు అద్దె లేకుండా యిచ్చాడు. లేకపోతే మరీ నికృష్టంగా ఉండేది మన సంసారం—

మా : ఊఁ అమ్మయ్య. (మూలుగుతాడు)

శ్యా : ఉష్ణం చాలా ఎక్కువగా ఉన్నదండి. అమ్మాయి, సుందరీ !

సుం : ఏమిటమ్మా-

శ్యా : మీ నాన్నగారికి జ్వరమొచ్చిందమ్మా.

సుం : డాక్టరుని పిలుచుకురమ్మంటారా నాన్నా !

మా : అక్కరలేదు. చలిగా ఉంది. అదే తగ్గిపోతుంది... మీరు పోయి పడుకోండి...........

సుం : అనవసరంగా ఏదో ఘర్షణ పడి ఉంటారు. నీకు తెలుసు గదటమ్మా ఆయనకు గుండె నొప్పి, జ్వరం వస్తాయని. పాతవన్నీ కెలుకుతావు. వాటివల్ల ఏం ప్రయోజనం లేదని తెలిసికూడా చేస్తావు.

శ్యా : అవునమ్మా- సాయంత్రం నీ పెళ్ళి గొడవ వచ్చిందమ్మా—

సుం : ఇప్పుడు నా పెళ్ళికేం తొందర. నాకీ జీవితంలో పెళ్ళే కాదనే ధోరణిలో మాట్లాడుతావు...ఛా...

3 వ రం గం

జవాను : ఏం కావాలయ్యా.

మా : మీ అయ్యగారితో మాధవరావు మాష్టారొచ్చారని చెప్పు.

జ : ఇప్పుడేం లాభం లేదు. అయ్యగా రెవరితోనో మాట్లాడుతున్నారు.

మా : చాలా దూరం నుంచి వచ్చాను. పెద్దవాణ్ణి. మళ్ళీ రాలేను. నువ్వొక్కసారి వెళ్ళి చెప్పిరా. ఆయన కాదంటే వెళ్ళిపోతాను.

జ : చెప్తుంటే నీకు కాదటయ్యా వెళ్ళమని...

మా : పూజారి అనుమతి లేందే దేవుడి దర్శనమవదంటారు. యిక్కడ నువ్వే అడ్డగిస్తే...

జ : ఏమిటయ్యో... మాటలు మా జోరుగా రానిస్తున్నావు. పొమ్మంటే నీలుగుతావెందుకు...

వరద : (లోపలనుంచి) ప్యూన్... ఎవరది... ఏమిటా గొడవ!

మా : వరదరాజులూ_ నేనే మాధవరావుని. నిన్ను చూద్దామని వచ్చాను. (గొంతెత్తి చెబుతాడు)

వర : మాధవరావు... ఏ మాధవరావు.

మా : నేనే... గుర్తు రావడంలేదూ ?

వర : ఫ్యాన్......

(కారు హారన్ రెండు మూడు సార్లు వినిపిస్తుంది... సడెన్ బ్రేకు...)

ఒక గొంతు : ఎవరీ ముసలాడు...

4 వ రంగం

మా : నే నెక్కడున్నాను,

మోహన్ ; జడ్జి వరదరాజులు గారింట్లో.

సుం : అవును నాన్నా.

మా : నువ్వేలా వచ్చావమ్మా యిక్కడికి ?

సుం : ఉదయం మీరు స్పృహతప్పి పోయారని జడ్జిగారు కబురు పంపారు. వెంటనే అమ్మా, నేను వచ్చేశాము.

మా : ఈ యింటి గేటుముందు మాట్లాడుతున్నాను. వరదరాజులు కనుపించలేదు. నిస్పృహ చెందాను. ఇంతలో నల్లగా దెయ్యంలా ఏదో మీదకొస్తున్నట్లు కనిపించింది. కళ్ళు తిరిగినయ్. అంతే. తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.

మో : ఆకారు డి. ఐ. ఎస్. పి. రామారావు గారిది. ఆయనకూడా మీ శిష్యుడేనట. ఆయనే మిమ్మల్ని లోపలకు తీసుకొచ్చారు. సర్జను కుటుంబరావుగారొచ్చి మీకు యింజక్షనిచ్చి వెళ్ళారు.

మా : ఈ అబ్బాయెవరమ్మా, సుందరీ.

సుం : ఈయనే వరదరాజులుగారబ్బాయి. మీతో చెప్పానుగదూ కాలేజీలో ఎం. ఏ. చదువుతున్నారని.

మా : ఈమధ్య నే అనుకున్నాము నాయనా నీసంగతి.

వర : నమస్కారం పెట్టారు.

మా : ఎవరు, వరదరాజులు రా రా.

వర : లేవకండి. కదలకూడదు. విశ్రాంతిగా ఉండాలని డాక్టరు చెప్పాడు. డాక్టరు మనకుటుంబరావే. మాతో చదువుకున్నాడు.

మా : వాడా. కుటుంబాయి, మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు.

వర : మా జవానుకు తెలియక మిమ్మల్ని లోపలికి రానీయలేదు. లేకపోతే ఈ ఆపద కలిగేదే కాదు. మీరు నన్ను క్షమించాలి.

మా : దానికేం లే......

వర : కోర్టుకు టైమవుతోంది. సాయంత్రం కలుసుకుంటాను.

మా : మధ్యాహ్నం నేను యింటికి వెడతాను.

వర : అదేం పనికిరాదు మాష్టారూ. మీరు స్వస్థత చేకూరే వరకు యిక్కడే ఉండాలి. మీకు కావలసిన ఏర్పాట్లన్నీ యింట్లో చేస్తారు.

మా : యిక్కడెందుకు నాయనా.

వర : ఏం ఫరవాలేదు... మరి నే వెళ్ళొస్తా.

5 వ రంగం.

మో : ఏయ్ పిల్లా, మాట యిలారా.

సుం : అమ్మా వాళ్ళు వింటారు. ఏమిటా పిలవడం.

మో : (వెక్కిరింపుగా) సుందరమ్మగారూ, యిటొకసారి దయచేస్తారా. (యిద్దరూ నవ్వుతారు) పార్టీకి టైమవుతోంది వచ్చే వాళ్ళను రిసీవు చేసుకోవాలి.

సుం : నేను సిద్ధంగానే ఉన్నాను.

మో : ఏమో యింకా అమ్మగారు డ్రెస్సు చేసుకోవాలేమోనని పిలిచాను.

సుం : నాకెందుకు డ్రెస్సింగు నేనేం జడ్జీగారి కూతురినా ?

మో : కూతురివి కాకపోతే కోడలివన్నా అవుతావుగా...

సుం : మీరు డ్రెస్సు చేసుకుంటే చాలు.

(కారు హారన్ మ్రోగుతుంది)

మో : ఎవరో వస్తున్నారు... పదపద... బారిష్టరు రంగనాథంగారు,.. వరసనే మూడు కార్లొస్తున్నాయ్యే...

సుందరీ వెళ్ళి నాన్నగారితో చెప్పు... ఈలోపుగా వాళ్ళందరినీ పైకి తీసుకెడతాను. రండి సార్...రండి.

వర : హల్లో రంగనాథం... రా రావోయి రామారావు. రామకృష్ణ వచ్చాడా... (ఒక గొంతు) వస్తున్నాడు... రండి డాక్టరుగారు.

అడుగో కలనల్ మనోహర్‌కూడా వచ్చేశాడు. వచ్చేశాడు... కలన్... కమాన్... వెల్. మేక్ యువర్ సెల్ఫ్ కమ్‌ఫర్టబుల్... (Make your self Comfortable)

వర : మిత్రులారా, ఈరోజు చాలా సుదినము. మనమందరము కలుసుకోవడం జరిగింది. ఉద్యోగ ధర్మం వల్ల ఎవరి పనులలో వాళ్ళుంటారు. మన నందరినీ దగ్గరకు చేర్చింది మన మేష్టారు, వారిమీద మనకున్న వాత్సల్యము ప్రస్తుతం మనలో అందరూ పెద్ద హోదాలో ఉన్నవాళ్ళే. కాని మనందరికంటె కూడా గొప్పవ్యక్తి మన మాష్టారు. ఆయనకు డబ్బుండకపోవచ్చు. హోదా లుండకపోవచ్చు. అధికార ముండకపోవచ్చు. అయినా ఆయన మహాపురుషుడు త్యాగధనుడు. మన ఈనాటి ఔన్నత్యానికి ముఖ్యకారణం ఆయనే అంటే అతిశయోక్తి కాదు. చిన్నతనంలో మనకు మంచి శిక్షణ యిచ్చారు. అది పునాదిగా పైకి రాగలిగాం. ఆవిషయం మనందరికీ తెలుసు. మనలో కొంతమందిని ఆయన స్వంత బిడ్డలకంటే ఎక్కువగా ఆదరించారు.

ఆయనకు ముఖ్యమైన శిష్యులమందరము ఈ వూళ్ళో ఉండడంచేత నేనీ సమావేశం ఏర్పాటుచేశాను. మీ అందరి తరఫున నేను ఆ మహనీయుడికి మన కృతజ్ఞత తెలియపరుస్తూ ఈ రెండు వేల రూపాయలు గురుదక్షిణగా సమర్పిస్తున్నాను. ఆయనకు చివరి రోజులలో మనం ఉపయోగ పడగలిగితే ధన్యులం.

(చప్పట్లు)

మరోవిషయం. మీ అందరికంటే ఎక్కువగా సహాయం పొందినవాణ్ణి నేను. ఏడెనిమిదేళ్ళపాటు ఆకుటుంబంలో ఒకడిగా మెలిగాను. అది నిజమైన సంబంధం చేయాలని నా కోరిక. మా అబ్బాయి మోహన్, మేష్టారి ఆఖరమ్మాయి కాలేజీ మేట్సట. వారిద్దరి వివాహానికి అంగీకరించమని మాధవరావుగారిని కోరుతున్నాను.

(హియర్, హియర్, వెల్‌డన్, వెల్‌డన్ అనే వినాదాలు)

మా : అంతకంటేనా వరదరాజులు. ఈ సమావేశం, ఈ గౌరవం చూస్తుంటే ఆనందంతో కన్నీళ్ళొస్తున్నాయి. బడిపంతుల్ని ఎంతవాణ్ణి చేశావు నాయనా......

మీరంతా యింత శ్రద్ధతో యిక్కడకు వచ్చి మీ ప్రేమను వెలిబుచ్చినందుకు మీ కెంతో కృతజ్ఞుణ్ణి. మిమ్మల్నందరినీ చూస్తుంటే కన్నుల పండువగా ఉన్నది. ఆరోజులు గుర్తుకొస్తున్నాయి. ఆనందం ఎక్కువవడంతో మాటలు తడబడుతున్నాయి... మీ అందరికీ నా ఆశీర్వాదములు. చిరంజీవులుగా వర్ధిల్లండి.

6 వ రంగం

శ్యా : ఏమండీ ఆ పర్సులో ఎంతుంది ?

మా : మనిద్దరి జీవితాలకి సరిపడినంత.

శ్యా : అబ్బ, చెపుదురూ,

మా : రెండు వేలు

శ్యా : అంతా మీ శిష్యులిచ్చినదే.

మా : అవును, "అంతా పంగనామాలు పెట్టే రకం".

శ్యా : ఏం ఎత్తి పొడుస్తారండి.

సుం : (వస్తూ) నాన్నా, రండి కారు సిద్ధంగా ఉంది.

మా : ఓహో, జడ్జీగారి కోడలుకాబోలు. ఎవరికమ్మా కారు ?

సుం : మనందరికీని - యింటికి వెళ్ళడానికి.

మా : అమ్మా, సుందరిని వాళ్ళ మోహన్ కివ్వడం నా కిష్టంలేదు.

శ్యా : అయ్యో అదేమిటండీ అలా అంటారు ?

మా : అసలు దానికి పెళ్ళి చేయడమే నా కిష్టంలేదు.

శ్యా : పిలిచి పిల్లనడిగితే పెళ్ళి చేయనంటారేమిటండి ఖర్మ

మా : ఎందుకో చెప్పనా ! దానికి పెళ్ళయిపోతే నువ్వూ చింతగింజంత నల్లమందుతో మన బాధలన్నీ తొలగిస్తావేమోనని......

శ్యా : చాల్లెదురూ.

సుం : రండి నాన్నా......

(కారు బయలుదేరిన శబ్దం)

శ్రీ బాలసరస్వతీ స్త్రీ సమాజము
తణుకు.

కార్యనిర్వాహకవర్గము :

1. శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మగారు. అధ్యక్షురాలు.
2. ,, చేబ్రోలు సుభద్రమ్మగారు, ఉపాధ్యక్షురాలు
3. ,, పోతాప్రగడ బాలాత్రిపుర సుందరమ్మగారు, కార్యదర్శిని.
4. ,, చొప్పెల్ల మహాలక్ష్మమ్మగారు, సహాయ కార్యదర్శిని.
5. ,, మంత్రిప్రగడ వరలక్ష్మమ్మగారు.
6. ,, తమిరిశ ప్రభావతమ్మగారు.
7. ,, ఇరగవరపు లక్ష్మీకాంతమ్మగారు.
8. శ్రీయుత పోతాప్రగడ శ్రీరామారావుగారు.
9. ,, చేబ్రోలు అన్నప్పగారు.
10. ,, ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాదరావుగారు.
11. ,, అయ్యగారి వీరేశ్వరరావు గారు.

ఆశయం :– దేశసాంప్రదాయములు, ఆచారవ్యవహారములు, నేటి స్త్రీలదైనందిన జీవితావసరములతో సమన్వయపరచి విద్యార్థినులకు, సభ్యురాండ్రకు కూడ తగిన పరిపూర్ణమైన జీవన వికాశం కలగడానికి అవకాశం కలిగించడమే మా ఆదర్శం – ఆశయం.

సమాజచరిత్ర – గావిస్తున్నకృషి :– పూజ్య బాపూజీ, బాబూ రాజేంద్రప్రసాదులు ప్రసాదించిన ఆశీస్సుల ప్రభావము నందుకొని, దేశసేవ తత్పరులు, సేవా కార్యదక్షురాలు, శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మగారి ఆధ్వర్యమున తణుకు నగర మాహిళామణులు కొందరు 1932 సం॥లో చిన్న గ్రంథాలయ మొకటి స్థాపించిరి. నాటి తహశీలు దారు శ్రీ ఇంటూరి కోటయ్యనాయుడిగారి సతీమణి శ్రీమతి ప్రేమావతమ్మగారు తమ పుత్రికారత్నమగు శ్రీ బాలసరస్వతి స్మృతిచిహ్నముగ భూరివిరాళ మొసగి ఈ సంస్థకు శాశ్వత రూపమిచ్చుటకు కారణభూతులగుటచే దీనికి "శ్రీ బాలసరస్వతీ స్త్రీ సమాజము" అను నామకరణము చేయబడినది. ఈ సమాజస్థాపకురాలైన శ్రీమతి ప్రేమావతమ్మగారికి, దీనికి శాశ్వతరూప మిచ్చుటలో సర్వవిధముల తోడ్పడిన శ్రీ అంకరాజుగారికి, ఈ సంస్థ యొంతయో ఋణపడి యున్నది.

శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడుగారు తమ ధర్మపత్ని ఆదిలక్ష్మమ్మగారి స్మృతి చిహ్నముగ సాహిత్య భవన నిర్మాణమునకు వలయు భూరి విరాళము నొసగి ఆర్థికముగ అనేక రూపముల తోడ్పడిరి. ఈ భవనమునందు గ్రంథాలయము నడప బడుచున్నది. దీనియందు సుమారు 4000 గ్రంథముల వరకు గలవు. ఈ గ్రంథములతో పాటు దైనిక, సాప్తాహిక పాక్షిక, మాసిక, పత్రికలు తెప్పించుచున్నారు. ఈ పుస్తక భాండాగారమింకను దినదినాభి వృద్ధినొంది మహిళా లోకమున ఇతోధిక విద్యావ్యాప్తికై తోడ్పడుటకు పరిసరగ్రామములందు కూడ గ్రంథముల నందచేయు సంచార గ్రంథాలయముగ నడిపించు కార్యక్రమమునకై పూనుకొన ప్రయత్నిస్తున్నాము.

సమాజ కార్యనిర్వాహకవర్గ శాశ్వత సభ్యులు శ్రీ పోతాప్రగడ అంకరాజుగారు, వారి సతీమణి సమాజ కార్యదర్శిని శ్రీమతి బాలాత్రిపుర సుందరమ్మగారు ఉచిత హోమియోపతి వైద్యశాలకు భవన దానము చేసిరి. శ్రీ ద్వారంపూడి బసివిరెడ్డిగారు ఈ భవన స్థలమును ప్రసాదించిరి. సమాజ కార్య నిర్వాహకవర్గ శాశ్వత సభ్యులు శ్రీ పోతాప్రగడ శ్రీ రామారావుగారు గత పదిహేను సంవత్సరములనుండి ప్రతి సంవత్సరము సుమారు 20 వేలవరకు స్త్రీల–బిడ్డల, వయోవృద్ధుల జీర్ణతరుణ వ్యాధుల నివారణకు ఉచితవైద్య సహాయము చేయుచున్నారు. రాష్ట్రీ సంక్షేమ సంఘం (Provincial welfare committee) వారు రు 500–0–0 లు, శ్రీమతి జుజ్జువరపు కన్యారత్నమ్మగారు, రు 200–0–0 లు విరాళమిచ్చి ఈ వైద్యశాల పురోభివృద్ధికి సహాయపడిరి. కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘంవారి విరాళ సహాయముతో ఈ వైద్యశాలను దినమంతయు పనిచేయునదిగను, రోగులకు బెడ్సు ఏర్పాట్లుకలిగినదిగను చేయుటకై కృషి సల్పుచున్నాము.

శ్రీ బాలసరస్వతీ స్త్రీ సమాజము.

ప్రస్తుతము స్థలాభావముచేత గాంధీ ప్రణాళిక ప్రకారము నవీనవిద్య గరపు పాఠశాలను ఈ వైద్యశాల భవనములో నడపవలసి వచ్చుచున్నది. దీనికి ప్రభుత్వమువారు 400 చ॥ గ॥ ల ప్రత్యేక స్థలమును మంజూరు చేసియున్నారు. ఈ భవన నిర్మాణమునకై పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు శ్రీ జి. సింహాద్రి బి. యే. గారు శంకుస్థాపన చేసిరి. అదే సందర్భమున వారు బాలానంద శాఖకు ప్రారంభోత్సవము చేసి దానికి తమ డిస్ క్రీషనరీ గ్రాంటు నుండి 300 లు విరాళమిచ్చి రేడియో కొనుటకు సహాయపడిరి. దీనితోను శ్రీ నిడదవోలు మృత్యుంజయరావు గారి సహాయముతో ఒక రేడియోసెట్టు సంపాదించ గలిగితిమి. నవీన పాఠశాలయందు 5 వర్గములలో 100 మంది బాలబాలికలు ముగ్గురు ఉపాధ్యాయులు, బేసిక్కు విద్యావిధానము ననుసరించి విద్య గరపుచున్నారు. ఇదే ప్రకారముగ నవీన విద్యా పాఠ్యప్రణాళిక ననుసరించి 7 వ వర్గము వరకు దీనియందు చదువుకొన వచ్చును. దీని పురోభివృద్ధికి భవన నిర్మాణమునకు ధనసహాయ మింకను కావలసి యున్నది.

ఆంధ్ర మహిళాసభ విద్యార్థినుల నృత్య ప్రదర్శన సహాయముతో ఒక గదియున్ను, శ్రీ కడియాల సుబ్బారావు ధర్మపత్ని శ్రీమతి సరస్వతమ్మగారి సహాయముతో అతిథి గృహము నిర్మించ గలిగితిమి.

1950 సం॥లో టంగుటూరి సూర్యకుమారిగారు పాట కచ్చేరి జరిపి సహాయముచేసిన రు 5641 లతో ఫిర్కా డెవలప్ మెంటువారు గ్రాంటు చేసిన రు 2000 లతో సంస్కృత పాఠశాలా భవనము నిర్మించ గలిగితిమి.

సమాజ కార్యక్రమ నిర్వహణమునకు, భవనముల మరమ్మత్తులకు ధన సేకరణకై తమ నృత్య, గాన, నటనా, ప్రావీణ్యముద్వారా తోడ్పడి సమాజ బాలికలకు నృత్యము నందు శిక్షణ యిచ్చిన శ్రీమతి ముడుంబి సీతమ్మగారూ వారి పుత్రికామణులగు భానుమతి, భాస్కరంగారలూ నరసాపురం నవ్యకళా నాట్యమండలివారూ తదితరులుకలరు. తమ ఐ. సి. ఐ. [I. C. I.] కంపెనీ సిబ్బంది ద్వారా సమాజ పురోభివృద్ధికి కృషి సల్పిన శ్రీ పోతాప్రగడ అంకరాజు గారికి, తమ ధర్మపత్ని శ్రీమతి బాలాత్రిపుర సుందరమ్మ గారి పేర రు 500 లు విరాళమిచ్చి తోడ్పడిన శ్రీ తాడినాడ సుబ్రహ్మణ్యంగారికి ఈ సమాజ భవనము లన్నిటియందు విద్యుద్దీపములు వేయించుటకు వలయు ఆర్థిక సహాయముచేసిన శ్రీ చిట్టూరి ఇంద్రయ్యా గారికిని, సమాజ శాశ్వత సభ్యులైన శ్రీ వేగేసిన కనకదుర్గ సత్యనారాయణ రాజుగారికిని, సమాజ కార్యనిర్వహణమునకు పలువిధముల ఆర్థిక సహాయము చేసిన శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణ వీరభద్రరావుగార్లకు మాహృదయపూర్వక అభివందనములు. ఇంకను ఎందరెందరో పెద్దలు మహిళామణులు మాకు అనేక విధముల సహాయపడిరి; వారందరిని ఉదహరించుటకు ఇటు సాధ్యముకాదు. సంస్కృతాంధ్ర భాషలను విద్యార్థినులకు ప్రధానముగా నేర్పుటకు ఈ సమాజ ఆధ్వర్యమున ఓరియంటల్ పాఠశాల నెలకొల్ప పడినది. హిందీభాషగూడ ప్రచారము చేసి, విద్యార్థినులను పరీక్షలకుపంపు ఏర్పాట్లు చేయబడినవి. సంగీతము, చిత్రకళ, నృత్యము మొదలగు లలితకళలు నేర్పుటకై తగిన ఏర్పాట్లు చేయబడినవి.

ఈ సంస్థవారిచే నడపబడుచున్న సంస్కృత పాఠశాల ప్రభుత్వము వారిచే ఓరియంటల్ సెకండరీ స్కూలుగా రికగ్నైజు చేయబడింది. హైస్కూలు పాఠ్య ప్రణాళిక ననుసరించి శిక్షణ ఇవ్వబడుచున్నది. కాని సంస్కృతాంధ్ర భాషలకు మాత్రము ప్రముఖస్థానము కలుగ జేయబడినది. హైస్కూలులో చెల్లించ వలసిన జీతములలో సగముతోనే విద్యార్థినులు ఇక్కడ విద్య నభ్యసించుటకు అవకాశములు కల్పించ బడినవి. ఎన్. జి. ఓ. ల పిల్లలకు, ఉపాధ్యాయుల పిల్లలకు ఉచితముగ విద్య నేర్పబడును. ఒకటి రెండు మూడు ఫారము క్లాసులకు సక్రమముగా జరుపుటకు సంస్కృత, ఆంధ్ర, హిందీ, ఆంగ్ల భాషలను, సంగీతము, సామాన్య విజ్ఞాన విషయములను బోధించుటకై సమర్థులగు 5 గురు ఉపాధ్యాయులను నియమించి ఏర్పాట్లు చేసినాము జాతి, మత, వర్ణ వివక్షతలేకుండ హరిజన, క్రైస్తవ, మహమ్మదీయ, హిందూ బాలికలు సుమారు 70 మందివరకు ఇందు విద్యాభ్యాస మొనర్చుచున్నారు. అచిరకాలములో నాలుగు అయిదు, ఆరు, ఫారములు ఏర్పాటు చేయుటకు అటు పిమ్మట ప్రాచ్యవిద్యాకళాశాలగ దీనిని రూపొందించుటకు, వాటికి తగిన భవన వసతి, వసతిగృహము కల్పించుటకు, సహాయ మపేక్షించుచున్నాము.

శ్రీ బాలసరస్వతీ స్త్రీ సమాజము.

హిందీ సంగీత క్లాసులను ప్రయివేటుగా జరిపించుచున్నాము. హిందీ ప్రాథమిక పరీక్షనుండి విశారద పరీక్ష వరకును, సంగీతం లోయరు, హైయరు గ్రేడు పరీక్షలకు శిక్షణ ఇవ్వబడుచున్నది.

ఈ సంస్థ నారీమణులకు తమ విద్యుక్తధర్మములందు అచంచల విశ్వాసము కలుగజేయుటకు సనాతన ఆధునాతన సాంప్రదాయములను దేశకాలాను గుణ్యముగ సమన్వయ పరచి వారిని ఉన్నత పథములలో తమ జీవిత యాత్రను గడుపుకొనుటకై ప్రోత్సహించుటకు ప్రతివారము భజనలు, అనుభవజ్ఞులగు పెద్దల ఉపన్యాసములు, దశరా సంక్రాంతి మున్నగు ఉత్సవములు జరిపించుచున్నది.

అర్థాభావము చే తాపత్రయములుపడుచున్న మధ్యతరగతి స్త్రీలకు, అనాథలు, అసహాయులయిన సోదరీమణులకు జీవనాధారము కలిగించుటకు ఒక పారిశ్రామిక భవన నిర్మాణము చేయుటకు సంకల్పించితిమి. కుటీర పరిశ్రమలు, చిన్న చిన్న గ్రామ పరిశ్రమలు విద్యుచ్ఛక్తి సహాయముతో నడుపుచు పై లక్ష్య సిద్ధికి కృషి చేయదలచితిమి. ఈ కార్యక్రమమునకు స్థల భవన, పరికర సేకరణకై సుమారు రు 50,000 లు వ్యయమగునని అంచనా వేసియున్నాము.

అకుంఠిత దేశసేవా దీక్షాపరతంత్రురాలగు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి అధ్యక్షతను పనిచేయుచున్న కేంద్ర సంక్షేమ సంఘమువారు ఈ సంస్థచే నడుపబడుచున్న సమాజ సేవా కార్యక్రమ విస్తరణకు, అనాథబాలికా పోషణకు 1954 సం॥ రు 10,000 లు గ్రాంటు నిచ్చియున్నారు. దీనికితోడు ఇంకను రు 10,000 రాష్ట్ర ప్రభుత్వమునుండి, స్థానికసంస్థలనుండి, ప్రజలనుండి, విరాళ రూపమున సేకరించి వెచ్చించవలసి యున్నది.

ఈ సంక్షేమసంఘ శాఖా కార్యక్రమాలతో రాట్న పరిశ్రమ, కుట్టుపని, టైపు, టెలిగ్రాఫీ మొదలగునవి నేర్పుటకై ఏర్పాట్లు చేయబడినవి.

ఈ సంస్థంకు ఇంతవరకు మొత్తము రు 50, 000-0-0లు విలువగల భవనములు, తదితర సాధనములను సంపాదించగలిగితిమి. ఈ సమాజమున జరుగుచున్న వివిధ కార్యక్రమముల నడిపించుటకు నెలకు సుమారు రు 1, 000-0-0 లు వరకు ఖర్చు అగుచున్నది. అంతియేగాక ఈ సంస్థచే యివ్వబడుచున్న వివిధ విషయముల శిక్షణను పొందుటకు పరిసర గ్రామముల నుండి వచ్చిన విద్యార్థినుల సౌకర్యమునిమిత్తమై ఒక వసతి గృహము నిర్మించుటకు తగుసహాయమును మాపేక్షింపుచుంటిమి. జాతీయాదర్శ ఆశయములతో పూజ్య బాపూజీకి అత్యంత ప్రియమైన నిర్మాణ కార్యక్రమమును యథాశక్తితో ఆచరించుచు, పాశ్చాత్య పరిపాలన ఆశని పాతములకు కృంగిపోక, జాతీయకార్య క్రమముల నాచరణలో పెట్టుచు స్త్రీల సాంఘిక, ఆర్థిక, ధార్మిక, వైజ్ఞానికాభి వృద్ధికి తోడ్పడుచు నాటి బాలసరస్వతి బాలారిష్టముల దాటి ప్రౌఢయై 1954 సం॥లో 21 వ వార్షికోత్సవము జరుపుకొన కలిగినది.

ప్రేమ చిత్రి

మూలం : వినోదశంకర్ వ్యాస్ అనువాదం : కుమారి ఎమ్. మంగతాయారు.

డాక్టరుగారు ఉన్నారా ? అని మురళీధర్ కేకవేశాడు.

ఇప్పుడే వీధిలోకి వెళ్ళారు. అని డాక్టరుగారి అమ్మాయి కిశోరి జవాబు చెప్పింది.

మురళి చూస్తున్నాడు. అతనికి మనస్సులో ఇంకేమైనా ప్రశ్న వేయాలని కోరిక కలిగింది. ఎంత సేపటికి వస్తారు ? అని మళ్ళీ అడిగాడు.

సరిగ్గా తెలియదు ఏం పని.... ?

మా అన్నయ్యకు జ్వరం వచ్చింది. ఆయనను తీసుక వచ్చి చూపిద్దామని....

మీరు మీ ఎడ్రస్సు రాసివ్వండి. వచ్చాక ఆయనకు యిస్తాను.

మురళి ఒక కాగితం మీద తన యడ్రసు రాసి కిశోరి చేతికిస్తూ— మర్చిపోరు గదా....? అన్నాడు.

ఊహూ.... అంటూ కిశోరి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మురళి దోవ పొడుగునా కిశోరిని తలుచుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. సాయంకాలం డాక్టరుగారు వెళ్ళి రోగిని చూచి మందిచ్చారు.

మురళి రోజూ రోగి పరిస్థితి చెప్పి మందు తేవటానికి డాక్టరుగారి దగ్గరకు వెళుతున్నాడు.

కొద్దిరోజుల్లో డాక్టరుగారితో బాగా చనువు ఏర్పడి పోయింది. ఆయన మందువల్ల మురళీ అన్నయ్యకు తొందరగా నయమైపోయింది. కాని కిశోరిని చూడాలని మురళీకి ఒక క్రొత్త రోగం పుట్టింది. తరచుగా ఏదో ఒక పని కోసమై మురళి డాక్టరుగారిదగ్గరకు వెడుతూండేవాడు.

పరిచయం ముదిరిన తరవాత డాక్టరుగారు తమ సజాతీయులే అన్న సంగతి మురళీకి తెలిసింది. సభ్య సమాజంలో ఉండబట్టి డాక్టరుగారి ఆచారాల్లో చాల తేడా ఉంది. ఆయనకు ఘోషా మొదలైన భేషజాల్లేమీలేవు.

మురళితో ఒక రోజు మాట్లాడిన పిదప డాక్టరుగారు తమకి వాళ్ళకి ఏదో దూరపు బంధుత్వం ఉన్నట్లు తెలుసు కున్నారు. అందువల్ల ఎప్పుడైనా మురళీ వాళ్ళింట్లో ఎవరికైనా జబ్బు అది చేసినా డాక్టరుగారు ఫీజు పుచ్చు కోవడం మానేశారు.

అప్పు డప్పుడు కిశోరి మురళీలకు కూడ సంభాషణ జరుగుతూండేది. మురళిని చూసి కిశోరి వాళ్ళ అమ్మ భవిష్యత్తును గురించి కల్పనలు చేయసాగింది.

పనిపాటలు ఉన్నప్పుడు కిశోరి- వాళ్ళ అమ్మ మురళీ వాళ్ళ ఇంటికి వెళ్ళడం- వాళ్ళు వీళ్ళయింటికి రావడం జరుగుతూండేది. పరస్పరం బంధుత్వం ఏర్పడింది. మురళియొక్క ప్రేమయే దీనంతటికీ మూలకారణం.

౨

వసంతము- వాడిపోయిన చెట్లను ఓదార్చుతూంది. ఆరోజు మురళీ పుట్టినరోజు పండుగ. మిత్రులూ, బంధు వులు అంతా వచ్చారు. కిశోరి కూడ తల్లితో పచ్చనిరంగు చీరె కట్టుకొని వచ్చింది. మురళీ కిశోరి- వాళ్ళమ్మకి స్వాగతం యిస్తూ- మీరు పైకి మేడమీదకి వెళ్ళండి, అన్నాడు. కిశోరి నెమ్మదిగా- ఇవాళ మీ పుట్టినరోజా ? అని అడిగింది.

అవును. ఇవాళ నేను ఇరవై అయిదేళ్ళవాడినయాను.

కిశోరి చిరునవ్వు నవ్వుతూ తల్లితో కలసి మేడమీదకి వెళ్ళింది.

ఆరోజే మురళీ తన ఫొటో ఒకటి డాక్టరుగారికి ప్రజంటు చేశాడు, ఎందుకంటే అప్పుడప్పుడు కిశోరి దాన్ని తన గదిలో చూస్తూండుగాక, అని దాని అభిప్రాయము.

* * *

డాక్టరు శ్యామ్ స్వరూప్ విద్యాభిలాషి. ఆయన కిశోరిని లేడీ సర్జన్ వరకు చదివించాలని నిశ్చయించుకున్నాడు. ఆయనకు బాల్య వివాహాలంటే పరమ ద్వేషము. కిశోరి 16 ఏళ్ళదైంది. కాని ఇంతవరకు గర్ల్సు స్కూలు చదువే సాగుతూంది, చదువుతూన్నది.

మురళీ కూడ చాల విశేషము ప్రజ్ఞా గల యువకుడు. అతడు ఎమ్. ఏ. చదువుతున్నాడు.

రోజు రోజుకి మురళీ కిశోరీల ప్రణయము గాఢము కాసాగింది.

ఒకరోజు మురళీ కిశోరీ దగ్గరకు వెళ్ళాడు. కిశోరి చదువుకుంటూంది. కిశోరి గదిలోకి వెడుతూ- కిశోరీ! ఏం చేస్తున్నావు ? అని అడిగాడు.

ఏం లేదు. ఊరికే పుస్తకం చూస్తున్నాను. బహుకాల దర్శనం....

కిశోరీ, ఇప్పుడే బాగుండటంలేదు. చాల నీరసంగా రోజు గడుస్తూంది.

ఎందువల్ల ?

తెలీదు.

మాటల్ని మారుస్తూ కిశోరి ఎల్లుండి హోళీ మీరు వస్తారుకదూ ? అన్నది.

ఎందుకు ? రంగు కొడతావా ?

ఉహు. ఊరికేనే వద్దురూ. పండగగా—?

సరే, వస్తాను.

3

సన్నాయియొక్క మధుర స్వరంలో మనోహరమైన హోలి పాట మొదలైంది. కొందరు డప్పులు వాయిస్తూ హోళీ పాడుతున్నారు. కొందరు తమ కర్కశ కంఠాలతో వేళాకోళాలు చేసుకుంటూ హృదయంలోని ఉల్లాసాన్నంతా వెలిబుచ్చుతున్నారు. అందువల్లనే ప్రజలు హోళీ అన్నారు.

మురళీ చక్కని మఖ్మల్ షర్టు వేసుకుని కిశోరి దగ్గరకు వెళ్ళాడు. దూరంనుంచే మురళీ రావటం చూసి కిశోరి ఒక గ్లాసెడు కుంకపు నీళ్ళు కుమ్మరించింది. మురళీ గాభరాపడి పైకి చూడటం మొదలు పెట్టాడు. ఏదో అందామనే అనుకున్నాడు. కాని ఏమీ అనలేకపోయాడు. డాక్టరు గారికి ఇవాళ గూడ తీరిక లేదు. ఆయన ఎవరో రోగిని చూడటానికి వెళ్ళారు. మురళీ ముఖం చిట్లించుకుని— కిశోరీ ఏమిటీ అన్యాయం ? అన్నాడు. కాని కిశోరి కళ్ళల్లోని చిలిపితనం- పెదవిపైని చిరునవ్వు— కాదు, ఇది అన్యాయం కాదు, అన్నాయి.

కిశోరీ ! అదేం పనే ? పగటిపూటగాని సాయంకాలం పూట ఎవరైనా రంగు కొడతారంటే ? .అంటూ కిశోరి వాళ్ళ అమ్మ మురళీకి ఫలహారం తేవటానికి వెళ్ళింది.

కిశోరి బుక్కాయి పొట్లం చేతిలో పుచ్చుకుని మురళీకి ఎదురుగా నిలబడ్డది.

చేతిలో ఏమిటి ? అన్నాడు మురళీ.

బుక్కాయి.

గోరుచుట్టుమీద రోకలి పోటంటారు దీన్నే.

అట్లా ఎందుకంటారు ?

అట్లాగైతే నువ్వు నా తరపున నీ చేతులతో ఆ బుక్కాయికాస్త ముఖానికిపూసుకో. అన్నాడు చిరునవ్వుతో మురళీ.

అప్పుడే కిశోరి వాళ్ళ అమ్మ మురళీకి ఫలహారం తీసుకొచ్చి పెట్టింది. ఇద్దరూ ఏమీ ఎరగని పసికూనల్లాగా ముఖాల్ని పెట్టారు. ఎంతో అమాయకులనిపిస్తుంది. తినిన తరవాత కొంతసేపటికి మురళీ వెళ్ళిపోయాడు.

ఎట్టి పరిస్థితిలో ప్రేమ కోసమై జనం తమ సర్వస్వాన్నీ చివరకు ప్రాణాన్నిగూడ అర్పించేటందుకు సాహసిస్తారో.... ఆ యుగం ప్రారంభమైంది.

మురళీ కిశోరు లిద్దరూ ప్రణయ నిట్టూర్పులు వదలసాగారు.

కిశోరి, మురళీ ఎదుట ఎప్పుడూ తన హృదయంలోని భావాలను ప్రకటించలేకపోతోంది. అందువల్ల అప్పుడప్పుడు ఉత్తరాలద్వారా తన హృదయంలోని గూఢ భావాలను వ్యక్త పరుస్తూంది.

చాలా రోజులు గడిచిపోయాయ్. డాక్టర్ శ్యామ్ స్వరూప్‌కు అలహాబాద్ ఆస్పత్రికి బదిలీ అయింది. వాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు. మురళీకి అప్పుడప్పుడు కిశోరీ దగ్గరనుంచి ఉత్తరం వస్తూవుంది.

ఈయేడు మళ్ళీ హోళీ పండుగ వచ్చింది. మురళీ దీనంగా తనగదిలో కూర్చున్నాడు. పోస్టులో కిశోరి దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో బుక్కాయి పొట్లంగూడ ఒకటి ఉంచి, ఉత్తరంలో— దీన్ని మీరు మీ చేతులతో తప్పకుండా పూసుకోవలసింది. అని ఉన్నది.

మురళీ ఆలోచనా ప్రపంచంలో ప్రయాణం చేయటం మొదలెట్టాడు. అతను ప్రేమ పూర్వకంగా నుదుటిమీద

బుక్కాయి పెట్టుకుంటూ— మనస్సులో— అహా! ఆ రోజులు ఎంత హాయిగా ఉండేవి? అనుకున్నాడు.

కిశోరి తన ఉత్తరంలో నేనిప్పుడు డాక్టరు పరీక్షకు వెళ్ళబోతున్నాని గూడ వ్రాసింది.

మురళి గూడ ఎమ్.ఏ. ప్యాసైనాడు. కాని రోజులు మారిపోతున్నాయి.

౪

అనేక మాసాలు గడిచిపోయినయ్. అకస్మాత్తుగా కిశోరి దగ్గరనుంచి వాళ్ళ నాన్న చనిపోయినట్లు ఉత్తరం వచ్చింది.

మురళి ఒక్కసారిగా శోక విభ్రాంతుడై ఉలిక్కిపడ్డాడు. అతడు తక్షణము అక్కడికి వెడదామనుకున్నాడు. కాని కాలేజిలో అప్పుడే కొత్తగా ప్రొఫెసరీ లభించింది. మొదట్లో సెలవంటూ దొరకటం అసంభవం. అందువల్ల తన కోర్కెను నెరవేర్చుకోలేక పోయినాడు.

మురళీధర్ యిప్పుడు ఇంగ్లీషు ప్రొఫెసరు అయినాడు. విద్యావంతుల్లో అతడు మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నవాడు.

ఒకరోజు మురళికి ఒక మిత్రుడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. దాంట్లో— ఒకానొకప్పుడు నువ్వు కిశోరిని గొప్పగా పొగిడేస్తుండే వాడివి. కాని యిప్పుడదంతా మారింది. ఇప్పుడామెలో చాల మార్పు వచ్చేసింది. వాళ్ళ నాన్న పోయి రెండు మాసాలు గూడ కాలేదు. కాని ఆమె స్వేచ్ఛగా ప్రవర్తిస్తోంది. ఎన్నో తుమ్మెదలు ఆ గులాబి పువ్వు చుట్టూ తిరుగుతున్నాయి. నీ అభిమానమంతా ఆమె మీదేనా అని!

మురళికి ఇదేమాత్రం అర్థంకాలేదు. అతడు కిశోరికి ఈ సంగతంతా తెలియజేస్తూ జవాబు వ్రాయవలసిందని కోరుతూ ఉత్తరం వ్రాశాడు. కాని కిశోరి ఏమీ జవాబివ్వ లేదు. మురళి చాల ఉత్తరాలు వ్రాశాడు. కాని ఒక్క దానికి కూడ జవాబు లేదు. చివరికి విధిలేక మురళికి కిశోరి ప్రవర్తనపట్ల అనుమానం పడవలసివచ్చింది. మెల్ల మెల్లగా ప్రేమ మీద నిర్లక్ష్యం ఏర్పడింది.

ఏడాది తర్వాత మళ్ళీ హోళీ వచ్చింది.

ఈసారి కిశోరి దగ్గరనుంచి ఉత్తరం లేదు. బుక్కాయి లేదు. మొదట్లోని ప్రణయ వాక్కులు మురళి హృదయాన్ని కలిచివేయటం మొదలెట్టాయి. చాల విచారపడ్డాడు. మురళికి ఈ హోళీ నిర్జీవంగా ఉన్నది. కిశోరిలో అకస్మాత్తుగా కలిగిన ఈ మార్పుకి మురళికి చాల ఆశ్చర్యం కలిగింది. "మీకొరకు.......చాల వేదనగా ఉన్నది. రోజులు బరువెక్కుతున్నయ్" వగైరా రాస్తూండే కిశోరి ఆరోజులు లెక్కడికిపోయినయ్. అని అతడు మనసులో చాల బాధపడటం మొదలెట్టాడు. ఒక్కసారి ఎట్లా మర్చిపోయింది? ఆహా! మానవలీల!

కిశోరి నన్ను ఒక్కసారిగా మర్చిపోయింది. ఆమెకు నా ధ్యాసే లేదు. ఎవరో నిజంగా సత్యమే చెప్పాడు. "స్త్రీలను కలలో గూడ నమ్మవద్ద" న్నాడు. నిజమే. వీళ్ళ ప్రేమ చాల విచిత్రంగా ఉంటుంది.

కొంతసేపైన తరువాత మురళి తన అలమారులో నుంచి కిశోరి వ్రాసిన పాత ఉత్తరాలన్ని తీసి తదేక ధ్యానంతో చదవటం ఆరంభించాడు. అన్ని సంగతులు తలపుకి రావటం మొదలెట్టాయ్. నిన్న జరిగినట్లుగా అవి పిస్తూంది. కాని చాల ఏళ్ళు గడిచిపోయినయ్. కిశోరి అంటే అతడికి అపరిమితమైన ద్వేషం వుట్టుకొచ్చింది. ఇప్పుడు తన పాపిష్టి కళ్ళతో కూడ (ఆమెను) చూడలేకుండా ఉన్నాడు. ఇంట్లోంచి నౌకరు వచ్చి అయ్యగారూ! హోళీ మండుతూంది. పూజకు పదండి. అన్నాడు.

మురళి కోపంగా— ఇప్పుడేం కాదు. తరవాత వస్తానన్నాడు. కిటికీలోనుంచి చూస్తే హోళీ మండుతోంది. వెంటనే బరువైన విచారంనుంచి వేరైనాడు. అతడి మనస్సులో ఒక భావన చెలరేగింది. కిశోరి వ్రాసిన ఉత్తరాలన్నిటిని ప్రోగుచేసి చింపటం మొదలెట్టాడు. ఈ ఉత్తరాలే ఒకానొకప్పుడు జీవిత సర్వస్వమున్నూ. కాని ఈనాడు వీటికి విలువ లేదు.

"సమయం సంగీతంలోని మధురమైన తానం లాగా మనోహరంగా స్ఫురించి మాయమై పోతుంది"

మురళి ఉత్తరాలన్ని చించి నిప్పంటించాడు. అప్పటికీ అతడికి తృప్తి కలగలేదు. ఇంతవరకు అతడికి ఎదురుగుండా కిశోరి ఫొటో ఉన్నది. మండుతున్న ఉత్తరాల మధ్య ఫొటోను పెడుతూ.... ఇవాళ నేను నా ప్రేమను చితిలో దగ్ధం చేస్తున్నానన్నాడు. అని అతడు ఒక నిట్టూర్పు విడిచి ఆకాశం వైపు చూశాడు.

ఆకాశమంతా హోళీ జ్వాలలతో ఎర్రబారిపోయింది. అతడి హృదయంలోని బరువు తేలికపడింది. అదే సమయంలో మురళి ఎప్పటికి స్త్రీని ప్రేమించనని ప్రతిజ్ఞ చేశాడు.

చూస్తూ చూస్తూండగా చాల నెలలు గడిచిపోయినయ్. ప్రొఫెసర్ మురళీధర్ తన గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. ఆరోజు ఆదివారము. కాలేజీకి సెలవు. ఎవరో వస్తున్న చప్పుడైంది. చూడటం మొదలెట్టాడు. క్షణంలో- కిశోరి వచ్చి ఎదట నిలబడి ఉండటం చూచాడు. హృదయం తక్ తక్ లాడింది. కిశోరి నడపడికి విస్తుపోయి చూడసాగాడు. కిశోరి నమస్కారం చేసింది. ఇద్దరూ ఒకళ్ళ నొకళ్ళు చూస్తూ ఉండిపోయారు. మురళి కిశోరిని కూర్చోమన్నాడు. కిశోరి కూర్చున్నది.

ఒకరోజు నౌకర్ని పంపి నేను యిక్కడకు వచ్చానని తెలియ జేశాను. కాని తమరు దర్శనభాగ్యం కలుగ జేయలా. అందువల్ల విధిలేక స్వయంగా నేనే వచ్చానన్నది.

నేను నీనుంచి దూరంగా ఉండాలనుకుంటున్నాను.

కాని నాకు మీయందు ఆ భావమే ఉన్నది.

కాని నీ ప్రణయ స్వరూపము నాకళ్ళ ఎదటనుంచి ఎప్పటికి మాయమైపోయింది. ఇప్పుడు నీలో ఆ నిర్దుష్టమైన సౌందర్యం లేదు. ఇప్పటి నీలో చాల వ్యత్యాసం ఉన్నది. నేను ప్రేమని ద్వేషిస్తున్నాను. నేను నా ప్రేమని చితిలో దగ్ధం చేసేశాను. అన్నాడు.

కిశోరి నిరుత్తరియై వెళ్ళిపోయింది.

బాలానందం

'కారల్ స్ప్రింజల్'

* శ్రీ అడివి కనకరాజు *

దక్షిణ జర్మనీ దేశంలో కారల్ స్ప్రింజల్ -అనే బాల వీరుడి పేరెప్పుడూ స్మరిస్తూనే ఉంటారు. అతడు చేసిన త్యాగమే దీనికి కారణం.

కారల్ తండ్రి విల్హెలిమ్. అతడొక పెద్ద లోయపై నిర్మింపబడిన రైల్వే వంతెనకి కావలాదారుగా ఉండేవాడు. ఇది 1867 వ సంవత్సరంలో జరిగిన సంఘటన.

కారల్ స్ప్రింజల్ మామూలుగా రాత్రి 9 గం॥లకు తండ్రికి భోజనం తీసుకు వెళ్తున్నాడు. క్షణంలో ఉరుములూ, మెరుపులతో బ్రహ్మాండమైన గాలివాన ప్రారంభమైంది. అంతా కారు చీకట్లు కమ్మేశాయి. కారల్ స్ప్రింజల్‌కు ఒక కాలు లేదు. ఆ గాలివానలో తండ్రికి భోజనం అందిచ్చే దీక్షతో కర్రల సాయంతో అతడు కుంటుకుంటూ సాగిపోతున్నాడు.

వంతెన దగ్గర కొచ్చేసింది. అల్లంతదూరంలో వంతెన క్రిందనున్న లోయ్నుండి— నది నీరు పొంగి పైకి వరదలుగా వస్తోంది. మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుములు ఘోషిస్తున్నాయి. అతడికిహఠాత్తుగా ఆమెరుపులవెలుగులో ఒక దారుణ దృశ్యం కనపడింది. అక్కడ వంతెనలేదు. చివరకు దాని ఆకారంకూడా మిగలలేదు. పర్వతపులోయ- ఆ ప్రవాహము మాత్రం ఎడతెగకుండా గోలపెడుతోంది.

కారల్ తన తండ్రి కూడా లోయ ప్రవాహంలో కొట్టుకు పోయాడని గ్రహించగానే చాలాసేపు ఏడ్చాడు. కాని, ఆ మరుక్షణంలోనే అతడి కొక విషయం జ్ఞప్తి కొచ్చింది. రైలు వచ్చే వేళైంది. అతడూరుకుంటే రైలు ప్రయాణీకులతోసహా లోయలో పడిపోవడం సంభవిస్తుంది. వెంటనే అతడు లేచి, తన తండ్రి ధర్మం తను నిర్వర్తించాలనుకున్నాడు. రైలు డ్రైవరుకు వంతెనపోయినట్లుగా తెలియజెయ్యాలి. అతడు దుఃఖాన్ని దిగమ్రింగాడు.

రైలంత దూరంలో వస్తోంది. హోరుమనే గాలితో కుంభవృష్టిగా వాన పడుతోంది. కారల్ వెనుదీయకుండా రైలు వచ్చే వేపుకి తన చేతిలో నున్న ఎర్ర దీపముతో కుంటుకుంటూ సాగిపోయాడు రైలు కనుచూపుమేరలోకి వచ్చేసింది. కారల్ చేతిలో లైటు ఊపుతూ— "వంతెన కొట్టుకుపోయింది, ఆపండి!" అంటూ అరుస్తూ సాగిపోతున్నాడు. డ్రైవరు కారల్‌ను చూచాడు. కాని ఆ గాలి హోరులో అతని మాటలు వినపడలేదు. రైలు వేగాన్ని ఆపలేకపోయాడు. ఇంజను కారల్‌ను ప్రక్కకు విసరివేసి కొంతదూరం సాగి- ఆగిపోయింది. డ్రైవరు దిగివచ్చి చూచాడు. కారల్ ప్రాణం పోయింది. అతని ప్రక్కనే లైటుపడిఉంది. ప్రమాదం దాటిపోయింది.

వందలకొలది ప్రయాణీకుల ప్రాణాలను కాపాడడానికి తన ప్రాణాన్ని త్యాగం చేసిన కారల్‌ను అందరూ మెచ్చుకున్నారు. అతని సాహసాన్ని పొగిడారు.

తరువాత అతనికొక సమాధి కట్టించి క్రిందివిధంగా దానిమీద లిఖించారు.

"వందల ప్రయాణీకులను కాపాడటానికి వీర మరణం పొందిన బాల వీరుడు— "కారల్ స్ప్రింజల్" వయస్సు 14 సంవత్సరములు"

(వాడుకలో నున్న కథ)

ఇసుక బెస్టు

♦ శ్రీ చేబ్రోలు సూర్యారావు ♦

౧

సంధ్యా సమయము, చల్లటివేళా ;
పక్షులు గూఢులు చేరేవేళా ;
బాటప్రక్కనాబాప డొక్కడూ ;
రజకుని కొకనికి ఎదురయ్యాడూ ;
రజకుడు బాపడు
సంభాషించిరపుడీలాగూ ;

౨

రజ : అయ్యా బాబూ దండాలండీ ;
ఎచ్చటికండీ తమరిటుబైలుదేరితి రీలాగూ ;

బా : గణితశాస్త్రమున ఘనుండనోయ్ ;
ఘనముగ, గణితము చెప్పగలనునే
ప్రక్కవూరీ ఏలికకొలువుకు బైలు దేరితినీలాగూ!

రజ : గ్గణిత శాస్త్రమున ఘనులైతే
విప్పిచెప్పుడీ నాకీ సమస్య ఒక్కటీ ;

బా : నీదుసమస్యా నాకొకలెఖ్ఖా ;
ఆయితే చెప్పర ఆ లెఖ్ఖా ;

రజ : అయ్యా ; బాబూ ; గుప్పెడయిసుకా ;
ఎంతవుండునో సెలవిస్తారా ;

బా : ఎవడు లెక్కించగలడురా ;
నీగుప్పెడుయిసుకా ;
యిదేమి ప్రశ్నర ఒట్టి
చొప్పదంటూ ;

రజ : ఇంతచదివినట్టి తమరు,
ఇందులోనె కొట్టితిరి పల్టీబాబయ్యా
గుప్పెడుయిసుకా గుప్పెడుకాక,
ఎంతవుండునో నుడువుడు,
తమరూ బాబయ్యా ;

౩

అదివినగానే బాపనిమోమూ ;
వెలవెల వెలిగిందీ ;
మన పెద్దలందురూ అందుకునే,
మిన్నగ చదివిన వానికన్ననూ ;
రజకుడు ఒకడేమేలంటూ ;

శరదృతువు

♦ శ్రీ పి. యస్. రామజోగారావు ♦

చండభానుని సూటిఎండల
నల్లమబ్బులు విచ్చిపోయాయి,
నిండుచందురు పండువెన్నెలఁ
తెల్లమబ్బులు తేలియాడాయి,
చలిపిజల్లులు నిలిచిపోయాయి ;
స్వాగతమ్ము ; శరదృతువుకి—

పగలు దసర బాణాల్ చిందిన,
పలురకాల పుష్పములె రాత్రి
నిర్మలాకసపు నక్షత్రాలై,
మంచు తెరల ముసుగులోంచి
తొంగిచూస్తూ మిణుకుమన్నాయి.

ఇంతలోనే వచ్చె, నవ్యదీపావళి ;
దివ్యశోభావళి ; దీపకళికావళి ;
నింగిపై తారకలు, భూమిపై దీపికలు,
కోట్ల సంఖ్యలో, అమావాస్య రాత్రిని
కారు చీకట్లను పారదోలాయి.

తీర్పు

కుమారి పి. సూర్యకుమారి

ఢిల్లీ సుల్తానుల పరిపాలనాకాలంలో కాజీలు అనే ఉద్యోగస్తులు న్యాయపరిపాలన కొరకు నియమింపబడ్డారు. చాలా తెలివైన కాజీ ఢిల్లీ సమీపంలో వున్న గ్రామంలో వుండేవాడు. ఆ చుట్టుపట్ల ప్రాంతంలో అతని పేరు మారు మ్రోగుతుండేది. చాల మంది ప్రజలు అతనికే తమ ఫిర్యాదులను చెప్పుకొనేవారు.

ఆవూళ్ళో బాజీ అనే యువకుడు కట్టెలమ్ముకుంటూ జీవించేవాడు అతనికి పెండ్లి కాలేదు. కొద్ది కొద్దిగా సొమ్ము నిలవచేసేవాడు. కొంతకాలానికి కూడబెట్టిన ధనం వెయ్యి రూపాలయింది. ఆ ధనంతో యేమిచేయిడమని తన ముసలి స్నేహితుడు సాహూని అడిగేడు. సాహూ కడు మోసగాడు. బాజీ వట్టి అమాయ్యకుడు. ఆ సొమ్మెలాగైనా తస్కరించాలని ప్లాను వేశాడు సాహూ.

ఆముదుసలి చాల నమ్మకంగా బాజీతో యిలా అన్నాడు "ఆ వెయ్యి రూపాయిలు నాకప్పియ్యి. రూపాయికి అర్థణా చొప్పున నెలకు వడ్డీ యిస్తాను. సంవత్సరం పూర్తికాగానే నీకు తిరిగి బాకీ తీర్చేస్తాను. ఇక్కడ మాత్రం యివ్వ వద్దు. ఎవరైనాచూస్తే కట్టెల వాడికింత డబ్బెలావచ్చింది. వీడు తప్పక దొంగతనం చేసి వుంటాడని ఖైదులో పెడతారు. అందుచేత రేపు వూరవతలున్న పెద్ద రావిచెట్టు దగ్గర నాకు రహస్యంగా యియ్యి."

సాక్షులు లేకుండా అప్పిస్తే మోసం జరుగుతుందన్న సంగతి బాజీకి తెలియదు. ముసలి సాహూ బదులు తీసుకుని నెలవారీ వడ్డీ యివ్వకపోవడమే కాకుండా సంవత్సమయ్యేక తన కప్పే యివ్వలేదని అసత్యమాడి బాజీ తన యింటికి వచ్చి బాకీ అడిగితే, కసిరి తరిమివేసాడు.

బాజీ మొత్తో యంటూ కాజీ వద్దకుపోయి తన సంగతి ఫిర్యాదు చేసుకొన్నాడు. న్యాయాధిపతి మోసగాడైన ముసలి సాహూని పిలిపించి, కట్టెలవానితో యిట్లన్నాడు "నీకు సాక్షులెవరైనా వున్నారా?" "లేరు ప్రభూ!" అన్నాడు బాజీ. "అయితే నీ వెయ్యి రూపాయిలు పోయినట్లే. రుజువు లేదంటే తీర్పు జరగదు" అన్నాడు న్యాయమూర్తి. బాజీ మిక్కిలి దుఃఖిస్తూ అన్నాడు "కాయ కష్టపడి కడుపునిండా తిండి తినకుండా కూడబెట్టాను. న్యాయం విచారించండి ప్రభూ" కాజీ కొంచం ఆలోచించి. "ఎక్కడ వాని కప్పిచ్చేవు" అని అడిగేడు" "వూరవతలున్న పెద్ద మఱ్ఱి చెట్టు క్రింద" అన్నాడు బాజీ. న్యాయపతి అది నిజమేనా అని సాహూ నడిగేడు. తిరుగు ఆలోచన లేకుండ బాజీ చెప్పింది సుద్ధ అబద్ధమని, ఆ చెట్టెక్కడున్నది తనకు తెలియదని చెప్పేడు. దేవుడు సాక్షిగా తాను చెప్పింది సత్యమని బాజీ మొరపెట్టుకున్నాడు "అట్లయితే ఆవృక్షాన్నిక్కడకు సాక్ష్యానికి పిల్చుకురా" అన్నాడు కాజీ. ఆ కట్టెలవాడాశ్చర్యంతో "ప్రాణంలేని వృక్షమెలా వస్తుంది" అన్నాడు. "నేను రమ్మన్నానిచెప్పు" అన్నాడు న్యాయాధిపతి. "మాగొప్ప తెలివైనవాడిలావున్నాడే కీర్తిమంతుడైన కాజీ" అనుకున్నాడు ముసలివాడు.

బాజీ వెళ్ళిన తరువాత న్యాయమూర్తి సాహూనిలా అడిగేడు. "బాజీ యీ సమయానికెంత దూరంలో వుంటాడని నీ వుద్దేశం?" ఆసమయానికి సాహూ పరాకుగా వున్నాడు; "సగం త్రోవలో వుండొచ్చు" అన్నాడు. కొంతసేపటికి బాజీ తిరిగి వచ్చేడు. "తమ ఆజ్ఞ చెట్టుకి చెప్పుకున్నాను. ఆ చెట్టు నామాటలు విని రాలేదు" అని చెప్పేడు అమాయకుడైన బాజీ దుఃఖంతో. "చెట్టే స్వయంగా సాక్ష్యమిచ్చింది. విచారించకు బాజీ" అన్నాడు కాజీ. సాహూ గాభరాపడి "నేనిక్కడే వున్నానుకదా, నాకగుపడకుండా సాక్ష్య మెలాగచెప్పింది?" అని అడిగేడు. న్యాయాధిపతి యిలా అన్నాడు. "ఆవృక్షమిక్కడికి రాలేదు. నీనోటిద్వారా సాక్ష్యం పలికింది. నీకాచెట్టుసంగతి తెలియకపోతే బాజీ సగం త్రోవలో వుంటాడని యెట్లా చెప్పగలిగేవు. కనుక ఆచెట్టుక్రింద నువ్వు ఆ వెయ్యి రూపాయిలు బదులు పుచ్చుకున్నట్లు రుజువైంది. బాజీకి వడ్డీతోసహా అప్పు తీర్చలేకపోతే పది సంవత్సరాలు జైలు వుండాలి." కాజీయొక్క తీర్పు ప్రకారం సాహూ మారుమాటాడలేక చచ్చినట్టు అప్పు తీర్చేడు. కాజీ తెలివికీ న్యాయానికీ అంతా ఆనందించేరు.



ఆమె రూపచిత్రం

ఎల్. ఎం. బాబూరా

నల్లద్దాలు పెట్టుకొని
నీలిచీర కట్టుకొని
రాయపేట వైపు
రిక్షాలో పోతున్న
ఆ అమ్మాయిని నేను
అయిదు నిముషాల కాలం
నాలుగు రోడ్ల మొగలో
నిలబడి చూచాను.
మొగము చంద్రబింబము
ముక్కు బంగారు గవిసె
పెదవులు గులాబి రేకులు
పాదములు పద్మరేకులు
అందంగానే ఉందికాని
తాను కట్టిన నీలిచీరకు
తగిన జాకెట్టుకాదు.

లేత నీలి చీరె మీద
ముతక ఎరుపు జాకెట్టు
ఎందుకు కట్టిందో కాని
అంత బాగుండలేదు.
అందుకే ఆమెవైపు
అయిదు నిమిషాలు చూచాను.

*　　　*　　　*

ఒక సాహిత్య సభలో
ఒక స్నేహితుడు కనబడి
అచ్చువేసిన ఎడ్రసు యిచ్చి
అక్కడకు వెళ్ళమన్నాడు
అతను చెప్పిన ప్రకారం
ఆయింటికి వెళ్ళాను

ఆ యింటిముందు పూలతోట
గేటుదగ్గర కుక్కపిల్ల
"బౌవ్" మని లేచింది.

పనిమనిషి ఎదురు వచ్చి
లోపలకు తీసికెళ్ళింది.
లోపల హాలులో
నల్లద్దాలు పెట్టుకొన్నామె
వాలు కుర్చీలో ఉంది
అక్కడామెను చూసి
ఆశ్చర్య పోయాను నేను
"ఎవరమ్మావారు ? " అడిగిందామె
ఎవరో నాన్నగారి కొరకు !
జవాబు చెప్పిందీమె.

పైకి వెళ్ళాము మేము
పరుపుమీద ముసలాయన
పలకరించి అడిగాడు
"ఎవరు నాయనా నీవు ?
ఏమికావాలి చెప్పు"
నేను దగ్గరగా వెళ్ళి
నేనెవరినో చెప్పాను.

ఆయన సంతోషంతోలేచి
ఛాయా చిత్రం ఒకటితెచ్చి
ఇది మాఅమ్మాయి ఫొటో
ఇది చూచి అందంగా
పెద్ద చిత్రం చిత్రించు
అద్దంముందు తగిలించాలి
అంటూ ఆ ఛాయాచిత్రం
ఆయన నాకిచ్చాడు.

ఆమె రూపచిత్రం

నెలరోజుల తర్వాత
తైల వర్ణములతో
ఆమె రూపచిత్రం
అందంగా చిత్రించాను
లేత నీలిరంగు చీర
ముతక నీలిరంగు జాకెట్టు
మామిడిపిందెల డిజైను
ముచ్చటగా ఉన్నాయి.

మల్లె మొగ్గల దండలు
రెండు వరుసలలో మడిచి
కుడి జడనుండి వేసి
ఎడమ జడకు తీసి
కృష్ణానది బ్రిడ్జిలాగ
కలిపి చిత్రించాను.
మెడలో చంద్రహారం
ముక్కులో నక్షత్రం
చెవులకు జూకాలు
చక్కగానే ఉన్నాయి.

నొసటమీద తిలకం
దోసగింజలాగ దిద్ది,
ముక్కుకు ఎడమవైపు
బుగ్గమీద పుట్టుమచ్చ
తేనెరంగులో చక్కగా
తూలికతో అద్దాను.

చిత్రం పూర్తి చేసి
చట్రానికి బిగించాను
మరునాడు ప్రొద్దుటే
ఆరుగంటలకు వెళ్ళి
ఆయనకు చూపించాను.


అద్భుతంగా ఉందనిమెచ్చి
ఆనందంతో ఆమెను పిలిచి
అమ్మాయీ! నీ బొమ్మ
అచ్చు నీలాగే ఉంది
నీ నీలిరంగు చీర
నీ హారంలో తార
ఎంతో బాగున్నాయి
సంతోషంతో ఆయన
వర్ణముల గురించి
వర్ణించి చెప్పాడు.

ఆమె మౌనంగా కూర్చొని
ఆలోచిస్తోందేమిటో!
ఆమె రూపచిత్రానికి
అద్దిన రంగులు చూచి
ఆశ్చర్యపోతుందని తలచి
ఆమెతో అన్నాను నేను
నల్లద్దాలతో చూస్తే
నాలుగు రంగులూ సరిగా
కంటికి కనబడవు.
కళ్ళద్దాలు తీసి
ఓపికతో నెమ్మదిగా
ఒక్కసారి చూడండి.

ఆమె నామాటలు విని
ఆమె తల పైకెత్తి
"నాకెందుకు బొమ్మలు
నాకెందుకు రంగులు"
అంటూ ఆమె మెల్లగా
కళ్ళజోడు తీసి
బల్లమీద పెట్టింది.

నల్లద్దాలు తీయగానే
తెల్లబోయాను నేను
అసలుసంగతేమిటంటే
ఆమె అంధురాలు.





చెక్కిళ్లు

అద్దాల్లాంటి చెక్కిళ్ళు అంటూ వర్ణిస్తారు. నిజానికిదెంత మాత్ర మతిశయోక్తి కాదు. కొంచెం శ్రద్ధతీసుకొంటే ఆ ఉపమానమును సార్థకము చేయవచ్చును. కొంత మంది చెక్కిళ్ళుదీపకాంతిని ప్రతిబింబిస్తాయి. అదివారిఅదృష్టాన్నే కాకుండా వారి శ్రద్ధనుకూడ నిరూపిస్తుంది. దీని కోసం అట్టే అవస్థపడనక్కర్లేదుకూడ. రోజు కొక పావుగంట శ్రమపడితేచాలు.

ఈ చెక్కిళ్ళ అందం అనేక రకాలుగా ఉంటుంది. కొంతమందికి పెద్ద బుగ్గలుండటము వలన అందముగా కనిపిస్తారు. మరికొందరు మామూలుగా ఉన్నాకూడ బాగా కనిపిస్తారు. అయితే ఎవరికైనా కూడ ఎత్తు చెంప ఎముకలుండటము అందానికీ, ఆకర్షణకి సూచన. అలాలేక పోతే అందమే లేదా అనవచ్చు. అలాఅనికాదు. కాని ఒక వింత అందము ఈ ఎత్తు చెంపఎముకల వలన కలుగుతుంది. ఇలాంటి చెంపలున్నవాళ్ళు నవ్వినా, మాట్లాడినా ఆకర్షణీయముగా ఉంటుంది. ఈ చెంపల అందమును కొంత ప్రయత్నము వలన పొందవచ్చు. అది ఏమంత కష్టము కూడకాదు. రోజు ఉదయమున నాలుకను, (ఈనె తీసేటప్పుడు మడిచిన తమలపాకులాగ) మడిచి గాలిని నెమ్మదిగా లోపలికి పీల్చుకొని ముక్కుద్వారా వదిలితే కొద్దిరోజులలో చెక్కిళ్ళ అందము పొందవచ్చును. ఇలా రోజుకి ఐదునిముషాలనుంచి పదిహేను నిముషాలవరకు చేయవచ్చును. అయితే నెమ్మది నెమ్మదిగా ఎక్కువ చేయాలికాని ఒకే సారి పావుగంట చేయకూడదు. ఇలా చేయుట వలన త్వరగా కాకపోయినా కొన్నాళ్ళకైనా అందమైన చెంపలను పొందవచ్చును.

ముఖ్యంగా ఈ చలికాలములో ముఖాన్ని జాగ్రత్తగ కాపాడుకోవాలి. ఏమాత్రం అశ్రద్ధ వహించినా ముఖము పగిలి కొన్ని సమయములలో రక్తము కారుటకూడ జరుగుతుంది. అయితే ఈ కాలములో ముఖానికి పౌడరు ఉపయోగించటము తేలిక. స్నోరాసి, దానిమీద కొంచెముగ పౌడరు రాస్తేచాలు. ఎక్కడికెళ్ళినా, ఎంతసేపు తిరిగినా జిడ్డుకారకుండ హాయిగఉంటుంది. ప్రొద్దుటపూట అయితే పౌడరు రాయక పోవటమే మంచిది. స్నోమాత్రం రాస్తే చాలు. ఈ స్నో సువాసన వంటికి తగులుతున్న చల్లని గాలితో కలిసి హృదయానందం కలిగిస్తుంది.

ఇక చలికాలములో చర్మాన్ని కాపాడట మెలాగో చూతాము. చాలతేలికైన పని, మంచిపని అయినది - నూనెను రెండుపూటలా ముఖమురుద్దు కొనేముందు మెరుగుగా రాసి రుద్దటము. ఇలా రుద్దటం చాలమంచిది. దీనివలన రక్తము సరిగాపారి మొటిమలు మొదలగునవి రాకుండా ఉండటమే కాకుండా ఎర్రని చెంపలు వస్తాయి. ఈ ఎరుపురంగు బుగ్గలకు ఎంతో ఆకర్షణను కలిగిస్తుంది.

తర్వాత ఓపికను, కాలాన్ని వుపయోగించి చేసేవి చాల వున్నాయి. అందులోకొన్ని ప్రయత్నించుదాము. మామూలుగా ఉపయోగించే పద్ధతి కోల్డ్‌క్రీమ్‌ను రుద్దటము. దీన్ని కొద్ది కొద్దిగా వేలితో తీసికొని చెంపలమీద, ముక్కుమీద, నుదురుమీద, గడ్డంక్రింద, కంటి రెప్పలమీద పట్టించిన తర్వాత నెమ్మదిగా వేళ్ళతో రుద్దాలి. ఒక పావుగంట ఇలా రుద్దినతర్వాత Facial Tissue తోనో, దూదితోనో లేకపోతే తెల్లని గుడ్డతోనో మెల్లిగా పైన మొదలు పెట్టి ముఖమంతా ఉన్న క్రీమ్‌ను తుడవాలి. ఇలా తుడవటము వలన మన్ను ఏమైన ఉంటే వచ్చేస్తుంది. దానిపైన మళ్ళీ కొంచెం కోల్డ్‌క్రీమ్‌ను తీసుకొని పై పైన రాసుకొని కొంచెము సేపైన తర్వాత ముఖం సోపుతో రుద్దుకోవటము మంచిది. దీన్ని రాత్రులు పడుకోనేముందుపయోగిస్తే బాగుంటుంది. తెల్లవారి లేచేటప్పటికి మెత్తగా, మెరుపుగా ఉంటుంది. రాత్రులుపయోగించే టట్టైయితే మర్నాడు ప్రొద్దున సోపుతో రుద్దుకోవటం మంచిది. చాలసేపు క్రీమ్ చర్మాన్ని అంటుకొని ఉండి బాగ పని చేస్తుంది.

మనవాళ్ళు చేసేది గసగసాల పద్ధతి. ఇది చౌకకి చౌక, ఉపయోగమూ అంటే కోల్డ్‌క్రీమ్ కున్నంత ఉంటుంది. స్పూన్ కొలతతో అయితే ఒక టీ స్పూనెడు గసగసాలను తీసుకొని కొద్దిగ నీళ్ళుజల్లి సన్నికెలమీద కాటుకలాగ మెత్తగ నూరి స్నానానికి ముందు ప్రొద్దుట ముఖమంతా మందంగా పట్టించేసి పది నిముషాల తర్వాత స్నానము చేస్తే ముఖమెంతో మెరుపుగ ఉంటుంది. దీనిలో కస్తూరి పసుపును కలిపి ఉపయోగించటముకూడ మంచిది. ఇది ఏ రోజు కారోజు నూరుకోవాలి. దీనివలన ముఖము మీదున్న ఎటువంటి మచ్చలైన మరుగుపడి పోతాయి.

ఇలాంటి మచ్చలెక్కువగా ఉండేట్లయితే తీపి పదార్థాలను తినటము తగ్గించాలి. తర్వాత ప్రొద్దుట కాఫీకి ముందు ఒక గ్లాసెడు నారింజరసమో, బత్తాయి పండ్లరసమో తీసికోవటము వలన త్వరగా మచ్చలు పోతాయి. ఈ పండ్లరసము ఒంటికి పడకపోయినట్లయితే రోజులోపల ఎప్పుడో ఒకసారి కొద్దిగ తీసికొంటేచాలు. కాని మొండిగా మాత్రం తీసికోన కూడదు.

ఈ పండ్లమీది చర్మమువత్తితే రసము వస్తుంది. ఇది కండ్లలో చిందుతే మండుతుంది. కాని ముఖానికి రాసుకొంటే మొటిమలను రానీయకుండా చేస్తుంది.

ముడతలు పడినట్లు కనుక ముఖముంటే ప్రత్యేక శ్రద్ధ తీసికోవాలి. అలాంటప్పుడు కోడిగ్రుడ్డు లోపలి తెలుపు పదార్థాన్ని బాగ నురుగు వచ్చేటట్లు చిలకరించి దానిని ముఖానికిరాసి కాసేపుంటే ముఖపు ముడతలు పోతాయి. ఇలా వరసన వారం పదిరోజులు చేయాలి. ప్రతిరోజు ముఖాన్ని రుద్దుకోనేముందు పసుపును బాగ రాసుకొంటే మంచిది.

తర్వాత చలికాలములో సోపు నుపయోగించటము తగ్గించి సీకాయను వాడటం శ్రేయస్కరము. ఈ శీకాయి పొడిలోనే కొద్దిగ పసుపు, నూనెవేసి కలుపుకొని దానితో రుద్దుకోడము చర్మానికి మంచిది.

క్రీమ్‌లుగాని, నూనెగాని వాడేటప్పుడు చెంపలమీద చిన్న చిన్న సున్నాలులాగ వేళ్ళనిత్రిప్పుతూ రుద్దటము వలన ఫలితము బాగా కనిపిస్తుంది. పై వానిలో ఏదికూడ చేయటానికి సాధ్యము కానప్పుడు తేలికైనపద్ధతి, పొడిగా ఉన్న సోపుముక్కతో తడిలేని ముఖాన్ని రుద్దితే పై వానికికలిగిన ఫలితము కలగకపోయినా పర్వాలేదనిపిస్తుంది. రాత్రులు రుద్ది పడుకోవటం మంచిది. తెల్లవారి లేచి ముఖాన్ని ముందు గోరుచన్నీళ్ళతో బాగాకడిగిన తర్వాత సీకాయితోగాని సోపుతోగాని రుద్దుకొంటే ముఖము మెత్తగ ఉంటుంది. ప్రయత్నించి చూడండి మీ బుగ్గలు ఎర్ర గులాబి పువ్వులనిపించు కోండి.



చిన్న మొత్తములలో నిల్వ సేకరణ-

ఆంధ్ర మహిళా సభలో కార్యాలయము.

చిన్న మొత్తముల నిల్వలు ప్రోత్సాహించి, ప్రభుత్వమువారి పంచవర్ష ప్రణాళికకు తోడ్పడు స్త్రీల ఉద్యమములో ఆంధ్రమహిళాసభ సభ్యురాండ్రు ఎక్కువగా తోడ్పడవలెనని నిశ్చయింపబడినది. ఇందు కొరకై, ఆంధ్రమహిళా సభ ఆవరణలో ఒక ప్రత్యేకమైన కార్యాలయము ఏర్పరుపబడును. ఇందు దైనిక కార్యక్రమాన్ని నిర్ణయించి, స్త్రీ సామాన్యములో యీ ఉద్యమాన్ని గూర్చి ప్రచారం చేయుటకు, నిల్వచేయదలచినవారికి తగు సలహానిచ్చుటకు, సభ తరపున కొందఱు యువతులు నియమింపబడుదురు. ఈ ఉద్యమంలో ఒక ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించి, ధనము వసూలు చేయుటకు భారత ప్రభుత్వమువారు, ఆంధ్ర మహిళాసభకు అధికారమిచ్చియున్నారు. సభకు వచ్చిగాని, పోస్టు ద్వారాగాని అన్ని వివరములు తెలిసికొనవచ్చును.

ఇంకొక విషయము— మీరు కొనదలచిన సేవింగ్సు సర్టిఫికెట్లు సభ ద్వారా కొన్నయెడల సభకు 1¼% కమీషను వచ్చును. ఈ కమీషను సభయొక్క కార్యకలాపాలకై వినియోగించుకోవచ్చును. అందువల్ల మీరు నిల్వ చేయదలచిన మొత్తమునకు సభద్వారా సర్టిఫికెట్లు కొన్నచో, సభకు కూడా సహాయము చేసినవారగుదురు.

ఉత్సాహ వంతులైన సోదరీమణులు, యింత వరకూ సభద్వారా నిల్వ సర్టిఫికెట్లు తీసుకున్న మొత్తము రమారమి రూ. 33,800/- ఇందు మూలముగా సభకు వచ్చిన కమీషను రూ. 423/- ఇంకా పెక్కుమంది సోదరిమణులు యీవిధముగా సభద్వారా సర్టిఫికెట్లుకొని సహాయ పడవలెనని కోరుచున్నాము.


టి. జి. హైమవతి,
ఆర్. లక్ష్మి.

విజ్ఞప్తి

ఆంధ్రుల ఆదరాభిమానములనందుచు, అల్లారు ముద్దు బిడ్డగా పెరుగుచు 11 ఏళ్ళ ప్రాయమునకు వచ్చిన 'ఆంధ్ర మహిళ' డిశంబరు నెలలో ప్రత్యేక జన్మదిన సంచిక ప్రకటింప నుద్యమించినది. నవంబరు నెలాఖరుకే పత్రిక వెలువడును.

చందా దారులు—పాఠకులు, రచయితా— రచయితలు, పెద్దలు-పిన్నలు చక్కటి వ్యాసములు, పద్యములు, కథలు, నాటికలు, ట్రమీలు, చిత్రములు, వగైరాలు- స్త్రీలకు, పిల్లలకు విజ్ఞాన-ఆనందదాయకములగునవి ఏ శీర్షికతోనైనను వ్రాసి వీలైనంత త్వరలో పంపగలరని ప్రార్థన.

వేరు వేరుగా అందరిని కోరుట సాధ్యము కానందున యీవిజ్ఞప్తి గావించుచుంటిమి.



పెద్దలు ఒక శ్లోకం చెప్పేరు. జ్ఞాపకముందా ? 'అసలే కోతి, కల్లు త్రాగింది, ఆపైె పిచ్చి ఎత్తింది. ఆమీదట తేలు కుట్టింది' ఆ కోతికి కొబ్బరికాయకు బదులు కొరివి చేతికి దొరికిందని మనం అనుకోవచ్చు. అలాగు అసలే అహంకార మమకార పూరితుడైన మానవునికి రంగు-మతభేదాల గంగవెర్రులెత్తేయి ; కోలనీలపిచ్చీ, శాస్త్ర పిచ్చీ బాగా ఎక్కింది. ఆపైె, నాచేతిలో ఆటంబాబు ఉన్న దన్న స్వాతిశయం బలిసింది. అభ్యుదయ లక్షణాలని అతడనుకుంటున్నాడు, వినాశకాలబుద్ధులని మనలో విజ్ఞాను లనుకుంటున్నారు. ఏవేళప్పుడు ఇది ఆత్మ వినాశానికి పర పీడనకు దారితీస్తుందోనని దిక్కు-తుచూస్తూ మార్గాంత రాలు ఆలోచిస్తున్నారు.

ఇది శాస్త్రయుగం అనీ, భగవత్సృష్టిని నాశనం చేయగల ఆటంబాంబు నిర్మించేననీ, మానవుడు నవ-నాగరికతా- వ్యామోహనా- వివశుడైపోయి, కళ్ళు నెత్తి కెక్కి- వ్యవహరించేటప్పుడు, ఈక్రింది హంశాలు నెమరు వేస్తే, మద్యపానమత్తుకు గంజి విరుగుడు లాగున కొంత పని చేయవచ్చును.

భూగోళం చరిత్రలో మానవుని పుట్టుక చూస్తే- 70 ఏళ్ళ పురాతనపుటింటిలో 3 రోజుల క్రితం పుట్టిన పసిబాలు డీతడని తన శాస్త్రమే చెపుతుంది. ఇతడు 'నాగరీకుడ'నదగ్గ కాలం, విద్య-కళలు-శాస్త్ర పరిశోధనలు గావించినకాలం, 5 నిమిషాలు క్రిందటనే. ఇంతలోనే ఇంతటి మహత్కార్యాలూ, మారణయంత్రాలూ చేయ గలిగేనని విర్రవీగడం పిల్లల ప్రగల్భంలాగే ఉంటుం దేమో. అనంత విశ్వంలో మొన్న మొన్ననే ఒక చిన్న గోళం మీద పుట్టిన శాస్త్ర పాపాయికి తెలియవచ్చిన వాటి కంటె తెలుసుకోవలసిన హంశాలే ఎక్కు-వుంటాయని, కొంత స్వాతిశయం తగ్గించుకోవడం మంచిదేమో తమ లోనే నిజమైన శాస్త్రజ్ఞులు ఎలాంటి భావాలతో వినమ్రులై యుండేవారో చూచుకోవడంకూడ కొంత మంచి చేస్తుంది: న్యూటన్ మేధావి లాంటివాడు— "సముద్రపు టొడ్డున నున్న గులకరాళ్ళల్లో ఒక రాయిని తీసి పరీక్షించి ఆశ్చర్య పోతూ ఆడుకొనే అబ్బాయిలాంటివాణ్ణినేను— అతని కెంత తెలుసో నాకూ అంతే తెలుసు ననుకొంటున్నాను" అని ఎందుకన్నాడో కొంత ఆలోచించడం మంచిది. సోక్రటీస్ లాంటివాణ్ణి— "మిమ్మల్ని ప్రపంచానికంత టికీ తెలివైనవార"ని ఎందుకంటున్నారు ? అని ప్రశ్నిస్తే- "ఇతరులు తమకెంతో తెలుసునని చెప్పుకొనే ప్రపం చంలో— నాకేమీ తెలియదన్న సంగతి నాకు తెలుసును గనుక" అని ఎందుకన్నాడో కొంత పర్యాలోచించడం మంచిది. "నీకు చదివిందీ-చదవన్దీ, ఒక్కు-లాగే నున్న ప్పుడు నీవు చదువు మానివేయవచ్చు"నని భారతీయ పండితుడొకాయన అన్నాడట ; ఆలా ఎందుకన్నాడు చెప్మా ? బహుశా అలాగు సర్వజ్ఞుడికైనా ఉంటుంది- లేక శుద్ధ శుంఠకైనా ఉంటుందనిలావుంది ; అంటే ప్రాచ్య విజ్ఞులుగాని, పాశ్చాత్య శాస్త్రజ్ఞులుగాని ఇలా వున్నారని కాదుసుమండీ శాస్త్ర పాపాయికి సర్వజ్ఞత్వం యింకా రాలేదనీ, తెలుసుకోవలసిన అసలు విషయాలు అనేకం ఉండొచ్చు- ఉన్నాయి అనీ, అతడి విజ్ఞాన నేత్రం ఇంకా పూర్తిగా విడువలేదనీ అనుకుంటే సత్య దూరం కాకపోవచ్చు.

……విడ్డూరాలు……

మానవలోకాన్నే తగులబెట్టగలశక్తిని సృష్టించగలిగారని శాస్త్రజ్ఞులు అనుకోవచ్చు. కాని మన 'విజ్ఞానం' యింకా శైశవావస్థలోనేవుంది.

● ఎక్స్‌రే కళ్లు :— హిందూదేశ వాసి, 'కుడాబేక్స్' అన్న ఆయన కళ్ళకు పిండిపట్లూ వాటిపై గట్టిగా గంతలూ కట్టించుకుని పుస్తకాలు చదువుతాడు. వస్తువుల్ని ఆనవాలు కడతాడు. బిలియర్డ్సులాంటి ఆటలాడతాడు. సైకిలు తొక్కుతాడు. ఆఖరికి మంచి జనసమ్మర్దంగల బస్తీల్లో కారు నడుపుతాడు ! ప్రొఫెసర్ సి.ఇ.యం. జోడ్‌గారి అధ్యక్షతను శాస్త్రజ్ఞుల బృందం ఒకటి 'కుడాబేక్స్' గారి కనుదృష్టిని తెగ పరీక్షచేసి విడిచిపెట్టింది. ఐనా, ఈ ఎక్స్‌రే కళ్ళ రహస్యం ఏమిటో తేలలేదు.

మరో ఎక్స్‌రే కళ్ళ ఆతడున్నాడు. దక్షిణాఫ్రికా నివాసి, పీటర్ వాన్ జార్స్‌వెల్డ్ సామర్థ్యం ప్రపంచ ఖ్యాతి నందింది. దక్షిణ రొడీషియాలో కొన్నేళ్ళక్రితం వానలులేక క్షామం వచ్చింది. అప్పటికి పీటర్‌కు 14 ఏళ్లు. భూగర్భంలోనున్న నీటిని తాను "చూడగల"నన్నాడు. అది ఉన్నచోట బోరింగు ఎక్కడ వేయాలో కూడ చెపుతానన్నాడు. రొడీషియా ఉద్యోగులు 'అతని ప్రగల్భా లేమిటో చూద్దామని అవకాశం యిచ్చేరు. పీటర్ ఒక చోటు చూపిస్తే— బోరింగు మొదలెట్టేరు. 60 అడుగుల లోతు కెళ్ళే సరికి నీరు పడింది. అంతా ఇంతా కాదు, గంటకు 2 వేల గేలన్ల నీరు ఇవ్వగల బోరింగు అది !

● రేడియోమెదడు :— 1942 నాటి సంగతి. యునైటెడ్ స్టేట్సులో ఓహియోలో క్లీవ్‌లాండ్ హాస్పిటల్లో మొగోవ్‌స్కీ అన్న ఆయన ఉన్నాడు. తనకు రోజంతా సంగీతమూ కంఠస్వరాలూ వినబడుతున్నాయని పితూరీ చేసేడు. మొదట్లో అతడేదో మతిభ్రమవల్ల బాధపడుతున్నాడనుకున్నారు ; కాని కొంచం విశదంగా పరీక్షచేసే సరికి— అతడ మెదడు నిజంగా రేడియో బ్రాడ్‌కాస్టను అందుకుంటూ ఉందని తేలింది ! శబ్దం చొరని గదిలో పెట్టి మూస్తేకూడా క్లీవ్‌లాండ్ రేడియో ప్రకటనను ఒక్కమాట తు.చ. తప్పకుండా ఏకరువు పెట్టేడు. అతడి రేడియో బుర్రవల్ల గట్టి చిక్కేర్పడింది. "స్విచ్ ఆఫ్" చేయగల సామర్థ్యం అతనికి అలవడలేదు ! అతడి అవస్థ నివారణకు కొన్ని ప్రత్యేక లోహపుకట్లు అతని బుర్రచుట్టూ అమర్చవలసి వచ్చింది. ఈవిడ్డూరపు బుర్రను గూర్చి శాస్త్రానికేమీ తెలియలేదు.

● ఆకలినిజయించే శక్తి :— అన్నింటికంటే ఆశ్చర్యకరమైన వింత ఏమిటంటే: కూర్గు నివాసి, ధనలక్ష్మి అనే 18 ఏళ్ళ అమ్మాయి ఉంది. 18 మాసాలుగా ఏమీ తినలేదు. డాక్టర్లు ఆమెను పరీక్షించి— పరిపూర్ణారోగ్యవంతురాలుగా ఉంది అన్నారు. ఆమె కేసు ఇండియా ప్రభుత్వం వారి దృష్టి నాకర్షించింది ; బెంగుళూరు జనరల్ హాస్పిటల్ లో ఆమె చాలా కాలం పరీక్షలో ఉంచబడింది. తిండి లేకుండా బ్రతుకగలిగే రహస్యం ఎక్కడుందో డాక్టర్లకు ఏమీ ఆచోకీ దొరకలే ! "బహుశా ఆమెలో కొన్ని గ్రంథు లుండవచ్చు ; అవి సూర్యరశ్మినుంచి శరీర వ్యాపారానికి కావలిసిన శక్తిని గ్రహిస్తూ ఉండవచ్చు" నన్నారు !

● జీవితశక్తినిచ్చే సామర్థ్యం :— పెర్షియాలో ఒకామె ఉంది. ఆమె వేటినైనా శిథిలమైనవి రాలిపోకుండాచేయ గలదు. ఆమె తాకిన పూలు, వాడిపోకుండా రోజులకొద్దీ అట్లేఉంటాయి. ఇది మంత్రాలు- తంత్రాలు- పూర్వపు బ్లాక్ మేజిక్ **(Black magic)** లా గుంది !

● ఆడితప్పని జోస్యం :— 1931 లో 'వార్సా' మెటాఫిజికల్* ఇన్‌స్టిట్యూట్ వారొక పోలెండ్ దేశపు కర్షక యువతి సంగతి రిపోర్టు చేసేరు. ఆస్పత్రుల్లో రోగుల్ని చూచి, ఇక రెండు రోజులకు మరణించే కేసులు చెప్ప గలిగేది. ఆమె చేసే పరీక్ష ఏమిటంటే— రోగిమీదకు వంగి వాసన చూడ్డం ! "చావు రాబోతుంది అంటే— అదొక విధమైన వాసన వేస్తుంది" అనేది.

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో జర్మన్ సేనలో మరొక పోలెండ్ దేశవాసికికూడ ఇలాంటి శక్తే ఉండేది. "రోగినుంచి ఒక విధమైన వాసన వచ్చిందంటే ఇక అతణ్ణి చావు కేసుల జాబితాలో చేర్చవచ్చు" అనేవాడు. అతడి జోస్యం నిజమేనని డాక్టర్లు ఋజువు బలికేరు. ఐతే— ఈ చావుల జోస్యం—ఎవరికీ కావలసివచ్చేదిగాదు.

* "మెటా ఫిజిక్సు" అంటే **It is like the search of a blind man in a dark room for a black coat which is afterall not there"** అని ఒక పాశ్చాత్తుడు వివరించేడు. మనం దాన్ని మెట్ట వేదాంతం అనుకొని, "ఒక చీకటి కోణంలో, అసలు అక్కడ లేనటువంటి నల్ల కోటును గురించి గ్రుడ్డివాడి తడుముకోట" అని చెప్పుకోవాలి. అంటే శాస్త్ర పరిశోధన అలా ఉంటుందనిగాదు సుమండీ అలా అంటే. ("జగన్మిథ్యా బ్రహ్మసత్యం" అనే 'పిచ్చి' భారతీయుడు ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఇంకా ఎవరైనా ఉంటే), అతడిపై ఆటం బాంబులు ప్రయోగించి శాస్త్రజ్ఞుడు తన మజా చూపించ

గలడు ఈరోజున. పెద్ద పెద్దలు బహు ఓర్పుతో గమనిస్తున్నారు— ఈపద్ధతి అతణ్ణీ తోటివార్నీ ఎక్కడకు తీసుకువెళ్ళ గలుగుతుందోనని. చంద్రలోకంలోకైనా తీసుకువెళతానంటున్నాడు మరి! ఈపద్ధతిని 'చంద్రలోకం' కాకపోయినా 'మరోలోకం' లోకైనా మనలను అందర్నీ జేర్చడం తథ్యం అని విజ్ఞులు విస్తుపోయి మార్గాంతరాలు అన్వేషిస్తున్నారు !

('హిందూ'లో రేల్ఫ్ మిడ్లిటన్‌గారి వ్యాసంనుండి)

★ విశ్వరహస్యం ★

• రామ్‌చంద్ •

నాకనులేదెప్పుడు
నడయాడుతు
కదులాడే
ఈ ప్రవాహమెపుడు ఆగిపోవునో ?
ఘూన భోంత రాశాలను
అంటి పెట్టుకుని
ఉల్లలాడే
ఈ వాయుదేవుని కుప్పిగంతులు
ఎపుడు అణగునో ?
అనంతాంబర వీధిని
సంతోషంతో
సంచరించే
ఈ మేఘమాలికల ఆటలెపుడు కట్టువడునో ?
ఆశనిరాశల ప్రయాసమయమగు
ఈహృది
తనవిధి
ఎపుడు మరచునో ?
విశ్వరహస్య మిమిడియున్న
ఈ పకృతి శోభెపుడు అంతరించునో ?
లేదు ...

ఇది ఎప్పటికీ జరిగేదికాదు....
ప్రవాహము ప్రవహించు,
గాలివీచు, సంచరించు మేఘముల్
హృది తనవిధి నిర్వహించు
ప్రకృతిశోభ ప్రజ్వరిల్లు
ఏదీ అంతరించదు
అంతరించదేమీ—
అయితే ఒకటి మాత్రం సత్యం,
మార్పన్నది....నిత్యం
ఈ అనంతకాల గర్భంలో
జరిగేది తథ్యం

* * *

ఈ విశాల విశ్వాన్నెవరు సృష్టించారో ?
ఎవరికి తెలుసు ?
ఎవరు తెలుపగలరు ?
ఈ విశ్వం మారిపోవుగాని అంతరించిపోదు....
ఏదీ పుట్టలేదు
గిట్టబోదేమీ—
అయితే ఒక లక్షణం
మార్పది క్షణం క్షణం,



బిడ్డలు - తల్లిదండ్రులు

కె. వెంకట్రామయ్య

"బిడ్డ ఎదిగెడి విధానము" తరువాయి.

ఒకటిన్నర సంవత్సరముల వయస్సుబిడ్డ

ఈ వయస్సు బిడ్డ ప్రాకుచుండును. తప్పటడుగులు వేయుచుండును. ఇతరులు తన్నుద్దేశించి చెప్పుమాటలను చాలవరకు అర్ధము చేసికొనును. తాను కొన్నిమాటలను మాట్లాడ గలిగి యుండును. శరీరావయవములను వాడుట నేర్చియుండును, అతని ఇంద్రియములన్నియు చురుకుగా పనిచేయుచుండును. చుట్టునుగల వస్తువుల ఉపయోగ మతనికి చాలవరకు తెలిసియుండును. పశితనములో అత డితరులపై ఆధారపడి యుండెను. వారికొరకై వేచియుం డెడివాడు. ఇప్పుడే విషయములకును వేచియుండడు ఏది కావసినను స్వయముగ తానేబోయి తీసికొనుట-కారంభిం చును. తాను వినునట్టియు, చూచునట్టియు ప్రతి విషయ మును తెలిసికొన గోరును. అందుబాటులోగల ప్రతి వస్తు వును తాకియు, పట్టియు పరిశీలించును. ఆకర్షకములగు నవి అందుబాటులో లేకున్నను పరిశీలింపగోరును.

బిడ్డకు ఒకటిన్నర సంవత్సరముల వయస్సు రాగానే ఇల్లంతయు తిరుగ నారంభించును. అన్నిటిని తాకియు పట్టియు పరీక్షింపగోరును. ఇది ఇంటిలోని వారికిబ్బందిగ నుండి వారతని కార్యముల కడ్డువచ్చుటయు కూడదను టయు జరుగుచుండును. ఇట్లగుటచే బిడ్డ తన కార్యము లందలి ఉచితానుచితముల నెరుగగలడు. వస్తువులను తాకియు, పట్టియు తెలిసికొనగోరుట బిడ్డకు సహజమేయై నను అవి కూడనివైనచో వాని నందుబాటులో లేకుండ జేయుట మంచిది. బిడ్డ ఈ వయస్సుననే తొందరగా మాటలు నేర్చును. స్వేచ్ఛను గోరుచుండును. బిడ్డకు తగు స్వేచ్ఛ నిచ్చుట ఆవసరమేగాని పట్టుదల పంతగింపు అతనికి పట్టువడకుండ తలిదండ్రులు నేర్పుతో మెలగ వలెను.

ప్రాకుచు-తప్పటడుగులు వేయుచు నడచు వయస్సు దాటగనే బిడ్డ అతిశీఘ్రముగ నెదుగుచుండును. ఐదేండ్లు వచ్చునరికి జీవితావసరములగు అలవాట్లన్నియు అతనికి ఏర్పడి యుండవలెను. అన్నిటిని తెలిసి కొనవలెనను కుతూహలముండ వలెను. నేర్పు. ప్రయత్నములతో కూడిన ఆటలాడుటకు తగిన యూహాశక్తి యుండవలెను. పెద్దలయెడ ప్రేమ, తోటివారితోచేరి కలసి మెలసి ఆడు కొనుట, ఒకరినిమిత్తము లేక కులాసాగా నుండుట, బాధ్య తయుతమగు చిన్న పనులను బాగుచేయగలుగుట, ఇష్ట మగు నేవిషయమందైనను నలుబది నిముషము లేకాగ్రత జూపగలుగుట, ఇతరులు తన సహాయము గోరిన సహా యపడుటకు సిద్ధముగా నుండుట, ఇత్యాది గుణములతనికి పట్టువడ వలెను. ఒక్క మాటలో చెప్పవలెనన్న బిడ్డ కైదేండ్లు రాగానే ఇతరులతో కలసి మెలసి సుఖముగను, ప్రయోజన కరముగను జీవించుట కనువగు అన్ని గుణ ములు సబ్బ వలెను,

అలవాట్లు — వాని ప్రాముఖ్యత

పుట్టిన నాటినుండియు బిడ్డ తన పరిసరములు కను గుణముగ ప్రవర్తింపవలసి యుండును. కనుక అతని కేవో కొన్నియలవాట్లు ప్రారంభమునుండియు నేర్పడుచునే యుండును. ఇవి మంచివైనను కావచ్చును. లేదా చెడ్డవి కావచ్చును. మంచియలవాట్లు బిడ్డ మనశ్శరీరారోగ్యమున కును సుఖజీవనమునకును తోడ్పడును. చెడ్డవి బిడ్డ యభివృద్ధి నాటంకపరచును. ఇది తల్లిదండ్రులు గుర్తించి బిడ్డ యలవాట్లనుగూర్చి మొదటినుండియు శ్రద్ధజూపుట చాలయవసరము.

ఆహారము, నిద్రమొదలగునవి బిడ్డ జీవితములో చాల ముఖ్యమైనవి. వీనియందు బిడ్డకాదినుండియు సరియగు నలవాట్లేర్పడవలెను. ఏలయన నీయలవాట్లమీదనే తక్కిన యలవాట్లనేకము లాధారపడియుండును. బిడ్డ యేడ్చినపు డెల్ల తల్లి పాలుపట్టుచున్నదనుకొందము. దానివలన బిడ్డ కసహనము, అత్యాశ, పట్టుదల, ఇత్యాదిగుణములలవడ వచ్చును. మరియు బిడ్డ తన తల్లిపై నధికారము జూపుట గూడ నేర్చుకొనవచ్చును. కాలము గడచిన కొలది ఈ యలవాట్లే బలపడి మాన్పుటకతి కష్టమగును.

సహజప్రవృత్తులను సరిదిద్ది అలవాట్ల నేర్పరచుట :

ఏదైనను, చిన్నతనమునకడు సులభముగాపట్టువడును. అందుచే నాకాలమే యలవాట్లనేర్పరచుట కెంతయు తగి యుండును. ప్రతి బిడ్డయు కొన్ని సహజ ప్రవృత్తులతో బుట్టుచున్నది. వాని యభివృద్ధి కభ్యాసమవసర మగును.

అభ్యాసము నొసగువిధానమునుబట్టియే బిడ్డకు మంచి యలవాట్లుగాని చెడ్డయలవాట్లుగాని యేర్పడుచుండును. బిడ్డ యాహారమును దీసికొనవలెను. నిద్రపోవలెను. అవయవ సంచలనము గలిగియుండవలెను. ఈప్రవృత్తులు జీవితావసరములు. వీనియందొక క్రమవిధానమేర్పరచుటచే బిడ్డకు మంచి యలవాట్లేర్పడగలవు.

సహజ ప్రవృత్తులలో మార్పుదెచ్చుటచే నలవాటేర్పడుచుండునను విషయమునుగూర్చి వాట్సన్ మహాశయుడొక విచిత్ర ప్రయోగమును జేసెను. అతడొక చంటిబిడ్డకుందేటితో నిర్భయముగనాడు కొనుటనుజూచి సరిగాబిడ్డదానిని తాకబోవు తరినొక ఉక్కుకడ్డీ పైగొట్టి శబ్దము జేసెను. బిడ్డ కొంచము భీతిల్లిన సూచనలను జూపెను. వాట్సన్ వెంటనే కుందేటినిదీసి కర్రఘనములనాడుకొన నా బిడ్డకిచ్చెను. కొంతసేపైన పిదపకుందేటిని మరల బిడ్డ ముందుంచగా నతడు దానిని తిరిగి తాకబోయెను. అదే సమయమున వాట్సన్ పూర్వపు ధ్వనినే మరలజేసెను. ఈసారి బిడ్డపూర్వముకన్న నెక్కుడు భయమే జూపెను. అంత వాట్సన్ కుందేటిని దీసి వేసి బిడ్డకు కర్రఘనముల నాడుకొన తిరిగియిచ్చెను. కొంతసేపైన పిదపకుందేటిని మరల బిడ్డ యెదుటనుంచగా ఏ శబ్దమును జేయకయే బిడ్డ దానిని జూచి భయపడెను. కుందేలన్న బిడ్డకు మొదట భయములేదు. కాని దానిని తాకబోయినపుడెల్ల పెద్ద ధ్వనిని వినుటచేనతనికా జంతువుపై భయముగలిగెను. ఇట్లే అయిష్టమగునొక విషయమును మంచి విషయముతో జతపరచుటవలన బిడ్డకు మంచివిషయముపై నసహ్యము గలుగవచ్చును. బిడ్డకు చాల యిష్టమగు పండ్లరసముతో నొక దుర్వాసన ద్రవ్యమునేదో కలిపి లిపియిచ్చితిమనుకొనుడు. అప్పటినుండియు బిడ్డయారసమునంటడు. కారణమేమన దుర్వాసనపైగల యసహ్యత పండ్లరసముపైకితిరిగినది. బిడ్డ నిద్రబోవుటకెవ్వరును దగ్గరనుండ నక్కరలేదు. కాని తల్లి జోగొట్టుటను జోలపాటలు పాడుటను అలవాటు జేయును. దానివలన బిడ్డడాకార్యము జరుగువరకు నిద్రింపక బాధించుచుండును. ఇట్లే చీటికి మాటికి నలుకజెందుట, ఆహారవిషయములలో బాధించుట, మలమూత్ర విసర్జనలనాపుకొనకుండుట, అన్నిటిని పాడుజేయుట, వ్రేళ్ళను చీకికొనుట, మొదలగుదురలవాట్లు బిడ్డల ప్రవృత్తులలో గలుగుమార్పులవలననే యేర్పడుచున్నవి. మర్యాదగా ప్రవర్తించుట, ఇతరుల విషయము గమనించుట, పరిశుభ్రత గలిగియుండుట మొదలగు మంచియలవాట్లును నీవిధముగనే యేర్పడును.

బిడ్డలెదిగిన పిదప వారి ప్రవర్తన యెట్లుండ నాశింతుమో దాని కనుగుణముగ నాదినుండియు వారు నడచుకొనునట్లు ప్రోత్సహింపవలెను. బిడ్డ క్రిందపడినదనుకొనుడు. అప్పుడతడు తనంతట తానే లేచుటకు ప్రయత్నించును. కాని యెవరైనను తన్నెత్తుటకువచ్చుట, చూచినంతనే యేడ్వనారంభించును. అప్పుడు బిడ్డను ముద్దుజేసియూరడించినచో యేడ్పుగొట్టుతన మతని కలవడవచ్చును. అట్లుగాక జరిగిన విషయము నల్పముగా జూచితిమేని దెబ్బలకును, పాటులకును లెక్కజేయక ధైర్యముగానుండుట అతనికలవడును. ధైర్యమనునది స్త్రీ పురుషులిరువురకును చాల ముఖ్యమే. దానిని వారికి చిన్నతనమునుండియు తప్పక యలవరచవలెను. బిడ్డకొకవేళ పెద్ద దెబ్బ తగిలిన యెడల తగు జాగ్రత్తదీసికొనవలసినదే. ఐనను దానిని గూర్చి పెద్ద జేయుటయు, ఆందోళన పడుటయు పనికిరాదు.

ప్రయత్నించుట, పొరబాట్లను దిద్దుకొనుట పద్ధతి

నలవాట్లేర్పడుట :—బిడ్డ శరీరచలనములు మొదట ఉద్దేశరహితములై ఒడుదుడుకుగా నుండును. కాని ఇంద్రియములును ఇతరయవయవములును అతని స్వాధీనమునకు రాగానే శరీర చలనములలో కొంతయుద్దేశమును క్రమతయునేర్పడును. మొదటినెలలో నతడు తన చేతిని నోటి కడకుదెచ్చుకొనుటకు ప్రయత్నించుచుండును. ఆప్రయత్నములను గమనించిన బిడ్డ విషయములనెట్లు నేర్చుకొనునదియు మనకు బోధపడగలదు. మొదట నతడు తనచేతినే యుద్దేశముతోను నోటి కడకుదెచ్చుకొనడు. అనుకొనకుండ చేయినోటిపైబడుట తటస్థించును. వెంటనే దానినతడు చీకగోరును. అప్పటినుండియు తనచేతిని నోటివద్దకు దెచ్చుకొననతడు ప్రయత్నించుచుండును. మొదటచేతి నెన్నోవిధముల కదలించుచుండుటచే దానిని సరిగా నోటికడకతడు తేలేకపోవును. కాని తుదకు చేతిని అనవసరముగ కదలించుట మాని తిన్నగా నోటివద్దకే తేగలుగును. ఇట్లే అతని చేయి తొట్టెపైవ్రేలాడ గట్టిన గిలకపైబడుట తటస్థించును. అదిశబ్దము జేసి ఊగును. అంత దానిని పట్టుకొనుట కాతడు ప్రయత్నింపదొడగును. కండరములింకను తన స్వాధీనమున నుండకుండుటచే

అతడెన్నోసార్లు ప్రయత్నింపవలసియుండును. తుదకా గిలకను చేతితో కొట్టుటనతడు నేర్చుకొనును.

ప్రయత్నములవలనను, పొరబాట్లవలనను నేర్చుకొను నీవిధానము దీర్ఘమార్గమేకావచ్చును. కాని బిడ్డ తన కండరములతో జేయవలసిన కార్యములను మరియేమార్గ మునను నేర్చుకొనజాలడు. ఇది తల్లిదండ్రులు గ్రహించి బిడ్డ తనంతట తాను భుజించుటకుగాని, దుస్తులను ధరించు టకుగాని యత్నించుచో నోర్పుజూపుట మంచిది. అల్లుట, కారు నడుపుట, ఇత్యాదిపనులను నేర్చుకొనునప్పుడు మన మెంతో ప్రయత్నింపవలెను. మనకును ఎన్నో పొరబాట్లు, వచ్చును. ఇది జ్ఞప్తియందుంచుకొని బిడ్డ దేదైనను నేర్చు కొనునపుడు మన మతనిని తొందరబెట్టక ఓర్పు జూపుట యవసరము. ఒక వయస్సు రాగానే బిడ్డలు తమ పనులను తామే జేసికొనుటకై యత్నించుచుందురు. అట్టి యెడ వారి నడ్డుటగాని తొందరబెట్టుటగాని పనికిరాదు, దాని వలన బిడ్డ లెదురించుటయు, పట్టుబట్టుటయు నేర్చుకొన గలరు. లేదా వీరైనంతవరకితరులచే పని చేయించుకొనుట కలవాటు పడగలరు.

బిడ్డ లేపనినైనను చేయుటకు ప్రయత్నించునపుడు వారినట్లే చేయనిచ్చినచో తమంతట తామే ఆ పనిని సాధించితిమనుతృప్తి వారికి కలుగగలదు. ప్రయత్నించుచు పొరబాట్లను దిద్దుకొనుచు నేర్చుకొను విధానము బిడ్డలకు చాల మంచిది. ఈ విధమున నేర్చుకొన్నది వారెన్నటికిని మరువరు. మరియు, పనియందు పట్టుదల ఏకాగ్రత జూపుట వారి కలవడును.

ఎవరి సహాయమును గోరక బిడ్డ తనంతట తానే ఒక పని చేయునపుడు స్వేచ్ఛగా చేయనీయవలెను, బిడ్డకది సాధ్యము కాదని తోచినప్పుడు మాత్రము సహాయపడ వచ్చును. దీనివలన బిడ్డ సంతోషముగానుండును, సహాయ కరముగా నుండును. ఇంటియందు శాంతి యుండును.

చేసిన దానినే తిరిగి తిరిగి చేయు విధానము :— (Repetition)

అలవాటేర్పడుటలో నిదియొక ముఖ్య ధర్మము. ఏ పనియైనను అలవాటగుట కభ్యాసమవసరము. బిడ్డ తన చొక్కా గుండీలనో లాగూ గుండీలనో పెట్టుకొనుట నేర్చుకొనవలెనన్న ఆ పని నొక దినము చేసిన చాలదు. ప్రతి దినమును చేయవలెను. అప్పుడే అది బిడ్డ కలవా టగును. ఒక పని చేయునప్పుడు మనకు గలిగిన యను భవము మరపునకు రాకపూర్వమే మరల నా పనిని చేయ వలెను. అప్పుడే మనకది యలవాటగును.

పద్ధతిలో మార్పులేకుండుట, (Consistancy)

(ఎ) వేళకు నిద్రించు అలవాటు :—

శిశు నిర్వహణములో క్రమవిధాన మత్యవసరము. అది లేకుండుటయే చాల సమస్యలకు కారణమగుచుండును. వేళకు నిద్రించుట బిడ్డ కలవాటు కావలెనన్నచో ప్రతిదిన మును వేళ కాతని పరుండబెట్టవలెను, ఒక దినమట్లు చేయుట, మరియొకదిన మూరకుండుట పనికిరాదు. వేళకు పరుండుట బిడ్డ కలవాటైనను మన మజాగ్రత్తగ నుండ రాదు. ఒకనాడు, బిడ్డ బ్రతిమాలెనుగదాయని తల్లి యతని నాలస్యముగా పరుండనిచ్చిన అప్పటినుండియు నతడా వేళకు పరుండక పేచీ పెట్టుచుండును.

(బి) వస్తువులను సర్దియుంచుకొనుట :—

బిడ్డ తన యాట వస్తువుల నిటునటు పారవేయరాదు. వానిని దీసినచోటనే తిరిగి పెట్టుట కలవాటు పడవలెను. మొదట తల్లియే యీ పని చేయునప్పుడు బిడ్డ సహాయ పడవచ్చును. పిదప తానే స్వయముగ నాపని జేయుట కలవాటు పడవలెను. ఒకనాడు బిడ్డనే ఆటవస్తులనెత్తి దాచుకొమ్మనుటయు మరునాడు మనమే ఆ పనిజేయు టయు పనికిరాదు. అట్లు చేసిన బిడ్డ కెట్టి యభ్యాసము నుండదు. బిడ్డ ఆటవస్తువుల నిటు నటు పారవేయు చున్నను మొదట ఊరకుండి అతని కారేండ్లు రాగానే వానినెత్తి దాచుకొను గుణమబ్బలేదని వగచుటలో నర్థ ముండదు. బిడ్డ స్వయముగా తన పనులను జేయగలిగి యున్నప్పుడు మనమే ఆ పనులను జేయుచున్నయెడల ఇతరులపై నాధారపడు గుణ మతని కలవడగలదని ఇది వరకే జెప్పబడెను. తలి దండ్రు లిది గుర్తింపక వర్తిం చుటచే బిడ్డ సామాన్య విషయములందుగూడ వారిపై నాధారపడుచుండును.

బిడ్డ కొక యలవాటేర్పడవలెనన్న దానికి సంబంధిం చిన పనులు క్రమానుసరణిని జరుగుటయు వాని నతడు గుర్తించుటయు చాల ముఖ్యము. ఒక క్రొత్త యలవా టును బిడ్డ నేర్చుకొనునపుడు కొన్ని పనుల నతడు మాటి మాటికి చేయవలసియుండును. ఆ పనులను చేయుమని చెప్పునపుడు మన మొకే రీతిగ మాట్లాడుట యవసరము.

ఉదాహరణ వలన నిది బోధపడగలదు. పరుండుటకు ముందు ఆటవస్తులనెత్తి దాచుకొను నలవాటును బిడ్డకు నేర్పవలె ననుకొనుడు. అప్పుడు తల్లి ప్రతిదినము నిద్ర వేళకు "గడియారము పరుండుమని గంటకొట్టుచున్నది. ఆట వస్తువుల నెత్తిపెట్టవలెను. అందులకమ్మ రామునకు సాయపడు"నని ఒకే రీతిగ బిడ్డతో ననవలెను. బిడ్డ కొంచ మెదిగిన పిదప "గడియారము పరుండుమను చున్నది. రాము డాటవస్తువుల నెత్తి పెట్టుటకు సమయ మగుచున్నద"ని కొంచము మార్చి పలుకవచ్చును. బిడ్డ ఈమాటలను వినుటయేగాక విన్నంతనే ఆటవస్తులనెత్తి పెట్టుచుండవలెను. అప్పుడే అతనికా యలవాటు సరిగా ఏర్పడును. అంతేగాక బిడ్డ యెదిగిన కొలది తన పనులను తానే జేసికొనగలుగు చుంటినను సంతోషమెక్కువగుచుండవలెను.

తలిదండ్రుల పద్ధతులు మార్పులేక యేకరీతిగ నుండిన గాని బిడ్డలు సరిగా నుండజాలరు. నియమము లేర్పరచినది పాటించుటకొరకే, ఔననగా ఔనే, కాదనగా కాదే యని బిడ్డలకు బోధపడునట్లు తలిదండ్రులు ప్రవర్తించవలెను. అప్పుడే బిడ్డలు వారిని బాధించక సుఖముగా నుందురు. నియమములు బిడ్డలను బంధించునవియును బాధించునవియునై యుండరాదు. వారి క్షేమమును, ఆరోగ్యమును కాపాడుట కేర్పడినవిగా నుండవలెను. అట్టి నియమములను ఏవో కొన్ని ప్రత్యేక సమయములందు దప్ప సాధారణముగా బిడ్డలు పాటించి తీరవలెను. పండుగలు, పుట్టిన దినములు ప్రత్యేకసమయములే కావచ్చును. కాని ఇంటికి చుట్టములు వచ్చిరని బిడ్డలిష్టానుసార ముండరాదు. ఒక్కొక్కప్పుడు బంధువులింటనుండుటయే బిడ్డల సమస్యలకు ముఖ్యకారణమగుచుండును.

బిడ్డకు కార్యసాఫల్యమును, తృప్తియు నవసరము :—

(The child's Need for Success and Satisfaction)

బిడ్డలకు సరియగు నలవాట్ల నెందుల కేర్పరుపవలెనను సంగతులనుగూర్చి ఇంతవరకు నాలోచించితిమి. ఇక ఆ యలవాట్లను బిడ్డలు సంతోషముగా నేర్చుకొనుటకై మన మెటు తోడ్పడ వలెనో చూతము. ఏది నేర్చుకొనుటకైనను ప్రయత్నించుట చాల ముఖ్యము. మనము సాధారణముగా బిడ్డలు చేయు ప్రయత్నములను గమనింపక వాని ఫలితములనే గమనించుచుందుము. దాని వలన బిడ్డలు నిరుత్సాహు లగుచుందురు. ఫలితములెటున్నను బిడ్డలొకపనిని సాధించుటకై చేయు ప్రయత్నములను ప్రశంసించుట యవసరము. తన యత్నముల నితరులు గుర్తించి మెచ్చుకొన్నప్పుడే బిడ్డ నిజమైన తృప్తిని బొంది తన పనిని సంతోషముగా నేర్చుకొనును. మరియు, బిడ్డ చేయు పనియందలి లోపములనే యెక్కువగా ఎంచి, చూపుట పనికిరాదు. దాని వలన బిడ్డకాపని యెడ నయిష్టము గలుగును.

తాము జేయు ప్రయత్నముల నితరులు గమనింపనిచో పెద్దవారికే యెంతో నిరుత్సాహము గలుగుచుండును. అట్టి యెడ బిడ్డల ప్రయత్నములను గమనింపనిచో వారెంత నిరుత్సాహ పడునదియు నూహింపనగును. బిడ్డలు చేయు ప్రయత్నములను ప్రశంసించుటచే వారింకను ప్రయత్నించ నుత్సహింతురు. కాని వారు నిజముగ యత్నించినదియు లేనిదియు తెలిసికొనక పొగడుట పనికిరాదు. అట్లు పొగడుచుండిన బిడ్డ లేప్రయత్నమును జేయకయే, పొగడ్తల నాశించుచుందురు.

దురలవాట్లను మాన్పుటకై కొన్ని సూచనలు :

తలిదండ్రులు తమ బిడ్డలకు మంచి యలవాట్ల నలవడ జేయుటయేగాక వారియందలి దురలవాట్లను తొలగింపవలసిగూడ యున్నది. రోగమును కుదుర్చుటకన్న రోగము రాకుండ జూచుటయే మేలని పెద్దలు జెప్పుదురు. బిడ్డలకు చెడుగుణము లలవడు పరిస్థితులేర్పడకుండ తలిదండ్రులాదినుండియు తగు జాగ్రత్త దీసికొనుచున్నచో అట్టి గుణముల మాన్పు నగత్యమే వారికి గలుగకుండును. పసితనమున పిల్లల కేర్పడిన చెడ యలవాటే వారెదిగిన పిదప ఎదురించుట, ఏకాగ్రతలేకుండ, మాటి మాటికి అలుక జెందుట, చీకటియన్న భయపడుట, అన్నిటిని పాడుజేయుట మొదలగు ప్రవర్తనా దోషములుగ పరిణమించును. ఇదితలిదండ్రులు బాగుగ దెలిసికొనవలెను. ఇక యేర్పడిన యలవాట్లను తొలగించుటెట్లో ఆలోచింతము.

1. చెడ్డ అలవాట్లను తొలగించవలెనన్న అవి యేర్పడుటకు గల కారణముల నెరిగి వానిని తొలగింప ప్రయత్నించవలెను. బిడ్డలు తలిదండ్రుల ననుకరించి యెన్నో దుర్గుణముల నలవరచుకొందురు. అట్టియెడ వారిని దండించుటకంటె తలిదండ్రులే తమ తప్పులను గ్రహించి దిద్దుకొన ప్రయత్నించుట సమంజసమగును.

[సశేషం]

శారదకు లేఖ

'శ్రీ దత్'

చి. సౌ. శారదకు,

నీకు ఉత్తరం రాసి చాలా కాలమైంది. ఏం చేస్తున్నావో, ఒడుదుడుకు లేమీ లేకుండా మీ నూతన దాంపత్యంలో రోజులు ఎలా గడుస్తున్నదీ తెలియటం లేదు. వీలయినన్ని ఎక్కువసార్లు నీకు ఉత్తరాలు రాద్దా మనుకుంటాను కాని ఎప్పటికప్పుడు టైం దొరకదు. దాంపత్య జీవితంలో తీసికోవలసిన మెలుకువలు, భర్తతో ప్రవర్తించే టప్పుడు తీసికోవలసిన జాగ్రత్తలను గురించి రాస్తాను,

పెళ్ళియైన ప్రతి నూతన జంటలోని యిద్దరి జీవితాలున్నూ, మొదలవబోతూన్న ఒక నవల వంటివి. ఆ నవల సుఖాంతం కావాలంటేనూ, చివరి వరకు మనోహరంగా ఉండాలంటేనూ, అందులోని పాత్రలు మనోరంజకంగా ఉండాలి. ఉన్నతమైనవిగానూ, ఘనమైనవిగానూ ఉండాలి. అరమరికలు లేకుండా పొందికగా సాగిపోవాలంటే ఇద్దరి మానసిక ఏకీకరణ జరిగిపోవాలి. పరస్పరం అనుమానం, భయాలకు తావు లేకుండా మనస్సులను నిర్మలంగా ఉంచుకుని నిష్కల్మషంగా మాట్లాడుకోవాలి. ఈ విషయంలో,— అంటే, ఇలా జీవితాన్ని మేళవింప జేయటానికి— స్త్రీ నిర్వహించబోయే పాత్ర చాలా ముఖ్యమైనది.

వాళ్ళ దాంపత్య జీవితంలో, స్త్రీ మాత్రమే, ఏ అంతస్థులో వాళ్ళ హోదాను నిలబెట్టాలో, ఆ అంతస్థులో వారి హోదాను నిలబెట్టగలదనే సంగతి నిజమని నీవు ఒప్పుకుంటావు కదూ? పిల్లలకు తండ్రియందు గౌరవం నేర్పితే, అతడు నీయందు గౌరవ భావం చూపుతాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అతని డిగ్నిటీని కాపాడటం నేర్చుకో.

నీవు నిజంగా అతణ్ణి లొంగదీసికోవాలంటే ఒకే ఒక మార్గముంది. అది ఏమంటే, ఏదైనా ఒక ప్రత్యేకతను నీవు కలిగి ఉండటమే. కొత్త కొత్త పిండివంటలు ఎలా చెయ్యాలో, లేక ఇంట్లో కొత్త కొత్త పూల మొక్కలు ఎలా నాటాలో, వాటిని ఎలా పెంచాలో మొదలైనవి కొన్ని నీకు, బాగా తెలుసునని అతణ్ణి తెలుసుకోనియ్యి. అంత మాత్రంచేత అతనికి తెలియాలని పసికట్టుకుని ప్రయత్నించకు, అతణ్ణే తెలిసికోనియ్యి. అతను దాన్ని గురించి అడిగినప్పుడు మాత్రమే నువ్వు చెప్పు. అప్పుడాతని హృదయంలో నువ్వొక బాగా తెలిసిన దానివనీ, నీ దగ్గర్నుంచి తెలిసికోవలసిన విషయాలు ఎన్నో ఉన్నయ్యనీ, ఒక అభిప్రాయం ఏర్పడుతుంది.

సాధారణంగా ఆఫీసు తగాదాల్లోగాని, మరే చిన్న విషయాల్లో గాని తనశత్రువులమీద, తనఅక్కసు నీ ముందు వెళ్ళబోసుకుంటాడు. అప్పుడు నీవు చేయకూడని పని ఏమంటే, ఆ విషయాల్లో ఈతని తప్పు ఎంతవరకు ఉందీ విచారించి న్యాయమైనతీర్పు ఇవ్వటం. అతను నీ నుంచి వాంఛించేది కరుణా పూరితమైన ఓదార్పు, మెప్పు. జీవితంలో, ప్రపంచంతో అతను జరిపే ప్రతి పోరాటంలోనూ, నిన్ను తన అడ్వకేటుగా ఉండాలని కోరుకుంటాడు. అంతేగాని అతని జడ్జీగా మాత్రం కాదు. అదే విధంగా నీవుకూడా ఆవిధమైన సెక్యూరిటీని ఫీలవ వలసిందిగా కోర్తాడు. ఇల్లనేదొక్కటే చేసిన తప్పులకు తాను క్షమాపణ చెప్పుకోనవసరంలేని ప్రదేశం! కాబట్టి ఇంటిలో ఎటువంటి వాతావరణాన్ని సృష్టించుకోవాలో ఆలోచించు.

అంతేగాక అతనిలోని ప్రమాదం లేని విలక్షణాలను కలిగి యుండనీ. ఉదాహరణకు— అతనికి నీతోపాటు వంట దగ్గరకూచుని సహాయం చెయ్యటం సరదా అనుకో. చెయ్యనీ! దానివల్ల నీవు నష్టపడేదేమీ లేదుగా! లేకపోతే ఉన్న కాస్త ఖాళీ స్థలంలోనే మొక్కలను పెంచటం సరదా అనుకో. పెంచనీ! అంతేగాని, "ఆడాళ్ళకిమల్లే పొయ్యి దగ్గర జేరటమేమిటీ అనిగాని!" అసలే జానెడు, బెత్తెడు బస్తీకొంపలు. దాంట్లో ఈ మొక్కలుగూడానా" అనిగాని అడ్డు తగలగూడదు. అటువంటి వాటివల్ల నీకు కలిగే నష్టమేముంది? ఈ చిన్న విషయాలలో అతనికి అడ్డు తగిలి, అభిప్రాయ భేదాలు తెచ్చుకుని, తగాదాలు తెచ్చిపెట్టుకోటం మాత్రం వాంఛనీయంకాదు. అతడనే వ్యక్తికి, నీకూ ఇదివరకే వివాహమైపోయింది. ఇప్పుడు జరగవలసిందల్లా, అతని మనస్తత్వానికి, నీ మనస్తత్వానికి వివాహం మాత్రమే!

అలాంటి తగాదా తెచ్చే పరిస్థితులు వైవాహిక జీవితంలో సతీపతుల మధ్య ఏర్పడటం సహజమే. అంతేగాక ఆ పరిస్థితులు రాకుండా ఎవ్వరూ తల్లకిందులు తపస్సుచేసైనా అరికట్టలేరు. కాని ఆ పరిస్థితులు ఏర్పడ్డ తరువాత వాటీని సర్దుబాటు చేసుకొని తగాదా రాకుండా చూచుకోగల శక్తి మనచేతుల్లోనే ఉంది. అది, అందుకు సంబంధించిన, ఆ వ్యక్తులిద్దరిమీదా ఆధారపడి ఉంటుంది.

సాధారణంగా అభిప్రాయ భేదాలేగదా వీటన్నిటికి మూలం. భర్త కబుర్లు చెప్పే అలవాటుగలవాడై, భార్య ముంగితనం గలదైతేనూ; భార్య బడబడ వాగగలదై భర్త ఎప్పుడూ గంభీరంగా ఉండి, ఎక్కువ మాట్లాడే అలవాటులేని వాడైతేనూ వస్తుంది చిక్కు. ఇద్దరూ సరి సమానంగా వాగగల వాళ్ళైనా అయి ఉండాలి. లేకపోతే ఇద్దరూ ముంగితనానికి అలవాటుపడ్డ వాళ్ళైనా అయి ఉండాలి, ఇక పరిశుభ్రత విషయంలో, ఇద్దరిలో ఒకరు ఎక్కువ పరిశుభ్రత, ఇంకొకరు తక్కువ పరిశుభ్రత గలవారైతే వస్తుంది చిక్కు. తక్కువ పరిశుభ్రత గలవార్కు ఎక్కువ పరిశుభ్రత నేర్చుకోవడమే మంచిది.

భర్త ఆఫీసునుంచి వచ్చినప్పుడు ఆఫీసు వ్యవహారాలలో విసిగిపోయి, చిరాగ్గా ఉంటాడు. ఆ చిరాకు పోవాలంటే "గృహమేకదా స్వర్గసీమ" అని అతను భావించాలి. అతనలా భావించేటట్టు చెయ్యటం నీ విధి. అలా చెయ్యలేకపోతే ఆతప్పు పూర్తిగా నీదే. కొందరు మహాతల్లులు భర్త యింటికి వచ్చేవేళకి పిల్లల్ని గొల్లున ఏడిపిస్తూంటారు. ఆదృశ్యాన్ని చూచి భర్త కసురుకోవటం, ఇద్దరిమధ్యా రుసరుసలు, విసవిసలు, మూతి ముడుచుకుంటుంది, భార్య. అతనికి వళ్ళుమండి పోతుంది. ఏ పార్కుకో పోయి సాయంత్రం గడుపుకుంటాడు. దాంతో అంటుకుంటాయ్ కొంపలు. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే, భర్త ఇంటికి రావడమనేది, ఇద్దరికీ ఒక ఆనందదాయక సన్నివేశమవాలి.

ముఖ్యంగా నీ భర్త సంగతి తెలుసు గనుక రాస్తున్నాను. అతనికి లలితకళలంటే మంచి అభిరుచి, కొంచెం ప్రవేశమూ ఉన్నవాడు. అందులోనూ సాహిత్యమంటే వెఱ్ఱి అభిమానం గలవాడు. చేతనైతే నీవుకూడా మంచి మంచి పుస్తకాలు చదివి అతనితో తర్కించు. అతనికి తెలిసిన విషయాలు నీకు చెప్తాడు, ఆవిధంగా నీకు చాలా విషయాలు తెలుస్తయ్; అతనికి తెలియని విషయాలు నీవు తెలియ జేయవచ్చును. ఇంగ్లీషులో ఒక మంచి సూక్తి ఉంది. "Give instruction to a wise man and he will be yet wiser". నీవు చెప్పే వాటిలో కొన్ని అతనికి ప్రయోజన కారులుగా నుండవచ్చును. నిజంగా నీవావిధంగా చేసినప్పు డాతడెంత సంతోషిస్తాడు!

స్వేచ్ఛను బాగా అనుభవించు. నిన్ను కాదనడు. కొన్ని కొన్ని వస్తువులు — ఎక్కువ ఖర్చులేనివి — నిర్భయంగా ఎక్కువ తెచ్చిపెట్టమని అడగవచ్చు. నీకు పెద్ద పెద్ద చేమంతి పూలంటే ఒకవిధమైన వెఱ్ఱి ఉందనుకో. నీ భర్త ఒక చిరునవ్వు నవ్వేసి, సంతోష పూర్వకంగా తీసుకొచ్చిస్తాడు. నీవు ధరిస్తావు. నిజంగా అందులో ఎంత మాధుర్యం ఉంది!

మగవాళ్ళు, ఇతరమగవాళ్ళతో, సాధారణంగా, వాళ్ళ భార్యలను గురించి ఎక్కువ మాట్లాడరు. కాని ప్రతిమగవాడు తన భార్యకు, ఏదో ఒక ప్రత్యేకమైనది, మంచిది, అసాధారణమైనది ఐన వస్తువంటే ఎక్కువ ఇష్టమని చెబుతాడు. అదీ, సాధారణంగా సగర్వంగా చెప్పుకుంటాడు.

సాధారణంగా బస్తీలో ఉండే ఆడవాళ్ళకు స్నోలు, పౌడర్లు మీద మోజు ఎక్కువగా ఉంటుంది. వాటిమీద డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తూ ఉంటారు కూడాను. నీకూ ఆ దుర్గుణం అంతో ఇంతో లేకపోలేదు గనగ పోగొట్టుకోమని చెబుతున్నాను. కేవలం వాటివల్లే అందం పుట్టుకొచ్చి రంభ, ఊర్వశి అవలేరుగదా! అప్పు జేసైనాసరే అర్జంటుగా సినిమాకు తీసుకెళ్ళమని వేపుకు తింటారు. అటువంటి భార్యలు, భర్తలకు కేవలం గుదిబండలు. సిల్కుచీరలు కట్టుకుని షోకుగా అలా బిసెంటు రోడ్డులో తిరిగితేనో, అప్పుజేసి లీలామహల్‌లో సినిమా చూస్తేను ఒరిగేదేమిటి. అంతమాత్రం చేత మీరు ధనవంతులని ఎవరూ అనుకోరుగదా! కేవలం డ్రెస్‌ని చూసి వాళ్ళ వాళ్ళ ఆర్థికస్థోమతలను నిర్ణయించేటంత మూర్ఖులు కాదీ ప్రపంచంలోని వాళ్ళంతా! ఒకవేళ అటువంటి వాడెవడైనా ఉంటే వాణ్ణి తెలివితక్కువవాడని చెప్పక తప్పదు కాబట్టి అందరి ఆడవాళ్ళలాగా అతన్ని డబ్బుకోసం మాత్రం వేధించుకు తినకు.

శారదకు లేఖ

ఈ సందర్భంలో మొన్ననే జరిగిన ఒక సంఘటన చెప్ప దలిచాను. భార్య చనిపోయిన ఒక భర్తను అతని స్నేహితుడొకడు పలుకరించడానికి వెళ్ళాడు. వెళ్ళిన స్నేహితుడు, "పాపం! నీ హృదయానికి పెద్దదెబ్బ తగిలింది. ఆమెను మరచి పోవటానికి కొంతకాలం పడుతుంది. అప్పుడా భార్యపోయిన వ్యక్తి," ఆమెను నేనప్పుడే మరచి పోగలిగే వాణ్ణి. కాని ఆమె, బట్టలషాపులోనూ, నగలషాపులోనూ, చేసి వెళ్ళిన 2 వేలరూపాయల అప్పుమూలంగా ఆమెను నేనెన్నటికీ మరువలేను," అన్నాడు. లోకంలో కొందరు ఆడవాళ్ళు, వాళ్ళభర్తలను ఎంత విసిగించగలరో ఉదాహరణకు పై విషయం చెప్పాను. కాబట్టి కుటుంబ ఖర్చు విషయంలో పూర్తి స్వేచ్ఛ మగవాడికి లేకపోతే మధ్యతరగతి కుటుంబాలకు అధఃపతనం తప్పదు.

అతను కేవలం మగవాడు గనక, ఎప్పుడైనా ఒక ప్రత్యేక స్త్రీని చూచి, "ఆహా! ఈమె ఎంత అందంగా ఉంది" అన్నాడనుకో. అంతలో దాన్ని నీవపార్థంచేసుకో గూడదు. అవి కేవలం అమాయికంగా వెలువడిన మాటలు. కేవలం అందాన్ని ప్రశంసించటం మాత్రమే అందులో ఉంది. సాధ్యమైనంత త్వరలో పరిస్థితిని అదుపులోనికి తెచ్చుకోవాలంటే, ఒకే ఒక మార్గముంది. అది ఏమంటే: నీవుకూడా ఆమె అందాన్ని ప్రశంసించటమే. ఆమె అందం అతనికి నచ్చిందని నీవూ ఒప్పుకుంటున్నానని చెప్పేసెయ్. అంతేగాని ఆమె నాతడు రహస్యంగా ప్రశంసించనీకు. బయటి వాళ్ళ విషయాలను బహిరంగగా దులిపేసుకోండి, ఇద్దరిముందూను. నీ అభిరుచి కూడా మంచిదేనని అతనికి తెలియజెయ్యటం మంచిది. లేకపోతే ఇటువంటి విషయాలే విషమపరిణామాలకు దారితీసి, దారుణ ఫలితాల నివ్వగలవు. ఇప్పటికే ఈ ఉత్తరంలో చాలా ఎక్కువ రాశానను కుంటాను. విశేషాలతో త్వరలోనే జవాబు రాస్తావుగదూ?

ఇట్లు

"మీ అమ్మ"



గాని,

"యధాయధా...............కాశీధవళత్వ శంకయా."

అమృతాంజనమా! నీ కీర్తి ముల్లోకములను దెల్పుజేయు పూనికతో పెరుఁగుచున్నప్పుడెల్లను నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే నా హృదయము మిక్కిలి పరితాపమొందుచున్నది సుమా !!!



మనలో మనమాట

★

కయ్యానికి కాలు దువ్వటము పురుషలక్షణము కాదు - స్త్రీ లక్షణము అసలేకాదు. పైగా కయ్యము ముసలాయనతో -

పదిమంది స్త్రీలు అమాంతంగా దండెత్తితే ఎంత మంత్రి సత్తముడైనా పాపమా పురుష పుంగవుడేమి చేయగలడు. స్వరక్షణకు అంగరక్షకులసహాయము అడుగక పోవటము కొంతవరకు మేలే. ఈపాప్పంతా పోతూ పోతూ నెహ్రూ చూచీ చూడనట్లు వూరుకున్నాడు. అటు అనుభవశాలి వృద్ధుడు ఇటు పదిమంది స్త్రీలు. అందులో ఎమ్పీలు ! ఏమనగలడు పాపము ! ఆయనకు అటువంటి సంఘటనలు చూచినప్పుడు వూరుకుండుట సహజము గావచ్చోయినా ఏమి అనలేక ఓచిరునవ్వు పారేసి తన త్రోవను తా వెళ్ళాడు. ఈరభసంతా ప్రజాలోక సభల భవనములో జరుగుతూవుంటే ఎప్పటికప్పుడు లోకానికి వార్తలు వస్తూనేవున్నవి.

అయినా అయినదానికి కానిదానికి అన్నిటికీ ఇంత గొడవ చేయటమేనా ? మహిళాభ్యుదయవాదులిలా వెర్రి వెర్రి పోకడలుపోతే.

ప్రక్కన అస్థిహక్కులకు ఒక చిన్న యుద్ధము జరుగుచునే వున్నది. ఇంతలోకే ఈ I.A.S., I.P.S., లలో స్త్రీల ఉద్యోగుల గొడవ ఆరంభము.

ఇంతకీ — సంగతేమిటంటే ఉద్యోగము చేస్తూవున్న స్త్రీలు వివాహము చేసుకుంటే వివాహము వల్ల తను ఉద్యోగ నిర్వహణకు ఎట్టి ఆటంకము కలిగినా వారిని ఉద్యోగ విముక్తులనుగా చేయదగునని ఇదివరలోనున్న రూల్సు. ఇదేలనో కొందరి స్త్రీ ఎమ్పీలకు కంటకముగా కనబడినది. కనబడుచున్నది. మన రాజ్యాంగ చట్టము ప్రకారము స్త్రీలకెట్టి అనర్హతా వుండకూడదుకదా కాబట్టి పురుషుల వివాహానంతరము ఉద్యోగము చేయదగినప్పుడు స్త్రీలకేల ఈ అనర్హతని వారి వాదము.

తెలసినవారికి చెప్పవచ్చును......................

ఈ ఎమ్పీలు - ప్రజా ప్రతినిధులు — పైగా ప్రత్యేకంగా స్త్రీల ప్రతినిధులు - వీరు స్త్రీలకొరకు - భారత స్త్రీకొరకు ప్రజాప్రతినిధుల సభలలో వితండవాదము చేస్తూవుంటే భారతావనిలోని స్త్రీలందరూ వారినిచూచి వారి ధైర్య సాహసాలకు మెచ్చి అభినందించవలయునో లేక తల వంచుకొనవలయునో తెలియకున్నది.

వివాహానంతరము స్త్రీలకేల ఉద్యోగములయందు అనర్హతని బిల్లుగుద్ది శ్రీకట్జూ గారితో వాగ్యుద్ధము సలుపవచ్చుగాని వివాహానంతరము స్త్రీలకే ఏల మాతృత్వము కలుగవలయునోనని శ్రీ బ్రహ్మగారితో ఎంతమంది స్త్రీలు పోరాడ సంసిద్ధులో తెలసికొనవలసియున్నది. ప్రకృతి మార్చుట మానవతరమా ? ఈ రాజ్యాంగ సభలలో చర్చలతో ప్రకృతి సూత్రములను మార్పు చేయగలరా ? వివాహానంతరము పురుషులకులేని అనర్హత స్త్రీలకేల యుండవలయునని అడుగుటలో అర్థమేమి ? వివాహానంతరము పురుషులలో ఎట్టి మార్పు కలుగుచున్నది ? (మానసికము కాదు - శారీరకముగా) వారు బిడ్డలను కనరుకదా ? వారిని ఆ కార్యమునకు నియమించుట. భారత రాజ్యాంగ చట్టమునకు తరమా ? వారు పూర్వ జన్మలో ఎట్టి పుణ్యము చేసిరో ఈ జన్మమునవారికి బాధ్యతా రహిత జీవనము సంప్రాప్తమైనది. మరి స్త్రీలో అట్టి జీవితము కడపుటకు అనర్హులుగా జన్మించినారు. (అది వారి అదృష్టమో దురదృష్టమో ఎవ్వరు చెప్పగలరు !) కాబట్టి జన్మత సంక్రమించిన అనర్హతలు అనుభవించవలసినదేగాని అంగలార్చిన లాభమేమి ?



పదిమంది స్త్రీలు అమాంతంగా దండెత్తితే........!

మనకు - స్త్రీలకు కొన్ని అనర్హతలున్నవి. వున్నది వున్నట్లు చెప్పితే వులుకెక్కువ - ఎవరికైనా - పురుషులకైనా — స్త్రీలకైనా —

మనము కొన్ని కొన్ని విషయములయందు పురుషులతో పాటు పోటీపడలేము. అట్లే పురుషులునూ స్త్రీలవలే కొన్ని పనులు నిర్వహింపజాలరు.

బిడ్డలు గనుటపెంచుటవారికి చేతగాని పని. నల భీములు మినహా వంట ఇంటిలో వారు చేతులు కాల్చుకొనవలసినదే కాని భుజించతగినవి తయారగుట సూన్యము - శిశుసంరక్షణ గృహ నిర్వహణలో వారికి ప్యాసు మార్కులుకూడ వచ్చుటకష్టమే. నర్సింగు స్త్రీలవలే పురుషులు చేయజాలరు. ఆ విషయము మొగ నర్సుల ముఖముల జూచిననే తెలియకలదు. ఆ పనిలో వారికి 35% మార్కులు రావచ్చును. అంతే — చిన్న పిల్లలకు విద్యగరపుటకు కావలసిన ఓపిక పురుషులకులేదు. స్త్రీలే వారికి బాగుగ విద్యగరుపగలరు. అంతేకాదు. పురుషులకన్న స్త్రీలు సూక్ష్మబుద్ధిగలవారు (క్షమించాలి సోదరులు నిజము చెప్పినందులకు) అది నిర్వి వాదాంశము. మనస్తత్వ శాస్త్రవేత్తలు, ప్రపంచానుభవజ్ఞానులు ఒప్పుకొనిన సత్యమే. కాని శారీరకముగా స్త్రీలు పురుషులతో పాటు పోటీ చేయజాలరు. ఇందులకు స్త్రీలేల సిగ్గుపడవలయును ? మీరు దుర్బలులని పురుషులు మనలన్నంత మాత్రమున మనకు కలిగిన నష్టమేమి ? దేహదౌర్బల్యమునకు బదులు మనకు వారికంటె ఎక్కువ మనోబలము కలందులకు గర్వించవచ్చునే. మొన్న మన ఆరోగ్యశాఖా మంత్రి అమృతకౌరుగారును, పాటియాలా మహారాజాగారూ **Foot ball** స్త్రీలకు తగిన ఆట కాదన్నందుకు వారితోను కయ్యమునకు పోవలసినదేనా ?

పాపము కట్జూగారు ఈ సంవత్సరము ఏమి తల పెట్టినా ప్రజాప్రతినిధుల సభలలో ఆయనకు అన్ని ఆటం

మనలో మనమాట

కాలే. సరే ఏదో ముసలాయన. అన్నీ ముసలి ఉద్దేశాలే నని అనుకుందాము. మరి నెహ్రూగారు ఈ స్త్రీల ఉద్యోగాల విషయమందు ఎమ్పీలు స్త్రీలతో ఏకీభవించ లేకపోయాడు. స్త్రీలు గొప్ప గొప్ప ఉద్యోగాలకు అర్హులేనని ఆయన వప్పుకున్నాడు. కాని ఒక్కొక్కప్పుడు ఉద్యోగమునకు వివాహము ప్రతిబంధమని ఆయన చెప్పవలసి వచ్చింది. ఎమ్పీ స్త్రీల కోరికలు సమంజసము కావని చెప్పాడు. పైగా ఈవిషయము చెప్పుతూ - మన భారత సైన్య దళాలలోకి స్త్రీలను తీసికొనమంటే నేను వెనుకాడవలసి వస్తుందని గూడా అన్నాడు. మొన్న పత్రికలలో ఒక భారతనారి తుపాకీ కాల్పుల పందెములలో (Rifles) ప్రపంచ రికార్డు ఏర్పరిచినట్లు ప్రకటితమైనది. కావున రేపు కొందరు స్త్రీలు ఏమయ్యా నెహ్రూ ! చూడు మా స్త్రీలెంతటి ఘనులో ! భారతభూమిలోనేగాదు, ప్రపంచ రికార్డు ఏర్పరచగల స్త్రీలుండగా వారివీ సైన్యములోకి ఎందుకు తీసికోవయ్యా. నీ అభ్యంతరమేమి ? గాజులు తొడుక్కున్న మగవారికన్న, యూనిఫారము ధరించిన స్త్రీలు మేలు. ఇకనైనా భారత రాజ్యాంగ చట్టము ననుసరించి స్త్రీలకు మన సేనలలో ఉద్యోగములు ఎర్పాటు చెయ్యి. నీ పుట్టేమి మునగదు. భారత దేశము సురక్షితముగానే యుండగలదని' కొంతమంది స్త్రీలు రేపు నెహ్రూగారిని అడగవచ్చు !

ఇంతకీ స్త్రీలు వివాహానంతరము ఒక్కొక్కప్పుడు వారి ఉద్యోగములకు అనర్హులగుదురన్నంత మాత్రమున స్త్రీజాతికెట్టి అవమానముకాని అన్యాయముకాని జరుగబోదు. స్త్రీలు అన్ని ఉద్యోగములు పురుషులకన్న బాగుగనే చేయగలరు. శ్రీ నెహ్రూగారు విశ్రాంతి తీసికొన దలచినప్పుడు కావలిస్తే కొన్నాళ్ళపాటు ఓ స్త్రీకి భారత ప్రధానామాత్యుని పదవి వప్పజెప్పితే ఆయనకు దేశానికీ కూడ స్త్రీ శక్తి సామర్థ్యములు తెలియగలవు.

కాని స్త్రీకి ఏ ఉద్యోగము చేయుటకైనా (ప్రధానామాత్యుని పదవినైన) వివాహముతోపాటు కొన్ని అనర్థతలు సంప్రాప్తము కాక తప్పవు - స్త్రీలకు ఆఫీసులో ఉద్యోగముతో పాటు గృహమందు ఉద్యోగము తప్పదు. ఈ డబులు డ్యూటీ చేయుటకు మనోబలమెంత నున్నను శరీరబల ముండవలయును కదా ? కావున ఇంతటితో స్త్రీలే రభస ముగించితే మంచిది.

ఇదంతా మనలో మనమాటలే సుమండీ !

కె. లక్ష్మి. ర.

గృహ విజ్ఞానమునకు బహూకృతి.


దేశంలో కొత్తగా చదువునేర్చుకున్న వయోజనుల ఉపయోగార్థము వివిధ భాషలలో రచియింపబడిన పుస్తకాలలో 35 పుస్తకాలకు ప్రభుత్వము ఎడేసి వందల రూపాయల బహుమతులు ప్రకటించినది. తెలుగులో మూడు పుస్తకాలకు బహుమతులు లభించాయి.

శ్రీమతి కోడూరి లీలావతిదేవిగారు వ్రాసిన గృహ విజ్ఞానమునకు ఒక బహుమతి లభించింది. ఇదివరకే దీనికి తెలుగుభాషా సమితివారు బహుమానం ఇచ్చియుండిరి.

నమ్మకమంటే ఇదేనా ?

డాక్టరు మత్ల్ జూడీలీత్ వేయట్ అనే ముప్పదైదేళ్ళ యువతి ఒక కొత్తరకము హోటలు ఏర్పాటుచేసింది. అక్కడ బిల్లు పద్ధతి లేదు. కావలసినంత తిని ఇష్టము వచ్చినంత ఇచ్చి వెళ్ళవచ్చునట.

ఈ హోటలు ఆరంభించి ఇప్పటికి అయిదు మాసములైనదట. కుమారి జూడీలీత్ వేయట్‌కు ఈ పద్ధతి సంతృప్తికరముగనేవున్నదట. బిల్లు లిచ్చివుంటే వచ్చే ఆదాకన్నా ఇంకా నూటికి పది ఎక్కువగానే ఆమెకు ముట్టినవట !



పుష్పవల్లి

శ్రీ విఘ్నేశ్వరగ్రంథమాలా ప్రచురణము. గ్రంథకర్త ఉభయభాషా ప్రవీణ, విద్వాన్ కోగంటి దుర్గా మల్లికార్జున రావుగారు. భారతీసమితి, పామర్రు. వెల రు 0–8–0.

ఈ గ్రంథకర్తగారు అప్పుడప్పుడు ఆంధ్ర పత్రికలో ప్రకటనకు, తదితర సందర్భాలలోను వివిధ శీర్షికలక్రింద వ్రాసినపద్యాలను యీ 'పుష్పవల్లి'గాగుచ్చి ముద్రించారు. శరీరానికి - మనస్సుకు ఉన్న అవినాభావ సంబంధం వలె ఈ రచనలో భాషాసేవ – దేశసేవ గోచరిస్తున్నాయి. వీరు వెలిబుచ్చిన సంకల్పాలలో ఆంధ్ర రాష్ట్రం వర్తె రాలు కొన్ని సాకారాం దాల్చాయి.

కె. సు.

'హృదయేశ్వరి'

రచన : తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి

ప్రకాశకులు : సాహితీ సమితి, రేపల్లె

వెల :— రూ 1-8-0

ఈ కావ్యానికి ఇది ద్వితీయ ముద్రణము. ప్రథమ ముద్రణ 1925 లో జరిగింది. నాటికి నేటికి చదువరుల అభిరుచులలోను, కవిత్వ పోకడలలోను వింత మార్పు కలిగింది. అప్పటిరోజుల్లో 'హృదయేశ్వరి' కవిత్వ పద్ధతిలో ఎట్టి సంచలనానికి తావిచ్చినా కథావస్తువు చేతను, రచనా విధానం వల్లను నేటి అభి రుచులకు, దృక్పథాలకు సమయోచితంగానే కనిపిస్తుంది.

కావ్యానికి – ముఖ్యంగా అష్టమ నవమోచ్ఛ్వాసములు కవిత్వ పద్ధతిలో వినూత్న పోకడలను కల్పించి ఆధునిక వాఙ్మయంలో గ్రంథకర్త తమ "హృదయేశ్వరి"ని చిరాయువులుగా చేసుకున్నారు.

గిడుగు లక్ష్మీకాంతమ్మ.

గాలిమేడల అమెరికాలో

రచయిత : ఎల్. ఎన్. రావుగారు, మెంబరు, సర్వెంట్సు ఆఫ్ఇండియా సొసైటీ వలయువారు పై చిరునామాకు కాజీకోడ్ 2, మలబారు జిల్లా అని వ్రాయవలెను, వెల— రూ 1–8–0.


శ్రీ రావుగారు 1953 ఏప్రెల్ – సెప్టెంబరుల మధ్య అమెరికా దేశం పర్యటిస్తూ "సాధన" పత్రికకు వ్రాసిన యిరువై లేఖల సంకలనం. వీరు దేశమున గాంచిన వింతలు, విశేషాలు - ఒక ట్రావెల్‌గైడుగా వుండాలనిగాక - విదేశీ యాత్రలకు పోలేని వారికి కొంత విజ్ఞానదాయకంగా ఉండాలనీ, తెలుగుతల్లి పాదములకడ తమ యథాశక్తినొక అడవిమల్లె నిడవలెననీ రచించిన ప్రయత్నము. స్కూళ్లలో నాన్డిటెయిల్డ్‌గా నుంచబడే భాగ్యము లభిస్తే ద్వితీయ ముద్రణలో తగుసవరణలు గావిస్తామని ఆంధ్రలోకానికి మనవి చేస్తున్నారు.

Edited by Mrs. K. Lakshmi Raghuram, B.A.,
Printed & Published by Mrs. A. C. Krishna Rao, M.A., L.T.,
at the Andhra Mahila Press, Mylapore, Madras 4.

ఆంధ్రమహిళ



11-వ వార్షిక సంచిక



వస్తున్నది!
వాహినీ
వారి
బంగారు పాప
నిర్మాత-దర్శకుడు
బి. యన్. రెడ్డి

ఆంధ్ర మహిళ

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

ఎం.ఏ., బి.ఎల్.,

సంపాదకురాలు :

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

సంయుక్త సంపాదకురాలు :

శ్రీమతి కె. సుగుణమణి

సంవత్సర చందా ఆరు రూపాయిలు

ఆంధ్ర మహిళా సభవారిచే స్థాపించబడిన ముద్రణాలయములో ముద్రితము.


డిసెంబర్ విడుదల...
శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం
కంపెనీ వారి......
సతీ సక్కుబాయి
కన్నాంబ • యస్. వరలక్ష్మి • కనకం • రేలంగి
శివరావు • సి. యస్. ఆర్ • సూరిబాబు •
రఘురామయ్య • నటించినది......
డైరెక్టర్ • కె. బి. నాగభూషణం